28-11Pg1exHMNWJQEBPRCKLT_28-11Pg1exHMNWJQEBPRCKLT.qxd 11/28/2025 1:40 AM Page 1




# తెలుగు జాతీయ దినపత్రిక వార్త




epaper.vaartha.com WWW.VAARTHA.COM
గుంటూరు
: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-11-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 297 పేజీలు: 10+4 వెల: 6.50




## ప్రజా రాజధాని
# అమరావతికి ఆర్థిక మణిహారం

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి మరో చారిత్రాత్మక ఘట్టానికి వేదిక కానుంది.
ప్రజా రాజధాని ఇకపై ఆర్థిక కార్యకలాపాలకు కేంద్ర బిందువు అయ్యేలా...

15 బ్యాంకింగ్ & బీమా సంస్థల ప్రధాన కార్యాలయాల నిర్మాణానికి
## నేడు శంకుస్థాపన








ముఖ్య అతిథి
## శ్రీమతి నిర్మలా సీతారామన్
కేంద్ర ఆర్థిక మరియు కార్పొరేట్ వ్యవహారాల శాఖ మంత్రి

గౌరవ అతిథి
## శ్రీ నారా చంద్రబాబు నాయుడు
ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

వేదిక : సీఆర్డీఏ కార్యాలయం వద్ద
తేదీ : 28 నవంబరు, 2025
సమయం : ఉదయం 10 గంటలకు

ఈ ఆర్థిక సంస్థల ద్వారా
రూ.1,328 కోట్ల పెట్టుబడులతో పాటు
6,541 ఉద్యోగాలు రానున్నాయి

Amaravati THE PEOPLE'S CAPITAL

SBI | LIC | Canara Bank | Bank of Baroda | IDBI BANK | Indian Overseas Bank | Indian Bank | Union Bank | Central Bank of India | punjab national bank | Bank of India | ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ Andhra Pradesh Grameena Bank | APCOB | NABARD

జారీచేసిన వారు: సంచాలకులు, సమాచార, పౌర సంబంధాల శాఖ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

28-11pg2exHMNWJQEVP_28-11pg2exHMNWJQEVP.qxd 11/28/2025 1:41 AM Page 1





గురువారం వెంకటపాలెం వెంకటేశ్వరాలయ విస్తరణ పనులకు శంకుస్థాపన చేస్తున్న సిఎం చంద్రబాబు

# దేవతల రాజధానిగా అమరావతి

>> రిండి, స్వామి వారిని దర్శించుకున్నారు. అనంతరం టిటిడి ఛైర్మన్ నాయుడు ముఖ్యమంత్రికి శ్రీవారి లడ్డు ప్రసాదాలు అందజేశారు. వేద పండితులు వేద ఆశీర్వచనం అందించారు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఒక పవిత్ర దేవాలయమైన వెంకటేశ్వరస్వామి ఆలయ విస్తరణ పనులకు సంకల్పించామన్నారు. దేవతల రాజధాని అమరావతి అన్నారు. మన రాష్ట్రంలో కలియుగ దైవం అవతరించారు. 2019లో ఆలయాన్ని నిర్మించేందుకు సంకల్పించాం అన్నారు. ఇక్కడి రైతులు సహకరించి 33 వేల ఎకరాలను స్వచ్ఛందంగా ల్యాండ్ పూలింగ్ విధానంలో ఇచ్చారు.25 ఎకరాల్లో పవిత్రమైన ప్రదేశం, కృష్ణానది ఒడ్డున వెంకటేశ్వరస్వామి దేవాలయాన్ని నిర్మించుకుంటున్నామన్నారు. ఈ అమరావతి విషయంలో ఎవరికీ అనుమానం అవసరం లేదు అన్నారు. దేవతల రాజధానిగా అమరావతి ఎప్పుడూ ఉంటుంది...ఆ నమూనాగా మన అమరావతి ఉండాలని వెంకటేశ్వరస్వామిని కోరుకుంటున్నా అన్నారు. ఎన్టీఆర్ తిరుపతిలో నిత్య అన్నదానం 1983లో ప్రారంభించారు అన్నారు. నేను 2003లో ప్రాణదానం తిరుపతిలో ప్రారంభించాను అన్నారు. వేంకటేశ్వరస్వామికి అపచారం తెచ్చే పనులు చేయను. ఎవరినీ దేవుని వ్యవస్థ.ఆ దేవుడి సన్నిధిలో మనం ఉన్నప్పుడు పవిత్రత, పరిశుభ్రత, స్వచ్ఛమైన ఆలోచన ఉండాలి. అన్నారు.అప్పుడే నిజమైన భక్తితో పనిచేసినట్లు అవుతుంది అన్నారు.నేను ఎప్పుడు తిరుపతి వెళ్లినా క్యూలైన్లో భక్తితో వెళ్తాను. దేవుడి దగ్గరకు పెత్తందారుగా వెళ్లకూడదు అన్నారు. తప్పు చేసిన వారిని ఆ జన్మలోనే స్వామి శిక్షి స్తారు అన్నారు. ఆయన పవిత్రను ఆయనే కాపాడుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం విధ్వంసం తప్ప మంచిచేసిన సందర్భాలులేవు. మంచి సంకల్పంతో రైతులు భూములు ఇస్తే నరకాన్ని చూపించారు. మీరు వేంకటేశ్వరస్వామిని నమ్ముకున్నారు. న్యాయస్థానం నుంచి దేవస్థానం వరకు యాత్ర చేసి రాజధానిని కాపాడుకోవడానికి పాటుపడ్డారు అన్నారు.ఈ పవిత్రమైన దేవాలయాలయాన్ని రూ.260 కోట్లతో పూర్తి చేస్తాం అన్నారు.అమరావతికి వచ్చే ఈ ప్రాంతాన్ని కాపాడే శక్తి దేవాలయానికి ఉంది.రెండుసార్లుగా ఈ పనులు పూర్తి చేయాలని టిటిడిని కోరుతున్నాన్నారు. రాష్ట్రంలో దేవాలయాల నిర్మాణానికి భక్తులు ముందుకు రావాలి రాజధానిలో శ్రీవారి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించాలని ఏడేళ్ల ముందు అప్పటి టిటిడి సర్కార్ నిర్ణయం తీసుకుంది. వెంకటపాలెం వద్ద ప్రధాని అనుసంధాన రహదారికి, కృష్ణా కరకట్ట మధ్యలో 25 ఎకరాలను కేటాయించింది. రూ.150 కోట్ల అంచనా వ్యయంతో తిరుమలను తలపించేలా శ్రీవారి ఆలయం నిర్మించాలన్నది ఆలోచన. ఈ ప్రతిపాదనకు టిటిడి ధర్మకర్తల మండలి 2018లో ఆమోదం తెలిపింది. శంకుస్థాపన కార్యక్రమంలో కేంద్ర మంత్రి చంద్రశేఖర్, రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి పి.నారాయణ, సివిల్ సప్లయిస్ శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, టిటిడి ఇఒ అడిషనల్ ఈవో సిహెచ్ వెంకయ్య చౌదరి, జేఈవో వి వీరబ్రహ్మం, సివిఎస్వో కేవీ మురళీకృష్ణ,పలువురు టిటిడి బోర్డు సభ్యులు, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, పలువురు అర్చకులు, శ్రీవారి సేవకులు, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**రెండు దశల్లో రూ.260 కోట్లతో చేపట్టనున్న పనులకు శంకుస్థాపన**

మొదటి దశలో రూ.140 కోట్ల వ్యయంతో విస్తరణ పనులు రూ.92 కోట్లతో ఆలయం చుట్టూ ప్రాకారం. రూ.48 కోట్లతో ఏడంతస్తుల మహా రాజగోపురం, ఆర్జిత సేవా మండపం, అద్దాల మండపం, వాహన మండపం, రథ మండపం, ఆంజనేయ స్వామి ఆలయం, పుష్కరిణి, కట్ స్టోన్ ఫ్లోరింగ్ నిర్మాణం చేపడతారు.రూ.120 కోట్లతో రెండోదశ పనులు. శ్రీవారి ఆలయ మాడ వీధులు, అప్రోచ్ రోడ్లు, అన్నదాన కాంప్లెక్స్, యాత్రికులకు విశ్రాంతి భవనం, అర్చకులుసిబ్బందికి క్వార్టర్స్, రెస్ట్ హౌస్, పరిపాలనా భవనం, ధ్యాన మందిరం, వాహనాల పార్కింగ్ సౌకర్యాల కల్పనకు శంకుస్థాపనను సిఎం చంద్రబాబు చేసారు.

# 'ద్వితా్వహ్' తుఫాన్

>> ఖాతం తమిళనాడు ప్రాంతాల్లో తీరం దాటుతుందని అంచనా వేస్తున్నారు. దక్షిణ కోస్తా, రాయలసీమ ప్రాంతాల్లో 24 గంటల్లో ఈదురుగాలులు కొనసాగే అవకాశం ఉందని వాతావరణ అధికారులు చెప్పారు. దీని ప్రభావంతో శనివారం నుంచి సోమవారం వరకూ రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. శనివారం పొట్టి శ్రీరాములు నెల్లూరు, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు, ప్రకాశం, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో భారీ వర్షాలు కురవొచ్చని తెలిపింది.ఆదివారం నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, వైఎస్సార్ కడప జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు, యానాంతో పాటు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, నంద్యాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశము ఉందని పేర్కొంది. గురువారం తీరం వెంబడి గంటకు 55 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. శుక్ర, శని, ఆదివారాల్లో గరిష్ఠంగా 60 కిలోమీటర్ల నుంచి 70 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. సముద్రం అలజడిగా మారనున్న నేపథ్యంలో ఆదివారం వరకు మత్స్యకారులు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ఇక మలక్కా జలసంధి, ఇండోనేసియా సమీపంలోని తీవ్ర వాయుగుండం ఇప్పటికే తుపానుగా బలపడింది. దీనికి భారత వాతావరణ విభాగం సెన్యార్‌గా నామకరణం చేసింది. ఇది పశ్చిమ దిశగా కదులుతూ అతి తక్కువ సమయంలోనే ఇండోనేసియాలో తీరం దాటింది. ఈరోజు (గురువారం) సాయంత్రం వరకు తీవ్రత కొనసాగుతుందని, తర్వాత బలహీనపడుతుందని అంచనా. ఇది దిశ మార్చుకుని తిరిగి మలేసియా వైపు వెళ్లే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. దీని ప్రభావం భారత భూభాగం పై ఉండదని స్పష్టం చేసింది.

# 3 కొత్త జిల్లాల నోటిఫికేషన్లు జారీ

>> జిల్లాలో పీలేరు, నంద్యాల జిల్లాలో బనగానపల్లె, శ్రీసత్యసాయి జిల్లాలో మడకశిర రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. కర్నూలు జిల్లా ఆదోని మండలాన్ని విభజించి కొత్తగా పెద్దహరివనం మండలాన్ని ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు.

ఇక రాష్ట్రంలో ఏర్పాటు కానున్న మూడు జిల్లాలను పరిశీలిస్తే.. రంపచోడవరం నియోజకవర్గంలోని రంపచోడవరం, చింతూరు రెవెన్యూ డివిజన్లతో కొత్తగా పోలవరం జిల్లా ఏర్పాటు కానుంది. రంపచోడవరం రెవెన్యూ డివిజన్లో రంపచోడవరం, దేవీపట్నం, వై రామవరం, గుర్తేడు, అడ్డతీగల, గంగవరం, మారేడుమిల్లి, రాజవొమ్మంగి మండలాలు ఉండనున్నాయి. ఇక చింతూరు డివిజన్లో యెటపాక, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలను చేర్చారు.

యర్రగొండపాలెం, మార్కాపురం, కనిగిరి, గిద్దలూరు నియోజకవర్గాల్లోని మార్కాపురం, కనిగిరి రెవెన్యూ డివిజన్లతో కొత్త జిల్లాగా మార్కాపురం ఏర్పాటు కానుంది. ఈ రెవెన్యూ డివిజన్లోని యర్రగొండపాలెం, పుల్లల చెరువు, త్రిపురాంతకం, దోర్నాల, పెద్దారవీడు తుర్లుపాడు, మార్కాపురం, పొదిలి, కొనకనమిట్ల మండలాలు, అలాగే కనిగిరి డివిజన్లోని హనుమంతునిపాడు, వెలిగండ్ల, కనిగిరి, పెదచెర్లోపల్లి, చంద్రశేఖరపురం, పామూరు, గిద్దలూరు, బేస్తవారిపేట, రాచర్ల, కొమరోలు, కంభం, అర్ధవీడు మండలాలు కొత్తజిల్లాలో ఉండనున్నాయి. అలాగే ఇతర జిల్లాలు, మండలాలు ఏర్పాటు చేయనున్నారు.

# మంగళగిరిలో మోడల్ గ్రంథాలయం

>> ఫ్లోర్లో పిల్లల కోసం రీడింగ్ రూమ్, ప్లే ఏరియా, వివిధ దిన పత్రికలు, వార, మాసపత్రికలు అందుబాటులో వుండేవిధంగా రూమ్, బుక్ రీడింగ్ రూమ్, సీనియర్ సిటిజన్స్ రీడింగ్ ఏరియా, పబ్లిక్ రీడింగ్ ఏరియా, ఫలహారశాలతో పాటు మొదటి అంతస్తులో రెండు టీచింగ్ హాల్స్, స్టడీ రూమ్, నైపుణ్యంతో పాటు పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే వారికోసం రీడింగ్ ఏరియా, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ రిసోర్స్ సెంటర్లను ఏర్పాటుచేశారు. మోడల్ పబ్లిక్ లైబ్రరీ ప్రారంభోత్సవం సందర్భంగా 1986లో స్వర్గీయ ఎన్టీఆర్ చేసిన శిలాఫలకం వద్ద మంత్రి నారా లోకేష్ సెల్ఫీ దిగారు. లైబ్రరీ మొత్తం కలియతిరిగి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో ఫోటోలు దిగారు.

**ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాల ఆవిష్కరణ**

మంగళగిరి రూరల్ పరిధిలోని ఆత్మకూరు సెంటర్‌లో ఏర్పాటుచేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు విగ్రహాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ముందుగా ఆత్మకూరు సెంటర్‌కు చేరుకున్న మంత్రి లోకేష్‌కు స్థానిక టిడిపి నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. అనంతరం గ్రామంలోని శ్రీ గంగానమ్మ తల్లి దేవాలయాన్ని మంత్రి లోకేశ్ సందర్శించారు. అమ్మవారిని దర్శించుకుని మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

**కొండపనేని టౌన్ షిప్ పార్క్ ప్రారంభం**

మంగళగిరి బైపాస్‌లోని కొండపనేని టౌన్ షిప్ వద్ద రూ.1.23 కోట్ల వ్యయంతో 0.65 ఎకరాల్లో ప్రభుత్వం నూతనంగా అభివృద్ధి చేసిన కొండపనేని టౌన్ షిప్ పార్క్‌ను మంత్రి నారా లోకేష్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ పార్క్‌లో అత్యాధునిక సౌకర్యాలను ఏర్పాటుచేశారు. ప్లాజా, వాకింగ్ ట్రాక్, ఇంటర్నల్ పాత్ వేస్, స్టేజ్, యోగా డెక్, సీనియర్ సిటిజన్ సీటింగ్ ఏరియా, ఔట్ డోర్ జిమ్ ఏరియా, మోడ్రన్ లైటింగ్, చిల్డ్రన్ ప్లే ఏరియా, లాన్ ఏరియాలను ఏర్పాటుచేశారు. పార్క్‌లో వసతులను ఈ సందర్భంగా మంత్రి పరిశీలించారు. అనంతరం మంగళగిరి ఆటోనగర్‌లో మహమ్మద్ అలీ గౌస్, సయ్యద్ హుస్సేన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన బిస్మిల్లా మటన్ హౌస్‌ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల కార్పోరేషన్ ఛైర్మన్ ఎస్ రాజశేఖర్, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ టిడిపి ప్రధానకార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతోపాటు పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పోలీసుల అదుపులో దేవ్‌జీ, మరో 50 మంది!

## 30న దండకారణ్య బంద్: మావోయిస్టుల లేఖ

**చర్ల,నవంబర్ 27, ప్రభాతవార్త:** మారేడుమిల్లి అటవి ప్రాంతంలో నవంబరు 18న జరిగిన నకిలీ ఎన్ కౌంటర్ లో కేంద్ర కమిటి సభ్యుడు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి సభ్యుడు మడివి హిడ్మాతో సహ ఆరుగురు మృతిచెందగా 19న జరిగిన మరో భూటకపు ఎన్ కౌంటర్లో ఏవోబి సభ్యుడు సురేష్ టెక్ శంకర్ తో 5గురు కాంమ్రెడ్స్ మృతిచెందారనివీరందరినీ పోలీసులు పట్టుకొని చంపారని ఈ ఎన్‌కౌంటర్‌కి నిరసనగా ఈనెల 30న చత్తీస్‌గఢ్ దండకారణ్య బంద్ పిలుపునిస్తున్నామని మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి కార్యదర్శి వికల్ప్ పేరట పత్రికలకు సంచలన లేఖ విడుదల చేసారు.

**పోలీసుల అదుపులో దేవ్ జీ**

మా వోయిస్టు కేంద్ర కమిటి కార్యదర్శి తిప్పరి తిరుపతి ఆలియాస్ దేవ్ జీ పోలీసుల అదుపులో ఉన్నట్లు వికల్ప్ పత్రికలకు పంపిన లేఖలో పేర్కొన్నారు.దేవ్‌జీ తోపాటు మరో 50 మందిని హిడ్మా ఎన్ కౌంటర్ రోజునే వివిధ ప్రదేశాలలో అరెస్టు చేసారని పోలీసులఅదుపులో తిరుపతితో పాటు మరో 50 మంది సభ్యులకు ఎటువంటి హాని తలపెట్ట కుండా కోర్టులో హాజరు పరచాలని కోరారు.ఏపి పోలీసుల అదుపులో ఉన్న దేవ్ జీ మిగిలిన సభ్యుల విడుదలకు న్యాయవాదులు మానవహక్కులసంస్థలు సామాజిక సంస్థలు ప్రజా స్వామిక వాదులు విద్యార్థులు మేధావులు పత్రికా మిత్రులు కృషిచెయ్యాలని విజ్ఞప్తి చేసారు. ఇటువంటి మారణగోమాలను ఆపడానికి ముందుకు సాగాలని ఈ అణిచివేతకు వ్యతిరేకంగాజరుగుతున్న ప్రజా ఉద్యమాలకు మద్దతుగా నిలవాలని కోరారు.కాగా హిడ్మా ఎన్ కౌంటర్‌పై న్యాయవిచారణ చెయ్యాలని హక్కులసంఘాల నేతలు ఇప్పటికే కోరుతుండగా దేవ్ జీ పోలీసుల అదుపులో ఉన్నాడని ఆయన్ని వెంటనే కోర్టులో హాజరు పరచాలని మద్దతుదారులు ప్రజాసంఘాల నేతలుహైకోర్టును ఆశ్రయించిన వేళ ఆంధ్రప్రదేశ్ డిజిపి దేవ్ జీ పోలీసుల అదుపులో లేదని కోర్టువిన్నవించినట్లు పత్రికలలో చూసాం.కాగా మావోయిస్టు దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటి కార్యదర్శి వికల్ప్ పేరట విడుదలైన లేఖతో సర్వత్రా కొంత ఆందోళన నెలకొంది.

**వారం - వర్జ్యం**

28-11-2025, శుక్రవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
మార్గశిరమాసం, దక్షిణాయణం
శరద్ ఋతువు, శుక్లపక్షం
అష్టమి రా.12.11
శతభిషం రా.2.46, అనూరాధ కార్తె
వర్జ్యం : ఉ.9.03-10.37
దు.ఉ.8.34-9.19,
2) మ.12.19-1.04
రాహుకాలం - ఉ.10.30-12.00

**వార్తాఫలం**

**వేషం:** విజ్ఞాన సంబంధిత అంశాల పట్ల ఆకర్షితులవుతారు. రహస్యమైన ఒప్పందాన్ని కుదుర్చుకుంటారు. మీలోని ప్రతిభకు గుర్తింపు పొందుతారు.

**వృషభం:** దాన, ధర్మాలు చేస్తారు. మమ్మల్ని సహాయం అర్థించిన వారికి చేతనైన సహాయాన్ని అందిస్తారు.

**మిథునం:** చేతి వృత్తి పనివారికి అనుకూలంగా ఉంటుంది. రాజకీయ పరిచయాలు ఉపకరిస్తాయి. నూతనవస్తు, వస్త్రాలు కొనుగోలు.

**కర్కాటకం:** కోర్టు కేసులు వాయిదాలలో ఉంటాయి. మీకు రావలసిన ప్రయోజనాలను పోరాడి సాధించుకుంటారు.

**సింహం:** ఇతరత్రా విషయాల ప్రభావం వృత్తి, వ్యాపారాలపైన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోగలుగుతారు. ప్రయాణాలు సౌలభ్యం.

**కన్య :** వ్యక్తిగత పురోభివృద్ధికి ఉపకరించే అవకాశాలు అందివస్తాయి. సద్వినియోగ పరచుకోండి. ఎవరినైనా మాటల చాతుర్యంతో ఆకట్టుకుంటారు.

**తుల :** స్పెక్యులేషన్ ఎంత మాత్రమూ లాభించదు. ప్రజా సంబంధాలను వృద్ధి చేసుకోవడానికి మీరు ప్రయత్నాలు ఫలిస్తాయి.

**వృశ్చికం:** సహోదర వర్గం వలన చికాకులు ఏర్పడుతాయి. రచనా వ్యాసంగాలను సాగిస్తారు. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు.

**ధనుస్సు:** స్వార్థబుద్ధితో మీతో స్నేహం నటిస్తున్న వారిని గుర్తించి వారిని దూరంగా ఉంచుతారు. ప్రయాణాలు లాభిస్తాయి.

**మకరం:** జీవిత భాగస్వామి సహాయ సహకారాలు అందుకుంటారు. కొత్త పెట్టుబడులు అనుకూలంగా ఉంటాయి.

**కుంభం:** భూములకు సంబంధించి వివాదాలు తొలగుతాయి. నూతన ఒప్పందాలు కుదురుతాయి. వస్త్రాలాభం వుంటుంది.

**మీనం:** వాహనాలు, ఆభరణాలు, స్థలాలు కొనుగోలు చేస్తారు. నూతన ప్రయత్నాలు సాగిస్తారు. వృత్తి, వ్యాపారాలు విస్తరిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# టిటిడి మార్కెటింగ్ జిఎం అరెస్టు

>> విషయం విదితమే. ఇంకా మరోకోణంలో రెండువారాల క్రిందట టిటిడి మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి పూర్వ పిఎ చిన్నఅప్పన్నను అరెస్ట్‌చేసిన సిట్ కీలక సమాచారం సేకరించడం, ఆ తరువాత సుబ్బారెడ్డిని, మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డిని విచారణ చేయడం జరిగిపోయింది. ఇప్పుడు టిటిడి వర్గాల నుండి మార్కెటింగ్ జిఎంను అరెస్ట్‌చేసిన సిట్ మరీ ఈనెలాఖరుకు ఇంకెవరినీ అరెస్ట్ చేయనుందనేది టిటిడిలో సంచలనంగా మారింది. కల్తీనెయ్యి బాగోతంలో పోటు విభాగంపై కూడా ఆరోపణలు వెల్లువెత్తిన దరిమిలా అప్పటి పోటు అధికారులకు అరెస్ట్‌ల భయం పట్టుకుంది. టిటిడిలో ఒక్క నెయ్యిసరఫరాకు సంబంధించి మాత్రమేగాక ముడిపదార్థాలు, ఆహారపదార్థాలు,పప్పులు, యాలకులు, జీడిపప్పు,ఎండుద్రాక్ష, కుంకుమపువ్వు వంటి సరుకులు కొనుగోలుకు మార్కెటింగ్ విభాగం నుండి టెండర్ ప్రతిపాదనలు తయారుచేసి టిటిడి ఇఒకు, జెఇఒకు ఫైల్ పంపుతారు. దీన్ని పరిశీలించిన టిటిడి ఉన్నతాధికారులు అనంతరం టిటిడి బోర్డు ఆమోదం పొందుతారు. ఈ కొనుగోళ్ల నాణ్యతగా ఉండేలా, సరసమైన ధరలకు కొనుగోలుచేసేందుకు మార్కెటింగ్ విభాగం అధికారులతోబాటు బోర్డు సభ్యులను కొనుగోళ్ల కమిటీలో నియమించి అంతా సజావుగా జరిగేలా చూస్తారు.మార్కెటింగ్ విభాగంలో కొనుగోలు ప్రక్రియలో అవకతవకలకు పాల్పడటంతోబాటు నాణ్యతలేని నెయ్యి సరఫరాకు ఈయన సహకరించారనేది ఆరోపణలు. అయితే 2019-2024 సంవత్సరం మధ్యకాలంలో ఐదేళ్లలో అప్పటివైసిపి ప్రభుత్వం హయాంలోని వైసిపి బోర్డులో ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఇఒ ఏవి ధర్మారెడ్డి, కొందరు బోర్డు సభ్యులు కీలకంగా అధికారం చలాయించారనేది టిటిడి ఉద్యోగుల్లో వినిపించిన వ్యాఖ్యలు. ఇదే నేపథ్యంలో శ్రీవారి లడ్డూల తయారీకిఅవసరమైన నెయ్యి సరఫరా చేసేలా అప్పటి బోర్డులో పెద్దలు ఉత్తరాఖండ్‌లో ఉన్న బోలేబాబాడెయిరీ, తమిళనాడులోని ఎఆర్ డెయిరీ, తిరుపతి జిల్లా పునబాకలోని వైష్ణవీ డెయిరీ, ఉత్తరప్రదేశ్‌లోని మాల్‌గంగ డెయిరీలకు,ప్రుడెన్షియల్ ఆగ్రోపుడ్స్ డెయిరీల నుండి 1.61కోట్ల కిలోల నెయ్యి కొనుగోలుచేసినందుకు 250 కోట్ల రూపాయలు వరకు టిటిడి నగదు చెల్లించింది. ఇందులో 68లక్షల కిలోల నెయ్యి కల్తీజరిగినట్లు అధికారులు గుర్తించారు. తిరుమల ఆలయంలో పోటులో లడ్డూల తయారీకి రోజుకు 12వేల కిలోల నెయ్యి వినియోగం జరుగుతుంది. కల్తీనెయ్యి సరఫరా జరిగినా పరీక్షల ద్వారా తెలుసుకుని వెనక్కుపంపాల్సిన టిటిడి మార్కెటింగ్ విభాగం ఎందుకు మౌనం వహించిందనేది ఇప్పటికీ అర్థంకాని సమస్య. అంతేగాక మార్కెటింగ్ విభాగం, పరిశోధనశాల అధికారులపై ఒత్తిడి చేసిన అప్పటి బోర్డులో పెద్దలు, ఉన్నతాధికారులు ఎవరనేది కూడా ఇప్పుడు మార్కెటింగ్ జిఎం సుబ్రమణ్యంను సిట్ విచారణ చేసి కీలక సమాచారం రాబట్టనుంది. ఈ కేసు దర్యాప్తు దాదాపు చివరిదశకు చేరుకోవడంతో సిట్ అధికారుల బృందం దూకుడు మరింత పెంచింది.

**నెలాఖరులోపు నెక్స్ట్ అరెస్ట్‌లు ఎవరో?**

తిరుమల లడ్డూల తయారీకి కల్తీనెయ్యి సరఫరా జరిగిన సంచలన వ్యవహారంలో ఇప్పటికే 10మందిని పాత్రధారులను అరెస్ట్‌చేసిన సిబిఐ సిట్ అధికారుల బృందం గురువారం మార్కెటింగ్ జిఎంను అరెస్ట్ చేయడంతో నెలాఖరులోపు సూత్రధారులను అరెస్ట్‌చేయనుందనేది టిటిడిలో పెద్ద చర్చ మొదలైంది. టిటిడిలో ఎలాంటి నిధులు మంజూరుచేయాలన్నా, టెండర్లు పిలవాలన్నా, ఆ టెండర్లు ఏ సంస్థకు అప్పగించాలనే విషయాలపై అధికారులు ప్రతిపాదనలు తయారుచేసేలా టిటిడి ఉన్నతాధికారులు,బోర్డులో ఛైర్మన్, కొందరు సభ్యులు కీలకం. అలాంటిది 2019-24 మధ్య కాలంలో నెయ్యి సరఫరాకు టెండర్లు ఆమోదించిన కీలక సభ్యులు, అధికారులు ఇప్పుడు తెరపైకి రానున్నారు. సిట్ చిన్నఅప్పన్నను కూడా కస్టడీకి తీసుకుని అవసరమైన సమాచారం రాబట్టిందనేది తెలిసింది. ఇప్పటికే ఈకల్తీనెయ్యి సరఫరా, వినియోగించి లడ్డూల తయారీలో సిట్ అధికారులు మాజీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డిని, మాజీ ఇఒ ఏవి ధర్మారెడ్డిని విచారణ చేసినా పరస్పరం అటు బోర్డుపై ఇటు అధికారులపై వాదనలు వినిపించారనేది సిట్ రాబట్టిన కీలక విషయాలు. మరీ ఈ నేపథ్యంలో మలివిడతగా ఆ ఇద్దరు కీలక వ్యక్తులను మూడురోజుల్లో మళ్లీ విచారణ చేస్తే ఎలాంటి పరిణామాలు చోటుచేసుకుంటాయనేది కూడా టిటిడి వర్గాలను కలవర పెడుతోంది.



గురువారం న్యూఢిల్లీలో అంధుల టి-20 ఛాంపియన్స్‌తో ప్రధాని మోడీ

# అమరావతిలో మరో క్వాంటం కంప్యూటర్ భవనం

## మొదటి భవనానికి డిసెంబరులో శంఖుస్థాపన

## కంపెనీల నుంచి భారీగా ప్రతిపాదనలు

### అత్యున్నత ప్రమాణాలతో నిర్మించేందుకు అధికారుల యోచన

**విజయవాడ,నవంబరు 7,ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిలో మరో క్వాంటం భవనాన్ని నిర్మించాలని ఏపీ ప్రభుత్వం భావిస్తోంది,. క్వాంట ం వ్యాలీలో అమరావతి క్వాంటం కంప్యుటేషన్ సెంటర్(ఏక్యూసీసీ) భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే టెండరు పిలవగా...డిమాండ్ ఎక్కువగా ఉండటంతో అదనంగా మరో భవనాన్ని నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకోనున్నది..ప్రస్తుతం నిర్మించనున్న ఎకూ ్యసీసీ భవనంలో మూడు క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటుకు అవకాశం ఉంది. ఐబీఎం సంస్థ 133 క్యూబిట్‌ల సామర్థ్యం ఉన్న క్వాంటమ్ కంప్యూటర్‌ను ఇందులో ఏర్పాటు చేయనుంది.మైక్రోసాఫ్ట్‌తో పాటు మరో ప్రముఖ సంస్థ స్థానికంగా పెట్టుబడి పెట్టే భాగస్వామ్య సంస్థలతో సంప్రదింపులు జరుపుతోంది. ఆ రెండు సంస్థలూ ఏక్యూసీసీలో క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రాథమికంగా అనుమతించింది. అంటే నిర్మించనున్న భవనం ఆ మూడు కంప్యూటర్లకు సరిపోతోంది. వాటితో పాటు మరికొన్ని కంపెనీలు క్వాంటమ్ కంప్యూటర్ల ఏర్పాటుకు చోటు కల్పించాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాయి. ఈ దృష్ట్యా మరో భవనాన్ని నిర్మించాలని ప్రతిపాదించారు.అమరావతి క్వాంటమ్ వ్యాలీలో నిర్యించే భవనాలు క్లాస్-4 డేటా సెంటర్ కేటగిరీగా అధికారులు చెబుతున్నారు. ఇందులో ఏర్పాటు చేసే క్వాంటమ్ కాంప్యూటర్ 99,995 శాతం అప్‌టైమ్ లక్ష్యంతో పనిచేస్తుంది.ఐటీ కార్యకలాపాలకు ఇబ్బంది లేకుండా నిర్వహణ,మరమ్మత్తులు నిర్వహించే వీలుంటుంది.అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా ఏర్పాట్లు ఉంటాయి.ఒక వేళ సరఫరాలో అంతరాయం తలెత్తితే అందులోని కూలింగ్ సిస్టంలు పనిచేసేందుకు వీలుగా అతి పెద్ద యూపీఎస్ బ్యాకప్ జనరేటర్లు వంటి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఉంటాయి.ఈ భవనంలో ప్రెజర్,ఉష్ణోగ్రతలనుర నిర్ధిష్ట విధానంలో నిర్వహించాలి. కంప్యూటర్లు ఏర్పాటు చేసిన భవనంలో కనీసం పాదాలతో గట్టిగా చప్పుడు కూడా చేయకూడదు.ఈ తరహా డేటా సెంటర్ నిర్వహించాలంటే చదరపు అడుగుకు సుమారు రూ.25వేలు ఖర్చు అవుతుందని అధికారులు పేర్కొంటున్నారు. అమెరికా వంటి దేశాల్లో రూ.80 వేలు ఖర్చవుతుంది. ఈ ప్రమాణాలతో భవనాన్ని నిర్మించాలంటే కనీసం 6 నెలలు పడుతుంది. ఏవైనా సంస్థలు క్వాంటం కంప్యూటర్లు ఏర్పాటు చేయడానికి ఆసక్తి వ్యక్తం చేస్తే ప్రస్తుతం స్పేస్ ఇచ్చే అవకాశం లేదు. అందువల్ల ముందస్తుగా మరో భవన నిర్మాణానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు. క్వాంటమ్ కంప్యూటర్ ఏర్పాటుకు అవసరమైన స్పేస్ మాత్రమే ప్రభుత్వం కల్పిస్తుంది. కంప్యూటర్ తయారీ కోసం నిధులు కంపెనీకి సొంతంగా సమకూర్చుకోవాలి. వాటికి వచ్చే ఆదాయంలో కొంత మొత్తాన్ని ప్రభుత్వానికి ఇవ్వాలి.క్వాంటమ్ వ్యాలీలో రూ.99.62 కోట్లతో ఏక్యూసీసీ భవన నిర్మాణానికి ప్రభుత్వం ఇప్పటికే టెండర్లు పిలిచింది. 45000 చదరపు అడుగులో కఠినమైన పర్యావరణ,వైబ్రేషన్ ఐసోలేషన్,ఎలక్ట్రో మాగ్నెటిక్ ప్రమాణాలకు అనుగుణంగా దీన్ని నిర్మిస్తున్నారు. దీనికి డిసెంబరు మొదటి వారంలో శంఖుస్థాపన నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఢిల్లీలో తెలంగాణ ఈగల్ టీమ్ భారీ ఆపరేషన్

## 50 మంది నైజీరియన్లు అరెస్ట్, సెక్స్ వర్కర్లు సైతం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబర్27:** తెలంగాణ పోలీసులు దేశ రాజధాని ఢిల్లీలో బిగ్ ఆపరేషన్ నిర్వహించారు. తెలంగాణ పోలీసుల ఈగల్ టీమ్, ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ సంయుక్తంగా చేపట్టిన భారీ ఆపరేషన్ లో అంతర్జాతీయ డ్రగ్స్ సరఫరా, హవాలా రాకెట్‌ను ఛేదించారు. నెలల తరబడి సాగిన ఈ ఆపరేషన్‌లో సేకరించిన ఆధారంతో తాజాగా 50మంది నైజీరియన్ పౌరులను అరెస్ట్ చేశారు. కిలోల కొద్ది అధిక విలువ చేసే మెతాంపెటమైన్, కొకైన్ వంటి సింథటిక్ డ్రగ్స్‌ను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఢిల్లీ క్రైమ్ బ్రాంచ్ సమన్వయంతో ఈగల్ టీమ్ ఢిల్లీలోని 20 కీలక లొకేషన్లపై ఆకస్మిక దాడులు నిర్వహించింది. ఈ ఆపరేషన్ కోసం తెలంగాణ ఈగల్ ఫోర్స్ ప్రత్యేకంగా రెండు రైలు బోగీల్లో 100 మందికి పైగా సిబ్బందిని ఢిల్లీకి తరలించినట్లు తెలుస్తోంది. వారంతా వారాల తరబడి ఢిల్లీలోనే మకాం వేసి ఇంటెలిజెన్స్ అభివృద్ధి, నిఘా, దాడుల అమలులో కీలక పాత్ర పోషించారు. నోయిడా, విజయవాడ, గ్వాలియర్ పోలీసులు సైతం ఈ ఆపరేషన్లో భాగమయ్యారు.డ్రగ్ కార్టెల్ నెట్వర్క్ ఢిల్లీ నుంచి హైదరాబాద్, బెంగళూరు, గోవా, కేరళ వరకు విస్తరించి ఉన్నట్లు విచారణలో బయట పడింది. కొరియర్ విధానం, డె డ్రాప్ పద్ధతుల్లో డ్రగ్స్ సరఫరా చేసిన ఈ గ్యాంగ్ దాదాపు 2,000 మంది కస్టమర్లను గుర్తించిందని అధికారులు వెల్లడించారు. ఆహార డెలివరీ యాప్ల తరహాలో దాచిపెట్టిన కమ్యూనికేషన్ విధానాలతో ట్రాన్సాక్షన్లు జరిగేవని అధికారుల సమాచారం. డ్రగ్స్ సరఫరా వ్యవస్థను మరింత విస్తరించడానికి సెక్స్ వర్నర్లను కూడా ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు.ఈ నేపథ్యంలో డ్రగ్స్ పాటు పలువురు సేల్స్‌గర్ల్స్, సెక్స్ వర్కర్లను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. డ్రగ్స్ విక్రయాల ద్వారా వచ్చిన డబ్బును స్థానిక హవాలా ఆపరేటర్ల ద్వారా దాచిపెట్టేందుకు ఈ సిండికేట్ వినూత్న పద్ధతులు అనుసరించినట్లు పోలీసులు కనుగొన్నారు.

# సిగాచీ పేలుళ్ల ఘటనలో దర్యాప్తుపై హైకోర్టు ఆగ్రహం

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్,నవంబరు27:** సిగాచీ పేలుళ్ల ఘటనలో పోలీసుల దర్యాప్తు తీరుపై రాష్ట్ర హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సిగాచీ పేలుళ్లపై బాబురావు అనే వ్యక్తి దాఖలు చేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై గురువారం హైకోర్టులో జరిగిన విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేష్ కుమార్ సింగ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇది సాధారణ ఘటన కాదని, 54 మంది కార్మికులు చనిపోయారన్నారు. ఇంకా దర్యాప్తు కొనసాగుతోందని చెప్పడమేంటని, ఇంత పెద్ద ప్రమాదంలో బాధ్యత ఎవరిదో ఇప్పటికీ నిర్ధారణ కాలేదా? అంటూ ఏఏజీ రజినీకాంత్ రెడ్డిని కోర్టు ప్రశ్నించింది. దర్యాప్తులో 237 మంది సాక్షులను విచారించినా ఇప్పటి వరకు ఎలాంటి పురోగతి లేదన్నారు. ఇప్పటి వరకు ఘటనకు బాధ్యులెవరని తేల్చలేదా అని ప్రశ్నించారు. ఇంత పెద్ద ఘటన జరిగితే డీఎస్పీని ఎందుకు దర్యాప్తు అధికారిగా నియమించారని ఏఏజీని సిజె నిలదీశారు. దర్యాప్తు కోసం ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్)ఏర్పాటు చేసి ఉండొచ్చు కదా అని సిజె ప్రశ్నించారు. ఈ కేసు తీవ్రత దృష్ట్యా ప్రత్యేక దర్యాప్తు బృందం ఏర్పాటు చేయాలని కోర్టు వ్యాఖ్యానించింది. పిటిషనర్ తరపు న్యాయవాది వసుధా వాదనలు వినిపించారు. పేలుడు సంభవించి ఐదు నెలలు దాటినా ఇప్పటి వరకు ఎవరినీ అరెస్ట్ చేయలేదని న్యాయవాది కోర్టుకు తెలిపారు. నిపుణల కమిటీ పరిశ్రమల నిర్వహణలో లోపాలున్నాయని తేల్చిందని, నిబం ధనలకు విరుద్ధంగా 17 టన్నుల సోడియం క్లోరైడ్ నిల్వ చేశారని కమిటీ గుర్తించినట్లు న్యాయవాది కోర్టుకు వివరించారు. పేలుడు తీవ్రతకు ఎనిమిది మంది శరీరాలు ఆనవాళ్లు లేకుండా కాలిపోయాయని న్యాయవాది వసుధా కోర్టు దృష్టికి తీసు కెళ్లారు. నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని ఏఏజీ రజినీకాంత్ కోర్టుకు తెలిపారు.

" భారత చైతన్య యువజన పార్టీ " ఒక క్రొత్త రాజకీ పార్టీగా ఆంధ్రప్రదేశ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదయ్యే ప్రక్రియలో జారీ చేయబడిన నోటీసు

(ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘము ఆదేశములతో ప్రచురించబడినది)

తేది: 26-11-2025

రాజకీయ పార్టీల రిజిస్ట్రేషన్ మరియు గుర్తుల కేటాయింపు ఉత్తర్వు, 2001నకు లోబడి భారత చైతన్య యువజన పార్టీ అధ్యక్షులు శ్రీ రామచంద్ర బోడె గారు తమ పార్టీని 'రిజర్వు గుర్తు లేని రాజకీయ పార్టీగా' ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద నమోదు చేసుకొనుటకై అభిలషిస్తున్నట్లు సాధారణ ప్రజానికానికి తెలియజేసేందుకు ఈ నోటీసు ఇవ్వడమైనది. పార్టీ ప్రధాన కార్యవర్గములో శ్రీ రామచంద్ర బోడె అధ్యక్షులు గాను, శ్రీమతి పి. సుశీల బాయి సాధారణ కార్యదర్శి గాను మరియు శ్రీమతి పాల శ్రీలత కోశాధికారి గాను వ్యవహరించెదరు. సదరు పార్టీ నమోదుపై ఎవరికైనా ఏనిధమైన అభ్యంతరాలు ఉన్నట్లయితే, అట్టి అభ్యంతరాలను కార్యదర్శి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎన్నికల సంఘము మొదటి అంతస్తు, క్రొత్త విభాగాధిపతుల భవనము, ఇందిరా గాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా, ఎం.జి.రోడ్, విజయవాడ - 520010. ఆంధ్రప్రదేశ్ వారికి ఈ ప్రకటన ప్రచురతమైన పదిహేను రోజుల్లోగా పంపవలెను. నిర్ణీత గడువులోగా అభ్యంతరాలేమి రానియెడల, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రములో పార్టీల పరంగా జరిగే స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీచేసేందుకు భారత చైతన్య యువజన పార్టీని ఒక రాజకీయ పార్టీగా నమోదు చేయు ప్రక్రియను రాష్ట్ర ఎన్నికల సంఘం చేపడుతుంది.

శ్రీ రామచంద్ర బోడె
అధ్యక్షులు - భారత చైతన్య యువజన పార్టీ

28-11Pg3exHMNWJQEV_28-11Pg3exHMNWJQEV.qxd 11/28/2025 1:45 AM Page 1

సమాలోచన
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

epaper.vaartha.com WWW.VAARTHA.COM

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
గుంటూరు

కపిల్ చిట్స్ తోడుంటే కనక మహాలక్ష్మీ మీ వెంటే
KAPIL GROUP
కపిల్ చిట్స్
Visit Us: www.kapilchits.com
కపిల్ చిట్స్ మీ కలలకు సాకారం

: fb.com/vaartha Digital

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

28-11-2025 శుక్రవారం సంపుటి: 31 సంచిక: 297 పేజీలు: 12 వెల: 6.50



గురువారం మంగళగిరిలో పౌర గ్రంథాలయాన్ని ప్రారంభించిన మంత్రి లోకేష్

## మంగళగిరిలో మోడల్ గ్రంథాలయం

### రూ. 1.72 కోట్లతో ఆధునీకరణ, ప్రారంభించిన మంత్రి లోకేష్

**విజయవాడ, నవంబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృషిచేస్తున్నారు. మంగళగిరి పట్టణం శివాలయం వద్ద రూ.1.72 కోట్లతో ఆధునీకరించిన మోడల్ పబ్లిక్ లైబ్రరీని మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. 1986లో ముఖ్యమంత్రి హోదాలో స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం పేరుతో మంగళగిరిలో లైబ్రరీకి శంకుస్థాపన చేశారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సారథ్యంలో మంత్రి నారా లోకేష్ చొరవతో లైబ్రరీని ఆధునీకరించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. లైబ్రరీ ఆధునీకరణకు సిఎస్ఆర్ ఫండ్స్ కింద గుంటూరు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ రూ.90 లక్షలు, ఎపి టెక్నాలజీ సర్వీసెస్ రూ.42 లక్షలు, నోవో ఇన్సూరెన్స్ బ్రేకింగ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.30 లక్షలు అందించారు. లైబ్రరీ గ్రౌండ్ >>2


# దేవతల రాజధానిగా అమరావతి

**తిరుమలలో ఎన్టీఆర్ అన్నదానం ప్రారంభిస్తే, నేను ప్రాణదానం చేపట్టా..**

**వేంకటేశునికి అప్రతిష్ట తెచ్చే పనులు చేయం, చేయనివ్వను**

**వెంకటపాలెంలో బాలాజీ ఆలయ రెండో ప్రాకారం అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన సిఎం చంద్రబాబు**

**మొదటి దశలో రూ. 140, రెండోదశలో రూ. 120 కోట్ల పనులు**



గురువారం వెంకటపాలెం వెంకటేశ్వరాలయ విస్తరణ పనుల శంకుస్థాపన సందర్భంగా ఏర్పాటు చేసిన శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సిఎం చంద్రబాబు

**విజయవాడ,నవంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగ దైవం వేంకటేశ్వర స్వామికి అపవిత్రత కలిగించే పని తాను చేయను, ఎవరినీ చేయనివ్వనని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. దేవతల రాజధాని ఎలా ఉంటుందో అదే నమూనాతో ఎపి రాజధాని అమరావతి ఉంటుందని సిఎం చంద్రబాబు అన్నారు. రాజధాని కోసం రైతులు 33వేల ఎకరాలు స్వచ్ఛందంగా ఇచ్చారని, పవిత్ర కార్యక్రమానికి రైతులు సహకరించారని అభినందించారు. రాష్ట్ర రాజధాని అమరావతిలోని వెంకటపాళెం వేంకటేశ్వరస్వామివారి ఆలయ రెండవ ప్రాకారం అభివృద్ధి పనులకు గురువారం ఉదయం 11 నుండి 11.30 గంటల నడుమ సిఎం చంద్రబాబు చేతుల మీదుగా భూమిపూజ, అద్వేష్టక శిలేష్టకాన్యాసం వైభవంగా జరిగింది. ఇందులో భాగంగా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన యాగశాలకు శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి ఉత్సవర్లను వేంచేపు చేశారు. అనంతరం అర్చకులు చతుర్వేద పారాయణం, నివేదనం, దివ్య సమర్పణ, హోమం, పూర్ణాహుతి, వేదాశీర్వచనం నిర్వహించారు. మొదటగా సిఎం నారా చంద్రబాబునాయుడు యాగశాలకు వేంచేసి పూర్ణాహుతి కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరంఅర్చకుల వేద మంత్రాలు, మంళవాయిధ్యాలు, భక్తుల గోవింద నామస్మరణల నడుమ ముఖ్యమంత్రి పునాదిరాయి వేయడంతో ఆలయంలో ద్వితీయ మహాప్రాకారము, చతుర్ద్వార గోపురముల నిర్మాణాము, వివిధ అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి అనంతరం ముఖ్యమంత్రి అమరావతిలోని శ్రీవారి ఆలయ అభివృద్ధికి రూపొందించిన మాస్టర్ ప్లాన్ పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. తర్వాత సిఎం ఆలయంలోని ధ్వజస్తంభానికి, నమస్క >>2

**జీర్ణోద్ధరణ స్థితిలోని ఆలయాలకు పూర్వవైభవం: సిఎం చంద్రబాబు** 7లో

## ఎంపి మిథున్‌రెడ్డికి ఎసిబి కోర్టులో ఊరట

### పార్లమెంటు సమావేశాలకు హాజరయ్యేందుకు అనుమతి



**విజయవాడ, నవంబరు 27,ప్రభాతవార్త ప్రతినిధి:** లిక్కరు స్కామ్‌లో నిందితునిగా ఉన్న వైఎస్సార్సీఎంపీ మిథున్ రెడ్డికి విజయవాడ ఎసిబి కోర్టులో కాస్త ఊరట లభించింది. పార్ల మెంటు సమావేశాలకు వెళ్లేందుకు కోర్టు అనుమతి ఇచ్చింది. డిసెంబర్ 1 నుంచి జరిగే పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు అను మతి ఇవ్వాలంటూ మిథున్ రెడ్డి ఎసిబి కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్‌పై గురువారం ఎసిబి కోర్టు విచారణ జరిపింది. ఇరువైపుల వాదనలువిన్న కోర్టు.. ఎంపి మిథున్ రెడ్డి పార్లమెంటు సమావేశాల్లో పాల్గొనేందుకు అనుమతి ఇస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఇక మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి వేసిన పిటిషన్‌పై కూడా ఎసిబి కోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. చెవిరెడ్డికి జైలులో సౌకర్యాలు కల్పించాలని కోర్టు ఆదేశించింది.

# 'రాజధాని' నోటిఫికేషన్ ఇవ్వండి



గురువారం అమరావతి రైతులతో త్రిసభ్య కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడుతున్న సిఎం చంద్రబాబు

**కేంద్రాన్ని ఇప్పటికే కోరినట్లు వెల్లడించిన సిఎం చంద్రబాబు**

**కేపిటల్ గెయిన్స్ పొడిగింపులపై కేంద్రంతో చర్చిస్తాం**

**రాజధాని రైతులకు న్యాయం చేయడం నా బాధ్యత**

**అమరావతి రైతులతో సమావేశంలో ముఖ్యమంత్రి**

**విజయవాడ, నవంబరు 27 ప్రభాతవార్త ప్రతినిధి:** అమరావతిని రాజధానిగా గుర్తించాలని ఇప్పటికే కేంద్రాన్నికోరామని.. ఈ అంశంపై కేంద్రంతో మరో సారి చరిస్తామని సిఎం చంద్రబాబు ప్రకటించారు. రాజధాని రైతులకు క్యాపిటల్ గెయిన్స్ గడువును మరికొంత కాలం పాటు పొడిగించే అంశంపైనా కేంద్రంతో మాట్లాడతామని చెప్పారు. గురువారం రాజధాని రైతులతో ముఖ్యమంత్రి చంద్రబాబు సచివాలయంలోని ఐదో బ్లాకులో సమావేశమయ్యారు. రైతుల తమకున్న సమస్యలను వివరించారు. ఈసందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ.. 'జరీబు, గ్రామకంఠాలు, లంక భూములు, రిటర్నబుల్ ప్లాట్లల్లో మౌలిక సదుపాయాల కల్పనపై రైతుల అభిప్రాయాలు నా దృష్టికి వచ్చాయి. లంక భూములను పూలింగ్ తీసుకోవడానికి అనుమతి ఇచ్చాను. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే ముందుగా త్రిసభ్య కమిటీతో చర్చించండి. అవసరమైతే నేనూ మీతో మాట్లాడతాను. ఇకపై రెగ్యులర్‌గా అమరావతి రైతుల సమస్యలపై సమీక్షిస్తాను" అని ముఖ్యమంత్రి వెల్లడించారు.

**రైతులకు అన్ని చెప్పాలి... మనసు విప్పి మాట్లాడుతున్నా**

"రైతులతో మనస్సు విప్పి మాట్లాడాలి... కాబట్టి అన్ని చెబుతున్నా. అమరావతే రాష్ట్రానికి గ్రోత్ ఇంజన్‌గా ఉండాలి. రాజధాని అభివృద్ధి చెందాలి.. ఇక్కడ జరిగిన అభివృద్ధి ఫలాలను రాజధాని రైతులే ముందు అందుకోవాలి. అమరావతి ప్రాంతానికి.. రాజధాని రైతులకు న్యాయం చేయడం నా బాధ్యత. నా హయాంలో ఎప్పుడూ భూసేకరణలో ఇబ్బందులు రాలేదు. భూముల ధరలు పెరగబోతున్నాయి.. రిటర్నబుల్ ప్లాట్లను రైతులు అమ్ముకోవద్దు. తిరుమల తరహాలో అమరావతి ఆలయాన్ని అభివృద్ధిచేస్తాం. బిట్స్‌పిలానీ, క్వాంటం వ్యాలీ ఏర్పాటవుతున్నాయి. అద్భుతమైన అభివృద్ధి జరగబోతోంది. తిరుపతి సమీపంలో 5వేల ఎకరాలు ప్రభుత్వానికి లభించింది. అక్కడ ఎరో స్పేస్ సిటీని ఏర్పాటు చేస్తున్నాం. అమరావతిలో ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉంది. రెండో విడతలోనూ ల్యాండ్ పూలింగులో భూములు తీసుకుని అభివృద్ధి చేద్దామని చూస్తున్నాం. రైతులు చెప్పే ఏ సమస్యనైనా వీలైనంతవరకు పరిష్కరించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అలాగే అందరూ కలిసికట్టుగా ఉండాలి. ఐకమత్యంగా ఉంటేనే అభివృద్ధి సాధ్యం" అని సీఎం చెప్పారు.

సిఎంతో సమావేశం సందర్భంగా రైతులు మాటాడుతూ "రాజధానికోసం జెఎసిలు ఏర్పాటు చేసుకుని ఉద్యమించాం. ఇక అమరావతి డెవలప్మెంట్ అసోసియేషన్ ఏర్పాటుచేసుకుంటాం. రెండో విడత భూ సమీకరణకు పూర్తిగా సహక రిస్తాం. సిఎం రూపొందించిన ప్రణాళిక ప్రకారం ముందుకు వెళ్తే మాకూ మేలుజరుగుతుంది. ల్యాండ్ పూలింగ్ ఇవ్వనివారిని పిలిపించి మాట్లాడితే సమస్య త్వరగా పరిష్కారం అయ్యే అవకాశం ఉంది. ఎఫ్ఎస్ఐ పెంపు వల్ల కలిగే లాభనష్టాలను వివరించే బాధ్యత సిఆర్‌డిఎ తీసుకోవాలి. రైతులకు కొన్ని అంశాల్లో సరైన అవగాహన లేదు. ఏదైనా ఇబ్బంది అయితే నష్టం రైతులకేకలుగుతుంది" అనిసిఎంతో చెప్పారు.

## సంజయ్ సస్పెన్షన్ 6 నెలలు పొడిగింపు



**విజయవాడ, నవంబరు 27, ప్రభాత వార్త ప్రతినిధి:** సీనియర్ ఐపిఎస్ అధికారి సంజయ్ సస్పెన్షన్‌పై ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసు కుంది. ఆయన సస్పెన్షన్‌ను మరో ఆరు నెలల పాటు పొడిగించింది. అందుకు సంబంధించిన ఉత్తర్వులు గురువారం జారీ చేసింది. దీంతో వచ్చే ఏడాది మే నెలాఖరు వరకు సంజయ్‌పై సస్పెన్షన్ విధించినట్లు అయింది. సంజయ్ సస్పెన్షన్‌కు సంబంధించి గతంలో ఇచ్చిన ఉత్తర్వులు నవంబర్ నెలాఖరుతో ముగియనుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రభుత్వం ఈ ఉత్తర్వులు జారీ చేసింది. ఫైర్ సర్వీసెస్ డైరెక్టర్ జనరల్ ఎన్ సంజయ్ పని చేశారు. ఆ సమయంలో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దీనిపై ప్రభుత్వానికి విజిలెన్స్ నివేదిక అందింది. దాంతో ఈ వ్యవహారంపై ఎసిబి విచారణకు ప్రభుత్వం ఆదేశించింది. ఆ కొద్ది రోజులకే సంజయ్‌పై ప్రభుత్వం సస్పెన్షన్ వేటు వేసింది. ఈకేసులో అరెస్టయిన సంజయ్..ప్రస్తుతం విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్నారు.

## 3 కొత్త జిల్లాల నోటిఫికేషన్లు జారీ

**విజయవాడ,నవంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో మూడు జిల్లాలతోపాటు ఐదు రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. అందుకు సంబంధించిన నోటిఫికేషన్లను ప్రభుత్వం గురువారం జారీ చేసింది. రాష్ట్రంలో కొత్తగా మూడు జిల్లాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు మంగళవారం ఆమోదం తెలిపారు. మార్కాపురం, మదనపల్లె, రంపచోడవరం కేంద్రంగా పోలవరంజిల్లా ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. దీంతో రాష్ట్రంలో జిల్లాల సంఖ్య 26 నుంచి 29కి పెరిగింది. కొత్తగా 5 రెవెన్యూ డివిజన్లు, ఒకమండలం ఏర్పాటు చేయాలని సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. జిల్లాల పునర్విభజనపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై చర్చించిన అనంతరం సీఎం ఈ నిర్ణయం తీసుకున్నారు. అనకాపల్లి జిల్లాలో నక్కపల్లి, ప్రకాశం జిల్లాలో అద్దంకి, కొత్తగా ఏర్పాటయ్యే మదనపల్లి >>2



## నైరుతి బంగాళాఖాతంలో 'ద్విత్వాహ్' తుఫాన్

**చిత్తూరు, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అతిభారీ వర్షాలు కురిసే అవకాశం**

**విజయవాడ,నవంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** నైరుతి బంగాళాఖాతంలో తీవ్ర వాయుగుండం ఏర్పడింది. పుదుచ్చేరికి దక్షిణ ఆగ్నేయంగా 640 కిలోమీటర్ల దూరంలో, చెన్నైకు దక్షిణ ఆగ్నేయంగా 730 కిలోమీటర్ల దూరంలో తీవ్ర వాయుగుండం కేంద్రీకృతమైంది. గడిచిన 6 గంటల్లో గంటకు 17 కిలోమీటర్ల వేగంతో కదులుతున్న తీవ్ర వాయుగుండం మరికొన్ని గంటల్లో తుఫాన్‌గా రూపాంతరం చెందుతుందని వాతావరణశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. దీనికి 'ద్విత్వాహ్' తుఫానుగా వాతావరణ శాఖాధికారులు నామకరణం చేసారు. 48 గంటల్లో నైరుతి బంగాళా >>2

# టిటిడి మార్కెటింగ్ జిఎం అరెస్టు



గురువారం టిటిడి మార్కెటింగ్ జిఎం సుబ్రమణ్యంకు రుయాలో వైద్యపరీక్షలు (ఇన్‌సెట్ సుబ్రమణ్యం)

**దర్యాప్తు చివరి దశలో సిట్ మరింత దూకుడు**

**సుబ్రహ్మణ్యం అరెస్టుతో కదులుతున్న కల్తీ నెయ్యి డొంక**

**నాలుగు రోజుల్లో మరికొందరు అరెస్టయ్యే అవకాశం**

**అరెస్టు భయంలో అప్పటి పోటు అధికారులు**

**తిరుమల, నవంబరు 27ప్రభాతవార్తప్రతినిధి:** తిరుమల వెంకన్నలడ్డూల తయారీలో కల్తీనెయ్యి సరఫరా, వినియోగించారన్న పాపంలో కీలకంగా బాధ్యుడైన టిటిడి మార్కెటింగ్ విభాగం (కొనుగోళ్లు)జిఎం కె. సుబ్రమణ్యంను గురువారం సాయంత్రం సిట్ పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతిలోని ఎన్జీఒకాలనీలో నివాసముంటున్న ఆయన్ను టిటిడి భవనంనుండి అరెస్ట్‌చేసి రుయాకు తరలించారు. రుయా ఆస్పత్రిలో ఆయనకు వైద్యపరీక్షలు చేయించారు. అనంతరం ఆయన అరెస్ట్‌ను టిటిడి అధికారులకు, కుటుంబ సభ్యులకు తెలిపారు. ఈరాత్రికి నెల్లూరు ఎసిబి కోర్టులో హాజరుపరిచారు. కల్తీనెయ్యి బాగోతంలో సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జనవరి నుండి దర్యాప్తు చేస్తున్న సిబిఐ సిట్ అధికారులు తాజాగా మార్కెటింగ్ జిఎంఅరెస్ట్‌తో మొత్తం పదిమందికి చేరింది.అయితే అధికారవర్గాల వైపునుండి మార్కెటింగ్ జిఎం అరెస్ట్ తొలిగా నమోదవడం విశేషం. ఈ కేసులో ఇప్పటివరకు పలుకోణాల్లో విచారణ చేసిన సిట్ బృందం నెయ్యి సరఫరా చేసిన కాంట్రాక్టర్లు, వ్యాపారులను మాత్రమే అరెస్ట్ చేసిన >>2

## పౌరసత్వానికి 'ఆధార్' రుజువు కాదు: సుప్రీంకోర్టు

**న్యూఢిల్లీ, నవంబరు 27:** దేశవ్యాప్తంగా ఆయా రాష్ట్రాల్లో కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఓటర్ సర్వే నిర్వహిస్తోంది. ఇటీవల బీహార్‌లో చేపట్టి విజయవంతంగా ఎన్నికలుముగిశాయి. త్వరలో తమిళనాడు, కేరళ, పశ్చిమబెంగాల్‌లో జరిగే రాష్ట్రాలపై ఎన్నికల సంఘం దృష్టిపెట్టింది. ప్రస్తుతం ప్రత్యేక ఓటర్ సర్వే నడుస్తోంది. ఇంకోవైపు ఎస్ఐఆర్ నిలిపివేయాలంటూ మూడు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. ఈ సందర్భంగా సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఆధార్‌కార్డుతో చొరబాటుదారులను ఓటర్లుగా గుర్తించడమేంటి? అని ప్రశ్నించింది. ఆధార్‌కార్డుఅనేది పౌర సత్వానికి రుజువుకాదని వ్యాఖ్యానించింది. ఆధారు కార్డు అనేది కేవలంసంక్షేమ ప్రయోజ నాలు పొందడానికేనని తెలిపింది.

# రాష్ట్ర అభివృద్ధి, ప్రజా ప్రయోజనాలే అజెండా

**టిడిపిపి సమావేశంలో ఎంపీలకు సిఎం చంద్రబాబు దిశానిర్దేశం**

**పార్లమెంట్‌లో రాష్ట్ర అంశాలు ప్రస్తావించండి**

**ప్రాజెక్టులకు అనుమతులు, రైతు సమస్యలకు పరిష్కారం ముఖ్యం**

**విజయవాడ, నవంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** అత్యధిక యువ పార్లమెంటేరియన్లు కలిగిన పార్టీ టిడిపి అని, ఈ యువ శక్తి పార్లమెంట్ వేదికగా రాష్ట్ర సమస్యలను స్పష్టంగా వినిపించాల్సిన అవసరం ఉందని టిడిపి జాతీయ అధ్యక్షుడు, సిఎం నారా చంద్రబాబునాయుడు టిడిపి ఎంపీలకు దిశానిర్దేశం చేశారు. ప్రజలకు సేవ చేయడమే టిడిపి ఐడియాలజీగా పేర్కొన్న సిఎం... రాష్ట్రాభివృద్ధి, ప్రజా ప్రయోజనాలే లక్ష్యంగా ఎంపీలు అంతా సమన్వయంతో కలసి పనిచేయాలని సూచించారు. గురువారం క్యాంప్ కార్యాలయంలో టిడిపి పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి రానున్న పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో ఎంపీలు అనుసరించాల్సి వ్యూహంపై పలు మార్గదర్శకాలు జారీ చేశారు. మొంథా తుఫాన్ నష్టపరిహారం త్వరగా అందేలా చూడాలని చెప్పారు. కృష్ణా-గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా, గోదావరి ట్రైబ్యునల్, సాగునీటి ప్రాజెక్టుల అనుమతులపై కేంద్రాన్ని ఒప్పించేలా పార్లమెంట్‌లో రాష్ట్ర గొంతుకను వినిపించాలని ఎంపీలకు సూచించారు. వంశధార-గోదావరినల్లమల సాగర్ అనుసంధానం, వెలిగొండ, ఉత్తరాంధ్ర జల ప్రాజెక్టులు ఇవన్నీ రాష్ట్ర భవిష్యత్‌ని నిర్ణయిస్తాయని... నీటి భద్రతే మన ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని సీఎం వివరించారు. పోలవరం ప్రాజెక్టును 2027 జూన్‌లో జాతికి అంకితం చేసేందుకు కేంద్ర సహకారాన్ని కోరాలన్నారు. పత్తి, మొక్కజొన్న, అరటి ధరల పతనం, సీసీఐ నియమాల కారణంగా వచ్చిన సమస్యలను కేంద్రానికి వివరించి రైతులకు ఉపశమనం కల్పించేలా చూడాలని ఎంపీలకు సీఎం స్పష్టం చేశారు. వ్యవసాయాన్ని లాభసాటి చేసేందుకు పంటల మార్పిడికి ప్రణాళికలు రూపొందిస్తున్నామని, హార్టికల్చర్, ఫుడ్ ప్రాసెసింగ్ రంగాల్లో పెట్టుబడులు ఆకట్టుకునేలా ప్రయత్నిస్తున్నట్టు చెప్పారు. సమావేశంలో సిఎం మాట్లాడుతూ... రాష్ట్రంలో గ్రీన్‌ఎనర్జీ, గ్రీన్‌హైడ్రోజన్, డేటా సెంటర్లకు అవసరమైన శక్తి వసతులపై కేంద్ర సహాయం సాధించాలి. ప్రతి నియోజకవర్గంలో ఎంఎస్ఎంఇ పార్కులు, 4బి-5బి కనెక్టివిటీ, క్వాంటం వ్యాలీ, ఇన్నోవేషన్ ఎకో సిస్టమ్‌కు మద్దతు సాధించేలా ఎంపీలు కృషి చేయాలి. విశాఖ-విజయవాడ మెట్రో రైలు, విశాఖ-తిరుపతి-అమరావతి ఎకనామిక్ రీజియన్స్, భోగాపురం ఎయిర్‌పోర్ట్, విశాఖ రైల్వే జోన్,వైజాగ్ స్టీల్‌ప్లాంట్‌వంటి అంశాలపై కేంద్రంతో చర్చలు జరపాలి. పిపిపి మోడల్‌లో తీసుకొస్తున్న మెడికల్ కాలేజీలు పూర్తిగా ప్రభుత్వ ఆస్తులేనని, 70 శాతం సేవలు ఉచితమని ప్రజలకు స్పష్టంగా తెలియజేయాలి. ప్రతిపాఠశాలలో అటల్ టింకరింగ్ ల్యాబ్, విద్యార్థుల్లో ఆవిష్కరణలనుప్రోత్సహించే కార్యక్రమాలపై ఎంపీల సహకారం అవసరం అన్నారు.

## మెడికల్ కాలేజీల్లో ఇడి సోదాలు

**విజయవాడ, నవంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** మెడికల్ కాలేజీల్లో అవినీతి, అక్రమాలు భారీ ఎత్తున చోటు చేసుకుంటున్నట్లు కేంద్ర దర్యాప్తు సంస్థలు గుర్తించాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర వ్యాప్తంగా మెడికల్ కాలేజీలపై ఈడీ అధికారులు గురువారం ఏకకాలంలో దాడులు నిర్వహించారు. గతంలో కొన్ని ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో నేషనల్ మెడికల్ కౌన్సిల్ (ఎన్ఎంసీ) పీజీ సీట్లు కేటాయింపులో భారీగా అవకతవకలు జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తాయి. దాంతో ఇటీవల మెడికల్ కౌన్సిల్ సభ్యులతోపాటు మెడికల్ కాలేజీల ప్రతినిధులను సీబీఐ అధికారులు సుదీర్ఘంగా విచారించారు. అనంతరం తాజాగా ఈడీ అధికారులు ప్రత్యక్షంగా రంగంలోకి దిగి ఈ దాడులు నిర్వహించారు,దేశవ్యాప్తంగా మెడికల్ కాలేజీల్లో సోదాలను ఈడీ అధికారులు చేపట్టారు.

28 -11 pg4_28 -11 pg4.qxd 11/28/2025 1:22 AM Page 1



వార్త

దుఃఖం అనేది శిక్ష కాదు. సంతోషం అనేది వరమూకాదు. రెండూ ఫలితాలే. అవి మన చర్యలననుసరించి మాత్రమే.

న-గోథె

# చుక్కల్లో ధరలు

'పదాల కన్నా గొప్పది వాక్‌శక్తి, వాక్‌శక్తి కన్నా గొప్పది మనసు, మనసు కన్నా గొప్పది సంకల్పం' మన పాలకుల్లో ఆ సంకల్ప లోపం కారణంగానే ప్రజలకు ఇక్కట్ల మీద ఇక్కట్లు వచ్చిపడుతున్నా యేమోననిపిస్తున్నది. ఇతర సమస్యల మాట ఎలా ఉన్నా రోజురోజుకు పెరిగిపోతూ ప్రజల జీవితాలను నరకప్రాయంగా మారుస్తున్నది.నిత్యావసర వస్తువుల ధరలను అదుపులోకి తెచ్చే ఆలోచన కానీ, ప్రయత్నంకానీ త్రికరణశుద్ధిగా జరగడం లేదేమోననిపిస్తున్నది. ఇటు కేంద్రంలోకానీ, రాష్ట్రాల్లో కానీ పాలకులు ఈ ధరల నియంత్రణకు సమీక్షలు, సమావేశాలు నిర్వహిస్తూనే ఉన్నారు. కమిటీల మీద కమిటీలు ఏర్పాటు చేస్తున్నారు. పెరుగుతున్న ధరలపై ప్రధానంగా నల్లబజారు వ్యాపారులపై ఉక్కుపాదం మోపుతాం, అవసరమైతే ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తామంటూ హెచ్చరికల మీద హెచ్చరికలు జారీ చేస్తున్నారు. కానీ ఇవేమీ పట్టించుకునే పరిస్థితుల్లో దళారులు లేరు. ప్రస్తుత పాలకులే కాదు ఏ పార్టీ అధికారంలో ఉన్నా ధరలు పెరిగినప్పుడు వాటిని నియంత్రిస్తామని చెప్పడం, అక్రమ నిల్వలు చేసేవారిపై చర్యలు తీసుకొని జైళ్లకు పంపుతామని బెదరించడం ఒక రివాజుగా మారిపోయింది. ఈ విషయంలో ఎప్పుడూ చర్యలు తీసుకోలేదని చెప్పడం లేదు. రకరకాల చట్టాలు తెచ్చారు. నిబంధనలు విధించారు. బ్లాక్ మార్కెటీర్లను జైళ్లకు పంపించారు. ప్రభుత్వమన్నా, అందులో పనిచేసే అధికారులన్నా గడగడలాడిన సందర్భాలు లేకపోలేదు. కానీ అవి రానురాను తగ్గిపోతున్నాయి. అధికారులను వారి వారి విధులను స్వేచ్ఛగా చేయనీయడంలేదేమోననిపిస్తున్నది. అన్నింటిలోనూ రాజకీయ జోక్యం మితిమీరిపోతున్నది. తమ సిఫారసులకు, రాజకీయ ఒత్తిడిలకు లొంగని సమర్థులైన అధికారులను బదలీవేటుతో శంకరిగిమాన్యాలను పట్టించడం ఏనాటి నుంచో ఆరంభమైనా నేడు పరాకాష్ఠకు చేరిందని చెప్పొచ్చు. అందుకే అప్పటి భయభక్తులు ఇప్పుడు లేవు. అధికారుల్లో కూడా అంకితభావం తగ్గిందనే చెప్పాలి. బిల్లు, బెల్లు అనే తీరులో వ్యవహరించేవారే ఎక్కువైపోయారు. మరికొందరు అక్రమ వ్యాపారస్తులతో ఇంకొందరు రాజకీయ నాయకులు మమేకం అవుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో అయితే నాయకులకుటుంబ సభ్యుల పేరుతో స్వయంగా వ్యాపారం చేస్తున్నవారు కూడా ఉన్నారు. ఇదేమీ కొత్త విషయం కాదు. ఇప్పటికిప్పుడు ప్రారంభమైంది కాదు. కానీ ఈ సంప్రదాయం రానురాను పెరిగిపోతుండడం ఆందోళన కలిగించే విషయం. రాజకీయమే వ్యాపకంగా జీవనం సాగించేవారి సంఖ్య క్రమేపీ తగ్గిపోతున్నది. డబ్బు సంపాదనే ధ్యేయంగా మారుతుంది. ఎన్నికలు కూడా అలా రూపాంతరం చెందుతున్నాయి. ఇందులో ప్రజల బాధ్యత కూడా కొంత ఉందని చెప్పక తప్పదు. కొందరు బడా వ్యాపారులు మరికొందరు రాజకీయ నాయకులతో అవినాభావ సంబంధాలు ఏర్పర్చుకుంటున్నారు. ఎన్నికల ఖర్చుకు చందాలు ఇవ్వని తప్పని పరిస్థితి. చివరకు ఈ భారమంతా ప్రజలు భరించడక తప్పడం లేదు. దీంతో ఎన్ని కేకలు పెట్టినా, మరెన్ని హెచ్చరికలు చేసినా తమను ఏమీ చేయలేమనే ధీమా అక్రమవ్యాపారుల్లో అంతంతకు పెరిగిపోతున్నది. ధరలు పెరగడానికి ముఖ్యకారణాల్లో ఇదొకటి. ద్రవ్యోల్బణంతోపాటు మార్కెట్ మాయాజాలం కూడా ఉందనేది నిర్వివాదం. ప్రస్తుతం పప్పుదినుసుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. మరో రెండు,మూడు నెలల వరకు కొత్త పంటలు వచ్చే అవకాశంలేదు. ఖరీఫ్‌లో పప్పుదినుసులతోపాటు వాణిజ్యపంటలు కూడా అధిక వర్షాలతో బాగా దెబ్బతిన్నాయి. యాసంగి పంట దిగుబడులు వస్తే తప్ప పప్పుదినుసులు అందుబాటులోకి వచ్చే అవకాశం లేదు. అందుకే మరింత పెరిగే అవకాశాలున్నాయని అధికారులు కూడా అభిప్రాయపడుతున్నారు. పప్పుదినుసులే కాదు పేదలు నిత్యం వాడే కారం, ఉప్పు, నూనెలవంటి ధరలు కూడా ఆకాశాన్ని అంటుతున్నాయి. నియంత్రణ, పర్యవేక్షణ కమిటీలు సమీక్షలతో కాలం గడుపుతున్నాయి. పప్పుదినుసుల సాగు రకరకాల కారణాలతో తగ్గిపోతున్న మాట వాస్తవం. దీనికితోడు విడవని వర్షాలు కూడా భారీ నష్టాన్ని చేకూర్చాయి. ఇలాంటి పరిస్థితులను ముందుగా ఊహించి సొమ్ము చేసుకునేందుకు కొందరు వ్యాపారస్తులు, దళారులు పావులు కదపడం సహజమే. కానీ ఈ విషయంలో పాలకులకు ముందుచూపు లేకపోవడం దురదృష్టకరం. ఇక కూరగాయల సాగు పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. నగరాలకు, పట్టణాలకు, చివరకు మండల కేంద్రాలకు దగ్గరల్లో కూరగాయలు సాగవుతున్న భూములు ప్రస్తుతం ఇండ్ల ప్లాట్లుగా మారిపోయాయి.ఒక్క తెలంగాణ రాష్ట్రంలో చూసుకున్నా లక్షలాది ఎకరాలు మరో యాభైయేళ్లకు సరిపోయే విధంగా ఇళ్ల ప్లాట్లు చేసే శారు. దీనికితోడు ప్రభుత్వం నుండి కూరగాయల సాగుకు అందించే ప్రోత్సాహకాలు కనుమరగైపోయాయి. మార్కెట్ మాయాజాలంలో కూరగాయల సాగు రైతులు బలైపోతున్నారు. దీంతో ఆ సాగుకు మంగళంపాడారనే చెప్పొచ్చు. ఫలితంగా ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. బీదాబిక్కే కాదు సామాన్యుడు అందుకోలేనంతగా పెరిగిపోయాయి. ఉన్న డబ్బును ఎలా ఖర్చుపెట్టుకోవాలో తోచని నల్లధన స్వాములకు ఏ వస్తువు ధర ఎంత పెరిగినా, చీకుచింత ఉండకపోవచ్చు. నెలజీతం మీదనే ఆధారపడి జీవనం సాగించే మధ్యతరగతి పరిమితి ఆదాయ వర్గాలదేసమస్య అంతా. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర పాలకులు అదుపు లేకుండా పెరిగిపోతున్న ధరల విషయంలో నిర్దిష్టమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

భయం వలన పొందే ఆధిపత్యం కన్నా, అభిమానంతో పొందే బానిసత్వం మిన్న.



మహాత్మా గాంధీ

అనేక విత్తనాలను విత్తడం ద్వారా నేల ఏ విధంగా సారవంతమవుతుందో అలాగే రకరకాల విషయాలను పరిశీలించడం ద్వారా మనసు వికసిస్తుంది.



జెఫర్సన్

# ప్రజావాక్కు



## అభివృద్ధి దిశగా కీలక అడుగు

ఆదిలాబాద్‌లో కొత్త విమానాశ్రయ నిర్మాణానికి సంబంధించిన డీపీఆర్‌ను డిసెంబరు 14నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం అధికారులను ఆదేశించడం, ప్రాంతీయ అభివృద్ధికిదారితీసే ముఖ్యమైన పరిణామంగా పరిగణించాలి. మొత్తంగా700ఎకరాల భూమిసేకరణకు సూచనలు ఇవ్వడం,ప్రాజెక్ట్ అమలులోప్రభుత్వం చూపుతున్న దృఢసంకల్పాన్ని స్పష్టం చేస్తోంది. పరిశ్రమల అభివృద్ధికి అవకాశాలు కలగటం వంటి అంశాలను పరిగణించినప్పుడు విమానాశ్రయ అవసరం స్పష్టంగా కనిపిస్తోంది. ఒకసారి విమానాశ్రయం ఏర్పాటు అయితే ఈ ప్రాంతం రవాణా, వర్తకం, పెట్టుబడులు, ఉపాధి వంటి అనేక రంగాల్లో వేగంగా ఎదగగలదు. ప్రభుత్వ చురుకుదనం, సమయపాలన, ప్రజా ప్రయోజనాల పరిరక్షణ ఈ మూడు అంశాలు సమన్వయంగా నడిస్తే ఈప్రాజెక్ట్ ఉత్తర తెలంగాణకు ఒక కొత్త దిక్సూచి కావొచ్చు.

- తిప్పర్తి శ్రీనివాస్, చొప్పదండి

## విద్యార్హతలు అవసరం

త్వరలో తెలంగాణా రాష్ట్రంలో జరిగే గ్రామ పంచాయతీ ఎన్నికలలో ప్రజా ప్రతినిధులకు విద్యార్హతాలు అవసరం. వార్డ్ మెంబెర్, సర్పంచ్,ఏంపిటిసి, జెడ్‌పిటిసి ఎన్నికలకు పదవతరగతి, ఇంటర్మీడియట్,డిగ్రీ,పోస్ట్ గ్రాడ్యుయేషన్, వంటి విద్యాఅర్హతలను ప్రజా ప్రతినిధులకు నిర్ణయించాలి. ఎలక్షన్ కమిషన్ ఈ విషయం అమలు చేయాలి. విద్యావంతులునిరుద్యోగసమస్యలు ఎదురుకొంటున్నారు. వీరిలో చాలా మంది ప్రజాసేవ చేయాలనీ ప్రజాస్వామ్య పరిరక్షణకు కృషి చేయాలి. ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రజలకు తెలియజేయడం కోసం విద్య అర్హత చాలా ఉపయోగంగా ఉంటుంది.

- ఈదునూరి వెంకటేశ్వర్లు, వరంగల్ జిల్లా

## నిబంధనలు విధించాలి

ఒకప్పటి ఆంధ్ర రాష్ట్ర రాజధాని అయిన కర్నూల్ దిన, దినాభివృద్ధి చెందుతుంది.ఇటుతెలంగాణ, అటు కర్ణాటక వారు తరచుగా కర్నూల్‌కు ప్రయాణం చేస్తుంటారు. అయితే కర్నూల్‌లో కూడా ట్రాఫిక్ బాగా పెరిగిపోతుంది. ఇక్కడ చలా హాస్పిటల్స్ తోపాటు, విద్యాలయాలు కూడా ఉన్నాయి7సీట్ల ఆటోలను ఇప్పటికే నిషేధించారు.

- షేక్ అస్లాంషరీఫ్, శాంతినగర్

## మహిళా రిజర్వేషన్ అమలు వాయిదా!

మహిళారిజర్వేషన్ చట్టం (106వ రాజ్యాంగ సవరణ, 2023) ఆమోదం భారత ప్రజాస్వామ్య చరిత్రలో ఒక కీలక మైలురాయి. లోక్‌సభ, రాష్ట్ర శాసనసభలు, ఢిల్లీ అసెంబ్లీలలో మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు రిజర్వ్ చేయాలని ఈ చట్టం నిర్దేశించినప్పటికీ, దాని అమలుకు అవసరమైన జనగణన, నియోజకవర్గ పునర్విభజన (డిలిమిటేషన్) ఇంకా పూర్తికాలేదు. చట్టం అమలును వాయిదా వేస్తున్న పరిస్థితుల నేపథ్యంలో సుప్రీంకోర్టు కేంద్ర ప్రభుత్వాన్ని సమాధానం కోరుతూ నోటీసులు జారీ చేయడం, ఈ వ్యవహారానికి ఉన్న అత్యవసరతను మళ్లీ ముందుకు తెచ్చింది. భారతీయ రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం ఇంకా పరిమితంగానే ఉంది. పార్లమెంటులో సగటు మహిళా ప్రాతినిధ్యం 15 శాతం కంటే తక్కువగా ఉండటం,జనాభాలో సగంమంది మహిళలున్న దేశానికి అసంబద్ధం. డిలిమిటేషన్ పూర్తయ్యాకే రిజర్వేషన్ అమలు చేయాలన్న నిబంధనం సాంకేతికంగా సరైనదే కానీ, దీన్ని అనంతంగా వాయిదా వేయడం ప్రజాస్వామ్య సమానత్వానికి నష్టం.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

## చిరుద్యోగులకు ఓ గొప్పవరం

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ఆర్‌టిసి బస్సుల్లో మహిళలకు ప్రవేశపెట్టిన ఉచిత ప్రయాణ పథకం వల్ల పేద, మధ్యతరతగి మహిళలు రవాణా ఛార్జీలకు అయ్యేమొత్తాన్ని పొదుపు చేసుకుంటున్నారు. ప్రయాణాల సమయంలో ప్రైవేట్ వాహనాల డ్రైవర్ల బేరమాడే అవసరం ఉండదు. దినసరి కూలీ పనులకు వెళ్లే మహిళలు, వివిధ షాపుల్లో, చిన్నచిన్న వ్యాపార సంస్థల్లో చిరుద్యోగులుగా చేసే మహిళలు, ఇలా పేద మధ్యతరగతి వర్గాల వారికి రవాణా ఖర్చులు లేకుండా ఈ పథకం ఎంతో ఉపయుక్తంగాఉంది.తద్వారాఆర్థికంగా కొంత ఆదా అవుతుంది.

-కాట్రగడ్డ వెంకట్రావు నాయుడు, మచిలీపట్నం

## డిజిటల్ ఐడి తప్పనిసరి

యునైటెడ్ కింగ్డంలో ప్రజలు డిజిటల్ ఐడిని వ్యతిరేకిస్తూ ఉద్యమం చేయడంతో ప్రభుత్వం డిజిటల్ ఐడి ఐచ్ఛికమని ప్రకటించడం జరిగింది. ఉద్యోగస్తులు మాత్రం తప్పనిసరిగా డిజిటల్ ఐడి తీసుకోవాలి. ప్రజలు సంఘటితంగా ఉద్యమించడం ద్వారా ప్రభుత్వ విధానాలను మార్చగలరని ఈ సంఘటన నిరూపించింది. డిజిటల్ ఐడి తప్పనిసరి. ప్రజలు ఐక్యంగా ఉద్యమిస్తే ఏదైనా సాధించవచ్చు.


-పుట్లూరి రాం నర్సింహారెడ్డి, నల్లగొండ జిల్లా

# తరగతి గదికి దూరమవుతున్న ఉపాధ్యాయుడు!

**సాంకేతికతపై అతిగా ఆధారపడుతున్నారు. డిజిటల్ టూల్స్,యాప్‌లు, స్మార్ట్ బోర్డులు, స్మార్ట్‌క్లాస్ రూములు దర్శనమిస్తున్నాయి. మానవ స్పర్శ లోపించి యాంత్రికత కేంద్రీకృతమైంది. బోధనలో స్వేచ్ఛ కల్పించనంత కాలం ఉపాధ్యాయుడి బోధనాకౌశల్యం పెరిగే అవకాశం లేదు. అతడు అనేక ప్రయోగాలు చేస్తూ వాటిలో ఉత్తమమైన దానిని తానే గుర్తించి ఉపయోగించి విద్యార్థులకు మరింత నేర్పుతో, కౌశల్యంతో, పట్టుదలతో ప్రభావవంతంగా బోధించగలుగుతాడు కానీ ఉన్నతాధికారులు అందుకు ఒప్పుకోరు. తమ ఫార్మాట్‌లోనే తమ మూసలోనే బోధించాలనేదే వారి సూత్రం. ఈ ప్రయోగాలు ఉపాధ్యాయుడి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అతని స్వేచ్ఛను హరిస్తున్నాయి. మొత్తంగా అతడికి బోధనపై ఉన్న ఆసక్తిని తగ్గిస్తున్నాయి.**

శ్రీ శ్రీ కుమార్

ఉపాధ్యాయుడిని బోధనను విడదీసీ చూడలేము. బోధన అతడి ప్రాథమిక విధి. బోధనలోనే ఉపాధ్యాయుడికి నిజమైన సంతోషం లభిస్తుంది. సమాజమే అతడి సర్వస్వం, పాఠశాల అతడి ప్రపంచం తరగతి గది అతడి తరగని నిధి. విద్యార్థులే విడదీయలేని లోకం. వారి అభివృద్ధి మాత్రమే అతడి పరమావధి. వారు ప్రయోజకులైతే అతడి సంతృప్తికి అవధులు ఉండవు. అతడి అంతరంగం నిండా విద్యార్థులు నిండి ఉంటారు. ఇలాంటి ఉపాధ్యాయుడు నేడు బోధనకు ఒక రకంగా చెప్తే వృత్తికి కూడా దూరం అవుతున్నాడు. ఇది మనం చూస్తున్న వాస్తవం, చేదు నిజం. ఉపాధ్యాయుడిగా ఎంపిక కావడం ప్రస్తుత పరిస్థితులలో చాలా కష్టమైన విషయం. ఆ వృత్తిని ఇష్టపడి చాలామంది ఎన్నుకుంటున్నారు. కానీ కొద్ది కాలానికి వారు ఆ వృత్తిని వీడిపోతున్నారు. నిరుద్యోగులుగా కూడా ఉండటానికి జీవితంలో అనిశ్చితిని ఎదుర్కొనడానికైనా వారు సిద్ధపడుతున్నారు కానీ ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగడంలేదు. రాజీనామా చేసి వెళ్ళిపోతున్నారు. అంటే ఏదో అలసట, అసంతృప్తి, నిరాశ వారిని ఆవహించినట్లు స్పష్టం అవుతుంది. ఈ రకమైన పరిస్థితులు ఎందుకు నెలకొన్నాయో ఒక లోతైన అధ్యయనం చేయవలసి ఉంది. యునెస్కో తన అధికారిక పత్రిక 'ప్రాస్పెక్ట్స్' లో విద్యపై జరిగే త్రైమాసిక సమీక్షలో 'ఉపాధ్యాయులు ఎటు పోతున్నారు?' అంటూ ప్రశ్నించింది. యునెస్కో ఈ రకమైన ఉపాధ్యాయ వలస ధోరణిని రెండు దశాబ్దాల క్రితమే గమనించింది. ప్రపంచంలోని అనేక ఖండాల్లో జరిపిన సర్వేల్లో గొప్ప అనుభవం ఉన్న ఉపాధ్యాయులకు ఈవృత్తిపై ఉన్న అసంతృప్తి, ఇందులోని శూన్యతను గూర్చిన ఫలితాలను చర్చించింది. వారు ఈ వృత్తితో రాజీపడలేక రాజీనామా చేస్తున్నారు. ఈ సర్వే ఈ వృత్తిలోని నిశ్శబ్ద సంక్షోభానికి రకరకాల కారణాలను గుర్తించింది. అందులో కొన్ని అంశాలు పాఠశాల తరగతిగది పరిస్థితులకు సంబంధించినవి అయితే మరికొన్ని పాఠశాలలో విద్యార్థి ప్రవర్తనను ప్రభావితం చేసే గృహ వాతావరణం వంటివి. భారతదేశంలో ఈ దిశగా అర్థవంతమైన అధ్యయనాలేవీ జరిగిన దాఖలాలు లేవు. ఉపాధ్యాయులు ఎంతసేపు తమ వృత్తిపరమైన జీవితాలను ఇబ్బంది పెడుతున్న అంశాల గురించి మాత్రమే చర్చించుతారు. వారి నుండి వచ్చే ముఖ్యమైన ఫిర్యాదు ఉన్న తాధికారుల ఒత్తిడికి, ఆగ్రహానికి తాము నిస్సహాయంగా పనిచేస్తున్నామని భావన. కొంతమంది ఈ విషయమై తప్పుగా అర్థం చేసుకోవచ్చు. ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉన్నతాధికారుల ఒత్తిడి ఆకాంక్షలు ఉన్నాయనుకుంటే పొరపాటు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలల్లో యాజమాన్యాల ఒత్తిడి వారికుండే ఫలితాలపై ఆశలు ఉపాధ్యాయుల మనసులపైపనిచేస్తుంది. ప్రస్తుత పరిస్థితుల్లో వృత్తిపరమైన స్వయం ప్రతిపత్తిని కోరుకోవడం అత్యాశ అవుతుంది. అది అన్ని యాజమాన్యాలలో కూడా తిరస్కరించబడుతుంది. అంటే ఉపాధ్యాయులకు స్వేచ్ఛ లేదు లేదా ఇవ్వరు అనేది వాస్తవం. అది యాజమాన్యాలకు లేదా ఉన్నతాధికారులకు ఇష్టం లేని విషయం. ఇంతవరకు మనం యాజమాన్యాల కోణం నుండి చూడగా ఉపాధ్యాయుల పరిస్థితిని ఇతర కోణాల నుండి కూడా అధ్యయనం చేయాలి. వారిని తరగతి గదికే పరిమితం చేస్తే వారు విద్యార్థి బౌద్ధిక వికాసానికి బాధ్యత వహిస్తారు. కానీ వారిని బోధనేతర పనులకు వినియోగించడం సర్వసాధారణమై పోయింది. బోధన వారి వృత్తిపరమైన జీవితంలో అతి చిన్నభాగం కాగా ఇతర పనులు సింహభాగాన్ని ఆక్రమించాయి. తరచుగా పై అధికారుల నుండి వచ్చే రకరకాల ఫార్మాట్లు నింపి పంపడం వారికి నిత్యకృత్యమైపోయింది. ఉపాధ్యాయులు బోధన కంటే నివేదికలు ఫారంలో డేటాను అప్లోడ్ చేయడంలో ఎక్కువగా నిమగ్న



మవుతున్నారు. ఫొటోలు పంపడం, సాక్ష్యం ఇవ్వడం లాంటివి వారి దైనందిన జీవితంలో భాగమయ్యాయి. తరగతి గదిలో కంటే కంప్యూటర్ స్క్రీన్ ముందు గడిపే సమయం పెరిగింది. అర్థంపర్థం లేని శిక్షణలు అవి కూడా పాఠశాలలు చాలా చక్కగా జరుగుతున్న కాలంలో ఉపాధ్యాయులు ముఖ్యంగా సిలబస్ పూర్తి చేసి విద్యార్థులను పరీక్షలకు సిద్ధం చేయడంలో నిమగ్నమైనప్పుడు వారిని శిక్షణల పేరుతో శిక్షలకు గురిచేస్తారు. అందులో కొత్తగా నేర్పేదిఏమీ ఉండదు, నేర్చుకునేది అంతకన్నా ఉండదు. శిక్షణా కాలం చివరన ఫీడ్ బ్యాక్ పేరున ఇచ్చే ఫారాలలో చాలా గొప్పగా ఉపయోగపడే శిక్షణగా బలవంతంగా రాయించుకుని పంపిస్తారు. ఇక ప్రభుత్వాలకు గుర్తొచ్చినప్పుడల్లా సర్వేలు నిర్వహించాలి. అందుకు ఉపాధ్యాయులే తగిన వ్యక్తులు. సర్వేలు ఎలా నిర్వహించాలో శిక్షణ సర్వేలకు కూడా అంతుండదు. ఇక ప్రజాస్వామ్య పరిరక్షణ మూల స్తంభాలలో ముఖ్యమైనది ఎన్నికలు. ఎన్నికల నిర్వహణకు ఉపాధ్యాయులు అత్యవసరం. ఎందుకంటే వీరికి సహనం ఎక్కువ.నోరు మూసుకొని తిండి తిప్పలు మాని ఉద్యోగ ధర్మం పేరు మీద అర్ధరాత్రి వరకు ఎన్నికల డబ్బాలు అప్పగించడానికి గంటల తరబడి క్యూలో నిలబడి కనీసం మంచినీళ్లకుకూడా నోచుకోని అభాగ్యులు. ఆ ఏర్పాట్లు ఎలా ఉంటాయో ఉపాధ్యాయులందరికీ అనుభవమే. నిత్యం విద్యార్థులతో, వారి తల్లిదండ్రులతో వీరికి ఏదో విధమైన సంబంధ బాంధవ్యాలు ఉంటాయి. ఆ ఎన్నికలను సాధ్యమైనంత వరకు పని దినాల్లోనే నిర్వహించడం రివాజు, వాటికి శిక్షణ తరగతులు కూడా నిర్వహిస్తారు. విద్యార్థులకు ఎంత నష్టమైనా ఉపాధ్యాయులకు ఎంత కష్టమైనా అధికారులకు ఏమీ పట్టదు. కొన్నిసార్లు ఉపాధ్యాయ దినోత్సవం జరుపుకునే అవకాశం కూడా లేకుండా పండుగలు, పబ్బాలు లేకుండా కూడా ఎన్నికల కమిషన్ ప్రవర్తిస్తుంది. ఇక భారత సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాల ప్రకారం అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం హెడ్మాస్టర్లకు, ఉపాధ్యాయులకు ఒక గుదిబండగా తయారైంది. ఆశయం మంచిదే, ఆచరణలోనే ప్రభుత్వ అయిష్టత,అలసత్వం అందుకు క్షేత్రస్థాయిలో ఉపాధ్యాయులు మూల్యం చెల్లించుకుంటున్న పరిస్థితినెలకొన్నది. దీనికి సంబంధించిన లెక్కల సమర్పణ ఇవన్నీ బోధనా సిబ్బంది బాధ్యత కాదు, విధిగా మారడం దారుణం. ప్రతి రోజును ఏదో ఒక దినోత్సవంగా జరుపుకోవడంఎక్కువైంది. ప్రమాణాల కంటే ప్రదర్శనలు ఎక్కువైనాయి. అంటే ప్రభుత్వమే ఒక పథకం ప్రకారం ఉపాధ్యాయులను తరగతిగదికి దూరం చేస్తున్నది. ఇవన్నీ చాలవన్నట్టు పుస్తకాల పంపిణీ, యూనిఫామ్స్ పంపిణీ, రవాణా వాటిలెక్కలు లాంటి బోధనేతర పనులు బోధనా వాతావరణాన్ని దెబ్బతీస్తున్నాయి. ఉపాధ్యాయుడి ఆసక్తి దారి తప్పుతున్నది. ఇంకా డిజిటల్ అభ్యసనం, ఆన్లైన్ అభ్యసనం లాంటివి కూడా టీచర్ స్థానాన్ని ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నాయి. సాంకేతికతపై అతిగా ఆధారపడుతున్నారు. డిజిటల్ టూల్స్,యాప్‌లు, స్మార్ట్ బోర్డులు, స్మార్ట్‌క్లాస్ రూములు దర్శనమిస్తున్నాయి. మానవ స్పర్శ లోపించి యాంత్రికత కేంద్రీకృతమైంది. బోధనలో స్వేచ్ఛ కల్పించనంత కాలం ఉపాధ్యాయుడి భోదనాకౌశల్యం పెరిగే అవకాశం లేదు. అతడు అనేక ప్రయోగాలు చేస్తూ వాటిలో ఉత్తమమైన దానిని తానే గుర్తించి ఉపయోగించి విద్యార్థులకు మరింత నేర్పుతో, కౌశల్యంతో, పట్టుదలతో ప్రభావవంతంగా బోధించగలుగుతాడు కానీ ఉన్నతాధికారులు అందుకు ఒప్పుకోరు. తమ ఫార్మాట్‌లోనే తమ మూసలోనే బోధించాలనేదే వారి సూత్రం. ఈ ప్రయోగాలు ఉపాధ్యాయుడి ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. అతని స్వేచ్ఛను హరిస్తున్నాయి. మొత్తంగా అతడికి బోధనపై ఉన్న ఆసక్తిని తగ్గిస్తున్నాయి. ఇంకా ఇతర పాఠశాలల్లోని ఉపాధ్యాయుల బోధనను పర్యవేక్షి ంచడానికి కూడా ఉపాధ్యా యులను వినియోగించుకుంటున్నారు. వారిని టీములుగా తయారు చేసి ఇతర పాఠశాలలకు పంపుతున్నారు.మంచిది కానీ వారిని తమ తరగతి గదికి దూరం చేస్తున్నారు. మరో పక్క కంప్యూటర్ స్కిల్స్ ఉండి అర్హతలు సంపాదించిన ఉపా ధ్యాయులు ఈ రోటీన్ బోధనను విడిచిపెట్టి ఇతర వృత్తుల ను ఆశ్రయిస్తున్నారు. మంచి వేతనాలతో సాఫ్ట్‌వేర్. ఉద్యో గాలు వారిని ఆకర్షిస్తున్నాయి. కొంతమంది గ్రూప్ సర్వీసు ల్లోకి వెళ్లిపోతున్నారు.పర్యవసానంగా తరగతి గదిలోబోధన కుంటుపడుతున్నది.పాఠశాల నిలబడాలి. విద్య కొనసాగాలి. అభ్యసనం నిరంతరంగా సాగాలి. నేర్చుకోవడానికి, బోధించడానికి వయస్సుతో నిమిత్తం లేదని తరగతిగదిని బ్రతికించా

# అభివృద్ధికి ఓటరు దిక్సూచిగా ఉండాలి!

డా.పోలం సైదులు

తెలంగాణ ప్రభుత్వం ఎట్టకేలకు నవంబర్ 25,2025న గ్రామపంచాయతీ ఎన్నికలకు నోటిఫికేషన్ ఇచ్చి 12,728 గ్రామాలలో నూతన సర్పంచులను ఎన్నుకునేందుకు డిసెంబర్ 11,14,17న మూడు విడుతలలో ఎన్నికలను నిర్వహించేదుకు సిద్దమైంది.ఈ ఎన్నికలో భాగంగా వివిధ గ్రామాలలో జరగబోతున్న పరిణామాలు,వాటితీరు సగటు మానవున్ని ఒకింత ఆశ్చర్యానికి గురిచేస్తుందని చెప్పవచ్చు. మిగతా ఎన్నికలతో పోలిస్తే పంచాయతీ ఎన్నికలు ప్రత్యేకం.ఎందుకంటే గ్రామాలలో 500 నుండి 25000 జనాభాకు 5నుండి 21 వార్డులుగా విభజింపబడి ఉంటుంది.పంచాయతీ రిజర్వేషన్ ప్రకారం ఇప్పటికే ఆశవాహులు ఓటరులిస్టు ముందర పెట్టుకొని ప్రచారం చేసుకుంటూ,తమ ఓట్లను లెక్కబెట్టుకుంటూ తమగెలుపుకోసం ఏమేమి చేయాలో,ఎలా చేయాలో విశ్లేషణతో ఒక అంచనా వేసుకుంటుంటారు. గ్రామాలలో కొంతమంది ప్రజలు ఒక వర్గానికి బహిరంగంగా మద్దతునిస్తూ ప్రచారంలో సైతం పాలుపంచుకుంటారు. ఇలాంటి వాళ్ళతో అభ్యర్థులకు ఎలాంటి అనుమానం లేదు. అయినప్పటికీ అభ్యర్థులు వారికి వివిధ ప్రోత్సహకాల ఆశచూపో, ఇంకేమైనా అవకాశాలు కల్పించో, రహస్యంగా మంతనాలు జరుపుతూ,తమవైపుకు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తుంటారు .మరొక వర్గం బరిలోనున్న అందరితో మంచిగా నడుచుకుంటూ ఎవ్వరు వచ్చి ఓటు అడిగినా సరేనని తల ఊపుతూ వుంటారు. వీరు ఎవ్వరికి ఓటు వేస్తారో తెలుసుకోలేక అభ్యర్థులు తలలు పట్టుకుంటారు.వీరిని తమవైపు తిప్పుకోవడానికి భారీ ప్రోత్సహకాలను, బహుమతులను, వివిధ రకాల హామీలిస్తూ,విందు వినోదాలతో ఎక్కువ సమయం గడుపుతుంటారు. అలా గడిపి హమ్మయ్యా ! వీరి ఓట్లను సాధించాను అనుకునేలోపే మరుసటి రోజు మరొక అభ్యర్థితో రహస్యంగా ఇలాంటి తంతే జరుగుతుంది. ఒకవేళ తెలిసి ఏం ఇలా జరిగిందని ప్రశ్నిస్తే ?నా ఓటు నీకే కానీ ! అతను పిలిస్తే వెళ్ళాను, ఏదో అలా వారు చెప్పింది విని వచ్చానని చెప్పడం. ప్రత్యేకంగా గ్రామాలలో ఒక వింత ఆచారం కొనసాగుతుంది. ఓట్లకోసం ప్రమాణాలు చేయించడం,వివిధ దేవుళ్లపై ఒట్లు పెట్టించడం,డబ్బులు పంచడం,మద్యం పంచడం లాంటివి చేస్తుంటారు.ఒక అభ్యర్థి గెలవడానికి పెట్టే మొత్తం ఖర్చులో సగానికిపైగా మద్యం కొరకే పెడుతున్నారన్న ఆశ్చర్యబోనక్కరలేదు.ఇలాంటి పరిస్థితి కేవలం గ్రామాలల్లో జరుగుతుందని తేలికగా తీసివేయడానికి వీలులేదు.గ్రామాలలో సైతం ఉన్నత చదువులు చదివిన యువత ఉండికూడా ప్రజలలో మార్పును తీసుకరాకపోవడానికి గల కారణాలను విశ్లేషిస్తే, అన్నీ విషయాలలో సంపూర్ణ జ్ఞానమున్నవారే ఈ అలవాటుకు కారకులవుతున్నారన్నది ముమ్మాటికీ నిజం. నేను నా దేశ ప్రజలకు కత్తి చేతికి ఇవ్వలేదు.ఓటుహక్కు ఆయుధంగా ఇచ్చాను.పోరాడి రాజులవుతారో అమ్ముకుని బానిసలవుతారో అది వారిచేతుల్లోనే ఉంది అని ఏనాడో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సెలవిచ్చారు. ఓటరు అంటే అభివృద్ధికి దిక్సూచీ. ఓటరు ఎలాంటి ప్రోత్సాహకాలను ఆశించకుండా,నిష్పక్షపాతంగా ఉంటూ,ఓటు విలువను పలువురికి తెలియబరుస్తూ,ప్రోత్సహిస్తూ,అభివృద్ధికి పాటుబడే అభ్యర్థి పక్షాననిలిచి,బలపరుస్తూ, విజయంలో కీలకపాత్ర వహించి, గెలుపుకు పాటుబడుతూ ఆతర్వాత కావల్సిన అభివృద్ధిని చేయించుకోవడానికి, ప్రశ్నించడానికి ప్రతిఒక్కరికి ధైర్యంగా ఉంటుంది.కావున ప్రతిఒక్కరు ఆ విధంగా ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. ఓ ఓటరు మహాశయా ! ఈ ప్రజాస్వామ్యంలో,రాజ్యాంగ బద్ధంగా నీకే అభివృద్ధికి బాటలువేసే మార్గాన్ని సూచించి వెళ్లారు మహనీయులు. ఓటర్లందరు ఆలోచించాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. మనం మారకుంటే మనల్నీ మార్చేవారు సైతం మనదగ్గరకు రాలేరు. ఆలోచించి మంచినిర్ణయాన్ని తీసుకొని గ్రామాభివృద్ధికి తోడ్పడుతూ,సమాజాభివృద్ధిలో భాగం పంచుకోవాలి. ●

# సినీ రంగం వారివి మేడిపండు నీతులేనా?



అన్నవరపు బ్రహ్మయ్య

ఐబొమ్మ వ్యవహారంలో ఇమ్మడి రవి నేరస్థుడా? శిక్ష పడుతుందా? లేదా అనే అంశాలనుపక్కన పెడితే సినిమా రంగానికి చెందిన ప్రముఖులు ప్రజల దృష్టిలోవిలన్లు మారారనిపిస్తోంది. ఇమ్మడి రవి అరెస్టు అయిన సందర్భంగా ఏదో ఘనకార్యం సాధించినట్టు సినిమా నటులు, దర్శకులు, నిర్మాతలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేయడం, సమావేశంలో వారు మాట్లాడిన తీరు చాలా చౌకబారుగా వుంది. అంతేకాకుండా సినిమా ప్రముఖుల పుణ్యమా అని పోలీసు అధికారులను కూడా ప్రజలు నిలదీస్తున్నారు. ప్రజలలో కొద్దిగా విలువలు కలిగిన హీరో చిరంజీవి. విలేకరుల సమాశంలో పాల్గొనకుండా వుంటే బాగుండేదనే అభిప్రాయపడుతున్నారు. నిర్మాత చిల్లర కళ్యాన్ మరో అడుగుముందుకు వేసి రవిని పోలీసులు ఎన్‌కౌంటర్ చేయాలంటూ వ్యాఖ్యానించారు. దీనిని బట్టి సమాజం పట్ల, చట్టం పట్ల వారికున్న పరిజ్ఞానం ఏపాటిదో అర్థం అవుతోంది. అంతేకాకుండా కళ్యాన్ పోలీసులు ఎన్‌కౌంటర్ చేయకపోతే సినిమారంగానికి చెందిన మనమే అతనిని ఎనౌంటర్ చేయాలంటూ ఆవేశంగా మాట్లాడారు. ఆయన దృష్టిలో ఎన్‌కౌంటర్ చేయడం అంటే హత్య చేయడం. ఒక వ్యక్తి బహిరంగంగా హత్య చేస్తామని ప్రకటించడం భారతీయ శిక్షాస్మృతి ప్రకారం నేరమవుతుంది. సినిమా రంగానికి చెందిన వ్యక్తులు నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు ప్రస్తావించిన అంశాలన్నింటిని ప్రజలు సోషల్ మీడియా ద్వారా తూర్పారపడుతున్నారు. వందలు, వేల కోట్ల రూపాయల పెట్టుబడితో సినిమాలుతీస్తున్నామని, పైరసీ కారణంగా నష్టపోతున్నామని, సినిమా పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న వేలమంది కార్మికుల ఉపాధి దెబ్బతింటోందని వారు చెప్పడాన్ని ప్రజలు వ్యతిరేకిస్తున్నారు.అసలు వందలు, వేల కోట్ల రూపాయలతో సినిమాలు ఎవరు తీయమన్నారని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. కథాబలం, తగినవిధంగా చిత్రీకరణ చేసిన కోటి, రెండు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించిన ఎర్రదండూ, ఒరేయ్ రిక్షా వంటి సినిమాలే కాకుండా 'ఈ నగరానికి ఏమైంది? వంటి సినిమాలు ఆర్థికంగా ఎంతో ఘన విజయం సాధించాయి. 'అత్తారింటికి దారేది' అనే సినిమా విడుదలకు ముందే పైరసీకి గురైన, విడుదలైన తర్వాత ఎంతటి ఘనవిజయం సాధించిందో అందరికీ తెలుసు. నిజంగా సినిమా మెచ్చే విధంగా వుంటే భారీ సినిమానా,చిన్న సినిమానా అని చూడరు. ప్రస్తుతం సమాజంలో వివిధ రంగాలలో పని చేస్తున్న వృత్తిదారులు, ఒక హీరో పడే కష్టం కంటే సాంకే తిక నిపుణులు పడే కష్టం అగ్రభాగంలో ఉంటుంది. నిజానికి గ్రాఫిక్స్, యానిమేషన్ అభివృద్ధి చెందిన తర్వాత హీరోల కష్టం నామమాత్రంగా మారింది. హీరో, హీరోయిన్లకు, దర్శకులకు వందల కోట్ల రూపాయల పారితోషికం ఇచ్చి భారీ సినిమాలంటే ఎలా? అని ప్రశ్నిస్తున్నారు. భారీ పెట్టుబడుల పేరు చెప్పి ప్రభుత్వం నుంచి రాయితీలు పొందడం, 100 రూపాయల సినిమా టిక్కెట్టు 1000 నుంచి 3000 రూపాయలకు పెంచి, నిర్మాతలు పేదల ప్రజలను నిలువు దోపిడీ చేస్తున్నారు. హైదరాబాద్ సినిమా థియేటర్ తొక్కిసలాట జరిగిన సందర్భంలో ఎట్టిపరిస్థితుల్లో సినిమా టిక్కెట్ల ధరలను పెంచడానికి అనుమతించమని ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం నెల రోజులు కూడా దాటకుండానే టిక్కెట్ రేటు పెంచడానికి అనుమతించించడానికి వెనుక వున్న రహ స్యం ఏమిటని కూడా ప్రజలు ప్రశ్నిస్తున్నారు. సినిమా టిక్కెట్ల రూపంలో చేసే దోపిడి చాలదన్నట్టుగా సినిమా థియేటర్ల యజమానులు ప్రజల జేబులను కొల్లగొడుతున్నా రు. 20 రూపాయాల పాప్కార్న్ 200 రూపాయలు, 20 రూపాయల వాటర్ బాటిల్ 150 రూపాయలు, 40 రూపాయల కూల్డ్రింక్ బాటిల్ 120 రూపాయలు, 10 రూపాయల చాక్లెట్ 100 రూపాయల వంతున అమ్ముతున్నప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడానికి కారణం ఏమటని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వపరంగా వందల కోట్ల రూపాయలు రాయితీ పొందే నిర్మాతలు, వందల కోట్ల పారితోషికం తీసుకొనే హీరోలు సినిమా విజయం తర్వాత కిందిస్థాయి కార్మికులకు ఎటువంటి మేలు చేయడం లేదు.కొంత మంది పెద్ద హీరోలకు చెందిన సంస్థలకు చెందినవారు 'మాలాంటి సంస్థలలో మీకు వేషం ఇవ్వడమే ఎక్కువ అంటూ చిన్ని చిన్న నటులకు జూనియర్లకు సరిగా పారితో షికం కూడా చెల్లించరనేది బహిరంగ రహస్యం 'కమిట్మెంట్' వ్యతిరేకంగా జరిగిన ఉద్యమం సమయంలో గెస్ట్ అరిస్టులు మీడియాకు ఇచ్చిన ఇంటర్వ్యూలు చూస్తే అర్థమవుతుంది. బొమ్మ రవిపై పెట్టిన కేసులలో బెట్టింగ్ యాప్లను ప్రమోటీకు సంబంధించినది కూడా వుంది. ప్రముఖ సినిమా నటులు కొందరు బెట్టింగ్ యాప్లను ప్రమోట్ చేశారు. ఒక ప్రముఖ సినిమా నిర్మాతకు చెందిన ఓటిటి సంస్థ బెట్టింగ్ యాప్‌లకు సంబంధించిన యాడ్లను కూడా ప్రసారం చేసింది. అయినా ఆ నటులందరూ దర్జాగా బయట తిరుగుతూనే వున్నారు. అదే విధంగా మాదక ద్రవ్యాల వినియోగం, వ్యాపారాలకు సంబంధించి కూడా సినిమా నటులపైకేసులు వున్నాయి. వంద కోట్ల రూపాయలు గడిస్తున్న సినిమా స్టూడియో యజమానులు కొందరు కనీసం పన్నులు కూడా సకాలంలో చెల్లించకుండా నీతులు చెప్పడం ఆశ్చర్యం అనిపిస్తోంది. ఇతర దేశాలకు చెందిన సినిమా కథలను కాపీచేసి సినిమాలు నిర్మిస్తున్న కొంతమంది ప్రముఖ నిర్మాతలు, దర్శకులు పైరసీ గురించి నీతులు చెప్పడం మరీ వింతగా వుందంటున్నారు. 'మేడిపండు చూడు మేలిమై వుండు పొట్ట విప్పి చూడు పురుగులుండు' అన్న శతకకారుని పద్యంవీరికి కచ్చితంగా సరిపోతుంది. అన్నింటికి మించి ప్రస్తుతం భారతదేశ పౌరసత్వం వదులుకొని, ఇతర దేశంలో పౌరసత్వం తీసుకున్న ఇమ్మడి రవిపై పోలీసులు కేసులు ఏ మేరకు ప్రభావం చూపిస్తాయో వేచిచూడాలి. ●




మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

# సమగ్ర సర్వే వేగవంతంగా పూర్తి చేయాలి

## నోడల్ అధికారుల పర్యవేక్షణ నిర్వహించాలి

## నగర కమిషనర్ పులి శ్రీనివాసులు

**గుంటూరు కార్పొరేషన్, నవంబర్ 27, ప్రభాతవార్త:** గుంటూరు నగరంలో ఉన్న వార్డు సచివాలయాల వారీగా ఇంటింటికి వెళ్లి సేకరిస్తున్న సమగ్ర సర్వే వేగవంతంగా పూర్తి చేయాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులు ఆదేశించారు. సమగ్ర సర్వే సేకరించే విధానంపై నోడల్ అధికారులు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ నిర్వహించాలని సూచించారు. నగరంలో జరుగుతున్న సర్వే తీరు, కుటుంబ సభ్యుల డేటా ఆన్ లైన్ జాబితా నమోదు ప్రక్రియను గురువారం పలు సచివాలయాలకు వెళ్లిన కమిషనర్ పులి



శ్రీనివాసులు ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలో సమగ్రమైన సర్వే ఖచ్చితమైన వివరాలతో ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని సూచించారు. ప్రతి కార్యదర్శి తమకు కేటాయించిన క్లస్టర్లో ప్రజలకు సర్వే అంశంపై వివరించి నిర్దేశిత ఫార్మేట్లో వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. సర్వే నిర్వహించే కార్యదర్శులు తప్పనిసరిగా ఐడి కార్డును ధరించి ఉండాలని స్పష్టం చేశారు. సర్వే పర్యవేక్షణ పై విభాగాల అధిపతులు, సీనియర్ అధికారులను కేటాయించడం జరిగిందని, తాను కూడా ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని స్పష్టం చేశారు. వివరాల నమోదు ఆన్లైన్ ప్రక్రియలో ఎటువంటి సాంకేతిక లోపం ఏర్పడిన టీఎంయూ టీం తో సంప్రదించాలని సూచించారు. ప్రజలు ఇంటి వద్ద నుంచే పురపాలక సేవలు పొందేలా రాష్ట్ర ప్రభుత్వం పురమిత్ర, మనమిత్ర యాప్లను అందుబాటులోకి తెచ్చిందని వాటిని కూడా డౌన్లోడ్ చేసుకోవాలని ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. సచివాలయంలో సమస్యలను కమిషనర్ దృష్టికి సిబ్బంది తీసుకొని వచ్చారు. వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ పర్యటనలో నోడల్ పోలేశ్వరరావు, సచివాలయాల కార్యదర్శులు పాల్గొన్నారు.

# మొదటి సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ రద్దుచేసిన ఏఎన్‌యు

## -ఫీజు షెడ్యూల్ యధాతదమే

ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం, నవంబరు27, ప్రభాతవార్త: పీజీ అడ్మిషన్లు పూర్తికాకుండానే పరీక్షలు...! ఏఎన్‌యు వితం ధోరణికి విద్యార్థులు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి అంటూ 'ప్రభాతవార్త' ప్రచురించిన కథనంకు వర్సిటీ అధికారులు స్పందించారు. ఈమేరకు గురువారం ఏఎన్‌యు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆలపాటి శివప్రసాదరావు పత్రికా ప్రకటనను విడుదల చేశారు. పీజీ కోర్సుల్లో ప్రవేశాలు పూర్తయ్యే వరకు మొదటి సెమిస్టర్ పరీక్షల షెడ్యూల్ రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఇన్‌చార్జ్ వీసి ఆచార్య కె.గంగాధరరావు ఆదేశాల మేరకు షెడ్యూల్‌ను రద్దు చేస్తున్నట్లు వివరించారు. అడ్మిషన్ల ప్రక్రియ అనంతరం ఉన్నత విద్యామండలి సూచనలతో నూతన షెడ్యూల్‌ను ఇస్తామని పేర్కొన్నారు. అయితే ఫీజు చెల్లించే తేదీలు మాత్రం ముందుగా ప్రకటించిన విధంగానే ఉంటాయని స్పష్టంచేశారు. ఇప్పటికే అడ్మిషన్లు పూర్తయిన విద్యార్థులు డిసెంబరు 1లోగా అన్ని పేపర్లకు కలిపి ఫీజు రూ.980 చెల్లించాలని సూచించడం గమనార్హం.

**'వార్త' ప్రభావం**

# బ్యాంకుల శంకుస్థాపన వేదికను పరిశీలించిన కలెక్టర్

**గుంటూరు వెస్ట్, నవంబరు 27, ప్రభాతవార్త :** తుళ్లూరు మండలం రాయపూడిలో బ్యాంకుల కార్యాలయాలకు శుక్రవారం జరగనున్న శంకుస్థాపన కార్యక్రమం వేదికను జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా గురువారం పరిశీలించారు. ఏర్పాట్లు పక్కాగా ఉండాలని ఆదేశించారు. ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఏపీ కోఆపరేటివ్ బ్యాంక్ లిమిటెడ్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, కెనరా బ్యాంక్, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, నాబార్డ్, పంజాబ్ నేషనల్ బ్యాంక్, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్, ఐడిబిఐ, లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్, న్యూ ఇండియా ఎస్యూరెన్స్ కంపెనీ లిమిటెడ్ సంస్థలు కార్యాలయాలు ఏర్పాటు చేయనున్నాయి.



ఈ సంస్థల వల్ల 6576 మందికి ఉద్యోగ అవకాశాలు రానున్నాయి. బ్యాంకులు 1334 కోట్లు పెట్టుబడి పెట్టనున్నాయి. ఈ కార్యక్రమంలో గ్రామీణ నీటి సరఫరా విభాగం పర్యవేక్షక ఇంజనీర్ కె.కళ్యాణ చక్రవర్తి, రెవిన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, తదితరులు పాల్గొన్నారు.


# 3న తూర్పు నియోజకవర్గంలో జాబ్ మేళా

**గుంటూరు వెస్ట్, నవంబర్ 27,ప్రభాతవార్త:** గుంటూరు తూర్పు నియోజకవర్గంలో వచ్చేనెల మూడో తేదీన నిర్వహించే జాబ్ మేళాను నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ పిలుపునిచ్చారు. జాబ్ మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్ ను గురువారం స్థానిక గుంటూరు తూర్పు శాసనసభ్యుల వారి కార్యాలయంలో ఎమ్మెల్యే నసీర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నిరుద్యోగ యువత కలలు సాకారం అవుతున్నాయని తెలిపారు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు 20 లక్షల ఉద్యోగాల కల్పన దిశగా అడుగులు వేస్తున్నామన్నారు. విశాఖ వేదికగా జరిగిన సీఐఐ సమ్మిట్ లో 13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించామన్నారు. తద్వారా 13 లక్షల ఉద్యోగాలు సృష్టించబోతున్నామని తెలిపారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో స్కిల్ కమ్యూనికేషన్స్ డిపార్ట్మెంట్ ఆధ్వర్యంలో గుంటూరులోని పొన్నూరు రోడ్డులో నిర్వహించబోయే జాబ్ మేళా సువర్ణావకాశమని తెలిపారు. ఈ జాబ్ మేళా ద్వారా 900 ఉద్యోగాలకు ప్రముఖ కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నాయని వెల్లడించారు. సుమారు రూ.10 వేలు నుంచి రూ.30 వేల వరకు వేతనం కలిగిన ఉద్యోగాలను ఆయా కంపెనీలు ఆఫర్ చేయబోతున్నాయని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం విజనరీతో పని చేస్తోందని, ఈ క్రమంలో ఇప్పటికే డీఎస్సీ ద్వారా 16500పైగా ఉద్యోగాలను కల్పించామని తెలిపారు. ప్రభుత్వంతోపాటు ప్రైవేటు రంగంలోనూ ఉద్యోగ అవకాశాలు సృష్టిస్తున్నామని అన్నారు. సీఎం చంద్రబాబు నాయుడు స్వర్ణాంధ్రప్రదేశ్ సాధనకు యువతే ప్రధాన ఆయుధమని ఈ సందర్భంగా పేర్కొన్నారు .



# కాపునాడు బహిరంగ సభ ఆహ్వాన పోస్టర్ ను ఆవిష్కరించిన దేగల ప్రభాకర్

**గుంటూరు వెస్ట్, నవంబర్ 27, ప్రభాతవార్త:** కాపునాడు స్వర్ణోత్సవ వేడుకలు విజయవాడ నగరంలో స్వర్గీయ వంగవీటి మోహనరంగారావు మరియు మిరియాల వెంకటరావు గార్లచే 50 సంవత్సరముల క్రితం స్థాపించబడిన కాపునాడు,వారి తదనంతరం గాళ్ళ సుబ్రహ్మణ్యం సారధ్యంలో దిగ్విజయంగా కొనసాగుతున్న కాపునాడు స్వర్ణోత్సవ వేడుకలను పురస్కరించుకొని నవంబర్ 30 ఆదివారం సాయంత్రం 5 గంటలకు విజయవాడ గాంధీ నగర్ లోని జింఖానా గ్రౌండ్స్ లో గొప్ప బహిరంగ సభ నిర్వహించబడుతుంది ఈ బహిరంగ సభను పురస్కరించుకొని ఆహ్వాన ప్రతులను గుంటూరు



జిల్లా కాపునాడు మరియు రాష్ట్ర కాపునాడు ఆధ్వర్యంలో ఏపీ ఐ డి సి చైర్మన్ దేగల ప్రభాకర్ రావు మరియు కాపు పెద్దలు మలిశెట్టి సుబ్బారావు గార్లచే ఆవిష్కరించడం జరిగినది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షులు యర్రగోపు నాగేశ్వరరావు , రాష్ట్ర కాపునాడు కార్యదర్శి రాగం సదాశివరావు , కాపునాడు జోన్ 3 అధ్యక్షులు బొందలపాటి వెంకట్రావు , కాపునాడు జిల్లా అధ్యక్షులు చెల్లుబోయిన శ్రీనివాసరావు , జిల్లా కాపునాడు ఉపాధ్యక్షులు సోమ రౌతు శ్రీనివాస రావు , కాపు నాయకులు చెన్నం శెట్టి చక్రపాణి , తోట కోటేశ్వరరావు , తోట అక్కి , మేకల బాబురావు , బొక్కిసం శివరాం మరియు కాపు ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

# గుంటూరు వార్త

## సమాజసేవకు ప్రతిరూపం కామేశ్వరరావు: వెంకయ్యనాయుడు

**తెనాలి టౌన్, నవంబర్27(ప్రభాతవార్త):** సమాజ సేవకు ప్రతిరూపం కామేశ్వరరావు అని, నేటి తరానికి ఆయన ఒక దిక్సూచి లాంటి వాడని భారతమాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో,శోధన సంస్థ ద్వారా సమాజ సేవకు విశేషంగా కృషి చేస్తున్న తిమ్మరాజు దుర్గ కామేశ్వరరావుకు భారత జ్యోతి పురస్కార ప్రధానోత్సవములో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించిన ఈ సభకు అవనిగడ్డ శాసనసభ్యులు మండలి బుద్ధ ప్రసాద్ కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ తదితర ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు మాట్లాడుతూ కామేశ్వరరావు జీవితం సమాజ సేవకు అంకితం అయిపోయిందని ఆయన సేవను నేటి తరాలే కాకుండా భవిష్యత్ తరాలు కూడా పాటించాలని సేవకు ప్రతిరూపం కామేశ్వరరావు అని పేర్కొన్నారు.ఎందరో కళాకారులు జన్మించిన గడ్డ ఈ తెనాలి ప్రాంతమని ఎన్నో ఉద్యమాల్లో పాల్గొన్న ప్రముఖులు,రాజకీయ దురంధరులు,ముఖ్యంగా కళలకు కాణాచి అయిన ఈ ప్రాంతంలో, పెమ్మరాజు దుర్గ కామేశ్వరరావు కి తన చేతుల మీదుగా భారత జ్యోతి పురస్కారం అందించడం చాలా ఆనందంగా ఉందన్నారు. అంతేకాకుండా ప్రభుత్వాలు ఉచిత పథకాలతో ప్రజలను సోమరిపోతులుగా మారుస్తున్నారని విమర్శించారు విద్య వైద్యం ఉచితంగా ఇస్తే చాలని బస్సులు ఫ్రీగా ఇవ్వమని ఎవరడిగారని ఆయన ప్రశ్నించారు. సంపద సృష్టించాలి తప్ప అప్పులు చేయటం సరికాదన్నారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో తెలుగులోనే పరిపాలన చేయాలని ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పట్టణంలోని ప్రముఖులు మేధావులు పలువురు కూటమి నాయకులు ప్రజలు పాల్గొన్నారు.



# జాతీయ మైలురాయిని సాధించిన ఎపి సిఆర్డీయే

**గుంటూరు-ప్రభాతవార్త ప్రతినిధి, నవంబర్ 27:** ఎపి రాజధాని ప్రాంత అభివృద్ధి అధారిటీ (ఎపిసిఆర్డీఏ) ఒక ప్రధాన జాతీయ మైలురాయిని సాధించింది. అమరావతి రాజధాని నగరంలోని రాయపూడి గ్రామంలో ఉన్న ఎపి సిఆర్డీఏ ప్రాజెక్టు ఆఫీస్ డిజైన్ దశలో ఐజిబిసి నెట్ జీరో ఎనర్జీ రేటింగ్ పొందిన భారతదేశపు తొలి ప్రభుత్వ భవనంగా నిలిచింది. 2025 నవంబన్ 27-29 వరకు ముంబైలోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన ఐజిబిసి గ్రీన్ బిల్డింగ్ కాంగ్రెస్ 25లో ఈ




గౌరవం లభించింది. ఎపి సిఆర్డీయే చీఫ్ ఆర్కిటెక్ట్ , డిజైన్ కో ఆర్డినేటర్ సందీప్ దీక్షిత్ అధారిటీకి ప్రాతినిధ్యం వహించారు. , ఎపి సిఆర్డీయే తరపున ప్రతిష్టాత్మక అవార్డును అందుకున్నారు. ఇండియన్ గ్రీన్ బిల్డింఫ్ కౌన్సిల్ ( ఐజిబిసి) ఇచ్చిన ఈ గురినతంపు అమరావతి ప్రాంతానికి ఇంధన సమర్ధవంతమైన, స్థిరమైన , వాతావరణ స్థిరమైన ప్రజా వేదిక సదుపాయాలను అభివృద్ధి చేయటంలో ఎపి సిఆర్డీయే నాయకత్వాన్ని హైలెట్ చేస్తుంది.

# నేడు అవగాహన..లో గుంటూరు గాంధీ వర్ధంతి

గుంటూరు కల్చరల్,నవంబర్ 27,ప్రభాతవార్త : అవగాహన సంస్థ ఆధ్వర్యంలో 40సంవత్సరాల పాటు గుంటూరు నగరంలో పారిశుద్ధ్య శ్రమదానం చేసి గుంటూరుగాంధీగా పేరొందిన వట్టికూటి వెంకటసుబ్బయ్య వర్ధంతి కార్యక్రమం ఏర్పాటు చేయబడిందని సంస్థ కార్యదర్శి కొండా శివరామిరెడ్డి తెలిపారు.నవంబర్ 28వ తేది శుక్రవారం ఉదయం 8గంటలకు స్థానిక లక్ష్మీపురం మెయిన్‌రోడ్డులోని గుంటూరు గాంధీ విగ్రహం వద్ద (హలీవుడ్,బాలివుడ్ థియోటర్ల సమీపంలో) సంస్మరణ సభ జరుగుతుంది.మాజీమంత్రి,ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్ కార్యక్రమానికి ముఖ్యఅతిధిగా పాల్గొంటారని సంస్థ కార్యదర్శి తెలిపారు.నగరవాసులందరి అభిమానం సంపాదించి శ్రమదానం,సాహిత్య సేవతో ఉదారంగా అనేక సంస్థలకు విరాళాలిచ్చిన వట్టికూటి వెంకటసుబ బ్బయ్యను స్మరించుకునేందుకు అవగాహన సంస్థ ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా అవగాహన సంస్థ విజ్ఞప్తి చేస్తుంది.

# బార్ అండ్ రెస్టారెంట్లు... 24 గంటలూ ఆన్‌డ్యూటీనే..

## ఎనీటైం... మద్యం అందుబాటులోనే.. !

**ఎమ్మార్పీ రేట్లు కంటే అధికంగా విక్రయాలు ... చోద్యం చూస్తున్న అధికారులు**

**గుంటూరు ఈస్ట్ క్రైమ్, నవంబర్ 27,ప్రభాతవార్త :** గుంటూరు నగరంలోని పలు బార్ అండ్ రెస్టారెంట్లు సమయపాలన పాటించ కుండ రాత్రి వేళలో పూర్తిగా తెరిసే ఉంటున్న పట్టించుకోని ఎక్సైజ్, పోలీస్ శాఖలు. వాస్తవానికి బార్ అండ్ రెస్టారెంట్లు ఉదయం 10 గంటల నుండి రాత్రి 12 గంటల వరకు మాత్రమే తెరిచి ఉండాలి. కానీ ఈ నిబంధనకు నీళ్ల వదిలి రాత్రంతా తెరిసే



ఉంటున్నాయని స్థానిక వాసులంతా ఆరోపిస్తున్నారు. బార్ అండ్ రెస్టారెంట్లు ఉదయం 10 గంటలకు తీయాల్సి ఉండగా కొన్ని బార్ రెస్టారెంట్లు 10 గంటల లోపే మందు బాబులకు అందుబాటులో తీస్తున్నారు. సమయపాలన పాటించని బార్ అండ్ రెస్టారెంట్లు పై తనిఖీలు దాడులు చేయటం లేదని విమర్శలు వెల్లువిరుస్తున్నాయి. సమయపాలన పాటించకపోవడంతో పాటు బార్ అండ్ రెస్టారెంట్లు క్వార్టర్కు ఎమ్మార్పీ రేట్ కంటే అధికంగా 40 రూపాయల నుండి 70 రూపాయల వరకు మందు బాబుల వద్ద బిల్లు వసూలు చేస్తున్నారు. ఈ లెక్క ప్రకారం చూసుకుంటే ఒక ఫుల్ బాటిల్ ఎంఆర్పి రేట్లు కంటే లీసుమారు 200 రూపాయల కంటే అధికంగా మందు బాబులను దోచుకుంటున్నారని మద్యం ప్రియులు గగ్గోలు పెడుతున్నారు. ప్రత్యేకించి రాత్రి వేళలో సమయపాలన పాటించకపోవడం వలన మందుబాబులు అధికంగా మద్యం సేవించి ఆయా రెస్టారెంట్ లోనే ఘర్షణలు గొడవలు పడుతున్నారు. కొన్ని సందర్భాలలో ఈ ఘర్షణలు పెరిగి హత్యలకు దారితీస్తున్నాయి. ఇలాంటి సంఘటనలు ఇప్పటికే పలు రెస్టారెంట్లు చోటుచేసుకున్నాయి. ఇలాంటి సంఘటనలను జరగకుండా పోలీస్ ఎక్సైజ్ శాఖ లు సంయుక్తంగా బార్ షాపులపై దాడులు చేయటం కేసులు నమోదు చేయటం అలాంటి చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. భవిష్యత్తులో సమయపాలన పాటించేలా, అధికంగా మద్యం రేట్లు విక్రయించకుండా తగిన చర్యలు తీసుకోవాలని మందుబాబులు కోరుతున్నారు. అదేవిధంగా కొన్ని బార్ అండ్ రెస్టారెంట్లలో నైట్ 12తర్వాత కూడా అమ్మకాలు జరగటం కొన్ని బార్ అండ్ రెస్టారెంట్లో తెల్లవారుజామున మూడు గంటల నుంచి అమ్మకాలు జరగటం ఆ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు కొన్ని బార్ అండ్ రెస్టారెంట్లో యదేచ్చగా అమ్మకాలు నాజ్ సెంటర్ జిన్నా టవర్ సెంటర్ మరియు బస్టాండ్ సరౌండింగ్ ప్రాంతాల్లో అసలు బార్ అండ్ రెస్టారెంట్లు మూసివేయకుండా నైట్ మొత్తం బార్ అండ్ రెస్టారెంట్లో అమ్మకాలు విచ్చలవిడిగా జరిగి పలు రకాల వివాదాలకు దారితీస్తున్నాయి ఈ సందర్భంగా ఎక్సైజ్ పోలీసు వారు గమనించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరడమైనది.

# గుంటూరు పశ్చిమలో రూ.16.44 కోట్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి

**గుంటూరు వెస్ట్ నవంబర్ 27 ప్రభాతవార్త :** గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయి. గురువారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే శ్రీమతి గళ్ళా మాధవి, మేయర్ కోవెలమూడి రవీంద్రలు నియోజకవర్గంలోని వివిధ డివిజన్లలో మొత్తం ..16.44 కోట్ల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. రోడ్లు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, సీసీ డ్రెయిన్లు, వాటర్ పైప్‌లైన్లు వంటి కీలక మౌలిక వసతుల పనులకు శంకుస్థాపన చేశామని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి గుంటూరు పశ్చిమలో అభివృద్ధి పనులు వేగంగా జరుగుతున్నాయని,8



డివిజన్లలో 16 కోట్లకు పైగా అభివృద్ధి పనులకి ఒకే రోజు శంకుస్థాపన చేయటం జరిగింది.ప్రజలు కోరిన ప్రతి అభివృద్ధి పనిని వెంటనే అంచనాలు తయారు చేయించి మంజూరు చేయడంలో మేయర్ కోవెలమూడి రవీంద్ర సహకారం అభినందనీయమని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు.కాంట్రాక్టర్లు తీసుకున్న పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులో తీసుకొని రావాలి. అలాగే కార్పొరేషన్ బిల్లులు కూడా వేగంగా క్లియర్ చేయాలని మేయర్ కోవెలమూడి రవీంద్ర ను కోరుతున్నాను" అని ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు.39వ డివిజన్‌లో మాత్రమే సుమారు .. 3 కోట్ల విలువైన పనులు ప్రారంభించామని, గుజ్జనగుండ్ల సెంటర్ నుంచి రత్నగిరి, పలకలూరు ప్రాంతాల వరకు రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం వేగంగా జరుగుతోందని ఎమ్మెల్యే తెలిపారు. అభివృద్ధి-సంక్షేమం రెండూ మా పశ్చిమ నియోజకవర్గంలో రెండు కన్నుల్లా ముందుకు సాగుతున్నాయి. ప్రజల కోసం నిరంతరం పనిచేయడం కూటమి ప్రభుత్వ ధ్యేయం" అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జనసేన, టిడిపి, బీజేపీ పార్టీల డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# పంటల సాగును లాభదాయకంగా మార్చడమే లక్ష్యం

**తుళ్ళూరు,నవంబర్ 27,ప్రభాతవార్త :** పంటల సాగును లాభదాయకంగా మార చ్చడమే లక్ష్యంగా రైతన్న మీ కోసం కార్యక్రమాన్ని అమలు చేయడం జరుగుతోందని తుళ్ళూరు మండల వ్యవసాయశాఖాధికారి పి.సంధ్యారాణి చెప్పారు.గురువారం మండల పరిధిలోని పెదపరిమిలో రైతన్న మీ కోసం కార్యక్రమం జరిగింది.దీనిలో ప్రతి ఒక్క రైతు కుటుంబాలను కలసి ప్రభుత్వం అమలు చేస్తున్న అన్నదాత సుఖీభవ-పిఎం కిసాన్‌ద్వారా ప్రభుత్వం రూ.20వేలను ఏడాదికి మూడు దఫాలూ రైతులు ఖాతాలో జమచేయడం జరుగుతోందని ఈ సందర్భంగా ఏఓ చెప్పారు.వ్యవసాయ శాఖ ద్వారా అమలవుతున్న ఇతర పథకాల గురించి రైతులకు వివరించారు.నూతన సాంకేతిక పరిజ్ఞానంతో డ్రోన్ల ద్వారా పురుగుమందులు పిచికారిని ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని,వీటిని వాడటం వల్ల పెట్టుబడి వ్యయం తగ్గుతుందన్నారు.కార్య క్రమంలో రైతులతోపాటు టిడిపి నాయకులు ధనేకుల సుబ్బారావు,పుట్టి రామచంద్రరావు,దామినేని శ్రీనివాసరావు,నీటి సంఘం అధ్యక్షులు రాయపాటి హరిబాబు,సొసైటీ ప్రెసిడెంట్ భాష్యం శ్రీధర్,కొండవీటి విజయ్‌రాజ్‌కుమార్,మక్కెన పాపారావు,గ్రామ వ్యవసాయ,పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.



# హిందూ శ్మశాన వాటికలను అభివృద్ధి చేయండి


## నగర కమిషనర్ కు విన్నవించిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు వెస్ట్, నవంబర్ 27,ప్రభాతవార్త:** హిందూ శ్మశాన వాటికల్లో అభివృద్ధి పనులు చేపట్టాలని నగర కమిషనర్ పులి శ్రీనివాసులును గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ కోరారు. గురువారం నగర కమిషనర్ ఛాంబర్లో ఆయనను కలిసిన ఎమ్మెల్యే గుంటూరు తూర్పు నియోజకవర్గంలో అభివృద్ధి పనులపై చర్చించారు. పాత గుంటూరు, డీసీ నగర్ ప్రాంతాల్లో హిందూ శ్మశాన వాటికల్లో సరైన సౌకర్యాలు లేక ప్రజలు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. శ్మశాన వాటికల అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించామని వెల్లడించారు. వీటికి వెంటనే అనుమతులిచ్చి అభివృద్ధి పనులు ప్రారంభించాలని కోరారు. దీంతోపాటు బస్టాండ్ సమీపంలోని ఎన్టీఆర్ ఐలాండ్ , నాజ్ సెంటర్, హిందూ కాలేజీ వద్ద ఐలాండ్ లను సుందరీకరించాలని కోరారు. వీటి అభివృద్ధికి స్పష్టమైన ప్రణాళిక రూపొందించాలన్నారు. గుంటూరు తూర్పు నియోజకవర్గంలో ఇప్పటికే ప్రారంభమైన అభివృద్ధి పనుల్లో కాంట్రాక్టర్ల నిరక్ష య్లం కనిపిస్తోందని కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. నిరక్ష య్లం వహించే కాంట్రాక్టర్లకు వెంటనే నోటీసులు జారీ చేయాలని, అవసరమైతే వారిని తొలగించి కొత్త వారికి అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి పనులు ప్రజలకు అందుబాటులోకి తెచ్చేందుకు శ్రీకారం చుట్టిందని, వీటిని అధికారులు సమన్వయంతో పూర్తి చేసేలా స్పష్టమైన ఆదేశాలు జారీ చేయాలని కోరారు.



# దేశం దశ దిశ మార్చ కలిగిన.. ..ఏకైక పార్టీ "ఆమ్.. ..ఆద్మీ పార్టీ"యే

**గుంటూరు వెస్ట్, నవంబర్ 27,ప్రభాతవార్త:** ప్రస్తుత రాజకీయ పరిస్థితుల దృష్ట్యా మన దేశం దశ దిశ మార్చగలిగిన ఏకైక పార్టీ ఆమ్ ఆద్మీ పార్టీయేనని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ టి.సేవ కుమార్ అన్నారు.నవంబర్ 26వ తేదీ ఆమ్ ఆద్మీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా 2/1 బ్రాడీపేటలోగల ఎస్ హెచ్ ఓ భవనంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సభలో డాక్టర్ టి .సేవ కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క దేశ పౌరుడు దేశంలోని పరిపాలన వ్యవస్థమంచి చెడులపై దృష్టి సారించాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. సువిశాల ప్రజాస్వామ్య దేశంగా చెప్పబడుతున్న మన దేశంలో ప్రజాస్వామ్య యుత పరిపాలన ఏమాత్రం జరుగుతుందో ఆలోచించాలన్నారు. దేశంలో అతి ధనవంతులు మరింత ధనవంతులుగా మారిపోతుంటే... మధ్యతరగతి ప్రజలు పేదలుగా మారిపోతున్నారని పేదలు, ధనికుల మధ్య ఎంతో ఆఘాతం ఏర్పడుతుందని, ఈ మార్పు రాబోయే రోజుల్లో ఎంతో ప్రమాదకరంగా మారుతుందన్నారు. ఆప్ సీనియర్ నాయకులు కందిమళ్ల శివప్రసాద్ మాట్లాడుతూ ఢిల్లీ, పంజాబ్ లలో పరిపాలన చూసిన ప్రజల ఆప్ ను ఆదరించాలన్నారు. ఆప్ తాడికొండ నియోజకవర్గ కన్వీనర్ ఆర్. నరసింహారావు మాట్లాడుతూ గుంటూరు జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలకు ఆప్ సిద్ధంగా ఉందన్నారు. సభలో ఉగ్గం సాంబశివరావు, రమణబాబు, శ్రీనివాసరెడ్డి, పి. నిర్మలరాణి, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు .



## టైఫాయిడ్ టీకా కార్యక్రమం

చిలకలూరిపేట, నవంబర్ 27, ప్రభాతవార్త: రోటరీ క్లబ్ ఆఫ్ పండరిపురం అధ్యక్షులు బోనం వెంకటేశ్వరరావు అధ్యక్షతన రోటరీ క్లబ్ పండరిపురం మరియు బయోమెడ్ ప్రైవేట్ లిమిటెడ్ సంయుక్తముగా టైఫాయిడ్ టీకా కార్యక్రమమును ప్రసన్న లక్ష్మి విద్యాలయం నందు ప్రారంభించి పట్టణంలోని మోడరన్ స్టెల్లార్ కృష్ణవేణి ఐఐటి తదితర పాఠశాల యందు విద్యార్థిని విద్యార్థులకు టైఫాయిడ్ టీకాలను వేయడం జరిగినది ఈ కార్యక్రమంలో డాక్టర్ సుష్మ లావు గారు మాట్లాడుతూ రెండు సంవత్సరముల నుండి 39 సంవత్సరాలు ప్రతి ఒక్కరూ టైఫాయిడ్ టీకాలను వేయించుకొని వారి వారి ఆరోగ్యాలను జాగ్రత్తగా ఉంచుకోవాలని కోరారు మరియు టీకా తీసుకున్న తరువాత తగు జాగ్రత్తలు తెలియజేశారు ఇంకా ఈ కార్యక్రమంలో లంక రఘురామిరెడ్డి, కొల్లా సింగారావు, మనోజ్, రాజు చెంచు పున్నయ్య, దాసు నాయన, ఆదిరెడ్డి, విన్సెంట్ పాల్,స్కూల్ హెచ్ఎం సుబ్బారావు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు



## రోటరీ ప్లాంట్‌కు శంకుస్థాపన

నాదెండ్ల, నవంబర్ 27, ప్రభాతవార్త: నాదెండ్ల జడ్పీహెచ్ఎస్ స్కూల్లో రోటరీ క్లబ్ ఆఫ్ చిలకలూరిపేట వారి ద్వారా వాటర్ ప్లాంట్ కి కొబ్బరికాయ కొట్టడం జరిగింది. ఈ ప్రోగ్రాంలో అధ్యక్షులు ప్రసాదు ఉప్పుటూరి క్లబ్ డిస్ట్రిక్ట్ డైరెక్టర్ చిలుకూరి శ్రీనివాసరావు గారు మరియు నాదెండ్ల గ్రామ పెద్దలు హరిబాబు గారు మరియు గ్రామ పెద్దలు పాల్గొనడం జరిగింది .మరియు స్కూల్ హెచ్ఎం గారు మరియు స్కూల్లో టీచర్లు పాల్గొనడం జరిగింది .1,60,000 విలువ గల వాటర్ ప్లాంట్ స్కూలు విద్యార్థుల కొరకు ఇస్తామని హామీ ఇవ్వడం జరిగింది .



## జనసేన నేత రామ్‌తో మండలనేని చరణ్‌తేజ్ భేటీ

చిలకలూరిపేట, నవంబర్ 27, ప్రభాతవార్త: జనసేన ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ తో యువ నాయకులు మండలనేని చరణ్ తేజ భేటీజనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం మంగళగిరిలో పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ ని చిలకలూరిపేట నియోజకవర్గ యువ నాయకులు మండలనేని చరణ్ తేజ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా, చిలకలూరిపేట నియోజకవర్గ పరిధిలో నెలకొన్న ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలు, మరియు యువతను పార్టీ కార్యక్రమాల్లో మరింత క్రియాశీలంగా భాగస్వామ్యం చేయడం వంటి అంశాలపై వారు ప్రధానంగా చర్చించారు. యువ నాయకులు చరణ్ తేజ నియోజకవర్గంలోని తాజా రాజకీయ పరిణామాలను, ప్రజల సమస్యలను తాళ్లూరి రామ్ దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. నియోజకవర్గంలో పార్టీ సంస్థాగత నిర్మాణం, భవిష్యత్తు కార్యాచరణపై కూడా వీరిద్దరూ చర్చించినట్లు తెలుస్తోంది. ఈ భేటీ చిలకలూరిపేట జనసేన పార్టీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపిందని, రానున్న రోజుల్లో నియోజకవర్గంలో పార్టీ మరింత వేగం పుంజుకునే అవకాశం ఉందని రాజకీయవిశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు



## అలసత్వం వహించే వారిపై చర్యలు తీసుకోండి : ఎంపీపీ

యడ్లపాడు, నవంబర్ 27, ప్రభాతవార్త : వృత్తిరీత్యా అలసత్వం వహించే అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు వ్యవహరించాలని, ప్రజల సమస్యలపై ఎప్పటికప్పుడు చర్చించుకోవాలని ఎంపీపీ పిడతల ఝాన్సీ సాగర్ పేర్కొన్నారు. మండల పరిషత్ సర్వ సభ్య సమావేశం గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అధ్యక్షతన జరిగిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా అధికారులు మండల అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా వ్యవసాయ శాఖ ఏవో హరిప్రసాద్ వివరిస్తూ ప్రస్తుతం రబి సాగు ప్రారంభమైందని, ఇందుకు కావల్సిన శనగ, మొక్కజొన్న విత్తనాలు సబ్సీడిపై అందజేయుటకు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఆదేవిధంగా బ్లాక్ బర్డ్ పొగాకు నిషేధించబడిందని తెలిపారు. ఈ సందర్భంగా సొసైటీ ఎంపీటీసీ మద్దూరి శ్రీనివాసరెడ్డి కలుగజేసుకొని రాష్ట్ర వ్యాప్తంగా మొంథా తుఫాన్ కారణంగా జిల్లాలో పంటనష్టం జరిగిందని, ఇందులో ఎక్కువ వర్షపాతం నమోదు అయిన యడ్లపాడు మండలంలో పంట దెబ్బతిన్నా అధికారులు మాత్రం నామమాత్రంగా నష్ట అంచనాలు వేశారని, ఆదేవిధంగా మండలంలోని దెంకెనపాలెం, కోట, కొండవీడు గ్రామాలలో పంట నష్టం జరిగినా ఒక్క ఎకరం నమోదు చేయలేదని, ఇది పూర్తిగా అధికారుల వైఫల్యమేనని ఆగ్రహించారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని ఏవో వివరణ ఇచ్చారు. దీనిపై ఎంపీపీ కూడా తీవ్రస్థాయిలో స్పందించారు. ఆదేవిధంగా ఉద్యాన వన శాఖ అధికారులు నష్టపరిహారం అంచనాలు వేయలేదని, ఈ ప్రాంతంలో అధిక ఉద్యాన పంటలు దెబ్బతిన్నా వారి కనీసం పట్టించుకోలేదని సభ్యులు ఆగ్రహం వ్యక్తపరిచారు. ఆదేవిధంగా ప్రభుత్వ పథకాలలో జరిగే అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన విషయంలో అధికారులు ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వటం లేదని, అంతేకాకుండా మండల పరిషత్ సర్వ సభ్య సమావేశానికి వచ్చినా అజెండా తెలపటం లేదని, నిధులకు సంబంధించిన వివరాలు తెలపటంలేదని సభ్యులు ప్రశ్నించారు. దీనికి ఎంపీడీవో హేమలతాదేవి స్పందిస్తూ రానున్న సర్వసభ్య సమావేశాలకు అందరికీ ఎజెండా కాపీలను, నిధుల వివరాలతో అందజేస్తామని తెలిపారు. అనంతరం వివిధ శాఖలకు సంబంధించిన అంశాలపై మండల స్థాయి అధికారులు వారి నివేదికలు వారు నిర్వహించుచున్న కార్యక్రమాలపై వివరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.



## విత్తన శుద్ది చేయటం ద్వారా పురుగులు, తెగుళ్లు నివారణ కొంత మేర చేయవచ్చు

యడ్లపాడు, నవంబర్ 27, ప్రభాతవార్త : విత్త శుద్ది చేయడం ద్వారా పురుగులు తెగుళ్లను దాదాపు 25నుండి30రోజుల వరకు పంటను కాపాడు కోవచ్చునని, మొక్కజొన్నలు కత్తెర పురుగు నివారణ ఎకరానికి నాలుగు లింగాకర్షణ బుట్టలు పెట్టడం వలన పురుగు ఉధృతిని గమనిస్తూ నివారణ చర్యలు చేపట్టవచ్చునని ఏరువాక శ్రీ అగ్రికల్చర్ డాక్టర్ ఎం నగేష్, ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ పివి సత్యగోపాల్ పేర్కొన్నారు. మండల పరిధిలోని జగ్గాపురం గ్రామంలో గ్రామీణ అవగాహన కృషి అనుభవ పథకంలో భాగంగా గ్రామంలో ఉన్న వ్యవసాయ కళాశాల బాపట్ల విద్యార్థినులు నిర్వహించిన రబీలో రైతులు వేస్తున్న శనగ మరియు మొక్క జొన్న పంటలపై రైతు శిక్షణ కార్యక్రమంలో వారు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భ వారు వివరిస్తూ శనగలో ముందు కార్బండిమ్ 2.5గ్రాములు ఒక కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ది చేసే అతర్వాత ట్రైక్ డెర్మా పోడి పది గ్రాములు ఒక కిలో విత్తనానికి కలిపి విత్తన శుద్ది చేసినట్లయితే ఎండు తెగులును సమర్థవంతంగా నివారించుకో వచ్చున్నారు. సకాలంలో కలుపు నివారించటం వల్ల దిగుబడి పెంచుకోవచ్చునని, పంటకు 30నుండి35 రోజులకు ఒకసారి ఆలాగే 60నుండి65 రోజులకు అప్పుడప్పుడు ఒకసారి నీటితడి ఇవ్వటం వలన 2లేదా3 క్వింటాల్లు దిగుబడులు పెరగవచ్చునన్నారు. పంటలో ఎకరానికి 18కిలోల యూరియా 25కిలోల సూపర్ ఫాస్పేట్ విరిదుక్కిలో వేసుకోవాలన్నారు. శనగపప్పు పురుగు నివారణలో భాగంగా లింగాకర్షణ బుట్టలు వాడుకున్నట్లయితే మంచి ఫలితం ఉంటుందన్నారు. ఆకుమాడు తెగులు తుప్పు తెగులు నివారణకు ప్రొపికొనజోల్ అనే మందును ఎకరానికి 200మిల్లీ లీటర్ల చొప్పున కలిపి పిచికారీ చేసుకోవాలన్నారు. విద్యార్థులు వారు తయారుచేసిన వివిధ పోస్టర్లను రైతులకు చూపించి వివరించారు. కార్యక్రమంలో విద్యార్థినులు కీర్తి శ్రీనిధి, జోషిత, శ్రేయ, అనగాని బేబి, విజయలక్ష్మీ, గాయత్రి, జోష్ణ, గ్రామ రైతులు తదితరులు పాల్గొన్నారు.



## మహిళాపై వేధింపుల కేసులో న్యాయస్థానం శిక్ష విధింపు

యడ్లపాడు, నవంబర్ 27, ప్రభాతవార్త : మండల పరిధిలోని వంకాయలపాడు గ్రామానికి చెందిన మహిళపై వేధింపులు, బెదిరింపులు మరియు అసభ్య ప్రవర్తన చేసిన సందర్భంగా నిందితుడికి న్యాయస్థానం శిక్ష విధించినట్లు ఎస్సై టి శివరామకృష్ణ తెలిపారు. ఈ సందర్భంగా అయన వివరిస్తూ వంకాయలపాడు గ్రామానికి చెందిన షేక్ కరిముల్లా అదే గ్రామానికి చెందిన మహిళపై వేధింపులకు సంబందించి 2020వ సంవత్సరంలో ఫిర్యాదు చేయటం జరిగిందని, అప్పుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టటం జరిగిందన్నారు. అయితే జిల్లా ఎస్పీ బి కృష్ణారావు అదేశాల మేరకు నిర్వహించిన ట్రైల్ మానిటరింగ్, ప్రస్తుత నరసరావుపేట డీఎస్పీ యం హనుమంతరావు పర్యవేక్షణలో రూరల్ సిఐ బి సుబ్బనాయుడు మరియు యడ్లపాడు ఎస్సై టి శివరామకృష్ణ పర్యవేక్షణలో పూర్తిస్థాయిలో విచారించి సాక్షులను ప్రవేశ పెట్టం జరిగిందన్నారు. ఇందులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ యన్ మహేంద్రనాధ్ కేసును ప్రతిష్టాత్మకంగా తీసుకొని న్యాయపరమైన వాదనలు వినిపించడం వల్ల చిలకలూరిపేట అదనపు జూనియర్ సివిల్ జడ్జి న్యాయస్థాన న్యాయమూర్తి కె నరేంద్ర రెడ్డి నిందితుడికి ఒక సంవత్సరం జైలు శిక్ష మరియు మూడు వేల జరిమానా విధించటం జరిగిందన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## లింగంగుంట్ల సొసైటీ కార్యాలయం ప్రారంభం

నరసరావుపేట, నవంబర్ 27 ప్రభాతవార్త :స్థానిక ప్రకాష్ నగర్ లో గురువారం మండలంలోని లింగంగుంట్ల సొసైటీకి సంబంధించిన నూతన కార్యాలయాన్ని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు ప్రారంభించారు. ఎమ్మెల్యే కార్యక్రమంలో మాట్లాడుతూ సొసైటీ సిబ్బంది రైతులకు నిరంతరంగా, త్వరితంగా సేవలు అందించాలని సూచించారు. రైతుల సమస్యలను త్వరగా పరిష్కరించేలా చూడాలని, సొసైటీ ద్వారా అందించే సేవలు సమర్థవంతంగా ఉండాలని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కన్యధార రాజు, సొసైటీ అధికారులు శ్రీనివాసరావు, రామాంజనేయులు, వైస్ చైర్మన్ షేక్. బాషా, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## సీఎం చంద్రబాబు విజన్‌తో ఉద్యోగాల వెల్లువ : టిడిపి

నకరికల్లు, నవంబర్ 27 ప్రభాతవార్త :: ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ తో రాష్ట్రంలో ఉద్యోగాల వెల్లువ వచ్చిందని టిడిపి రాష్ట్ర కార్యదర్శి నాగోతు సౌరయ్య అన్నారు. గురువారం తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వైజాగ్ లో నవంబర్ 14,15 తేదీలలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సు తో ప్రముఖమైన సంస్థలు రాష్ట్రంలో పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు రావడం జరిగిందన్నారు. దీంతోపాటు 400 ఎకరాలలో వైజాగ్ లో రిలయన్స్ డేటా సెంటర్ ఏర్పాటు కేవలం చంద్రబాబు కృషితో వచ్చిందన్నారు. రాష్ట్రంలో 6000 మెగావాట్ల డేటా సెంటర్లు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించుకుందన్నారు. గుజరాత్ రాష్ట్రంలోని 1000 మెగావాట్ల డేటా సెంటర్ కు అనుబంధంగా పనిచేసే డేటా సెంటర్ భవిష్యత్తులో మన రాష్ట్రానికి ఎంతో మేలు చేస్తుంది అన్నారు. వందలాది ఉద్యోగాలు మన యువతకు లభిస్తాయి అన్నారు. ఈ సంస్థ తో పాటు మరో మూడు ప్రముఖ అంతర్జాతీయ సంస్థలతో ప్రభుత్వం సంప్రదింపులు జరపటం శుభ సూచకమని తెలియజేశారు.



## వాలీబాల్ విజేత కృష్ణవేణి కళాశాల

నరసరావుపేట, నవంబర్ 27 ప్రభాతవార్త :స్థానిక కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో నిర్వహించిన అంతర్ కళాశాల వాలీబాల్ టోర్నమెంట్ లో కృష్ణవేణి డిగ్రీ కళాశాల జట్టు విజయం సాధించింది. కృష్ణవేణి డిగ్రీ కళాశాల, యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ టీముల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా సాగింది. కృష్ణవేణి కళాశాల ప్రథమ స్థానంలో నిలిచినది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ రెండవ స్థానం, బాపట్ల ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ మూడవ స్థానంలో నిలిచింది. అనంతరం పోటీలోలలో గెలుపు పొందిన విజేతలకు బహుమతుల ప్రధానోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో కృష్ణవేణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ నాతాని వెంకటేశ్వరావు, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ యోగా కోఆర్డినేటర్ ప్రొఫెసర్ బి. సూర్యనారాయణ రావు, డైరెక్టర్ నాసరయ్య, డాక్టర్ సిహెచ్. వెంకట్రావు, డాక్టర్ గౌరీ శంకర్,,సెక్రటరీ ఆదిబాబు, మహమ్మద్ కార్యక్రమంలో పాల్గొన్నారు.




## బాల్యవివాహాలు చట్టాలపై అవగాహన సభ, ర్యాలీ

నకరికల్లు, నవంబర్ 27 ప్రభాతవార్త : పట్టణంలోని ప్రకాష్ నగర్ షాదిఖానాలో గురువారం పల్నాడు జిల్లా బాలల పరిరక్షణ విభాగము ఆధ్వర్యములో బాల వివాహ్ ముక్త భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ సాధికారిత అధికారిణి ఉమాదేవి మాట్లాడుతూ బాల్య వివాహం వల్ల కలిగే దుష్పరిణామాలు తెలిపారు. ప్రోహిబిషన్ ఆఫ్ చైల్డ్ మ్యారేజ్ యాక్ట్ (పిసిఎంఎ) 2006 ఈ చట్ట ప్రకారం వివాహ వయసు అమ్మాయికి 18, అబ్బాయికి 21 ఏళ్ళుగా నిర్ణయించారని అన్నారు. బాల్య వివాహాలను ప్రోత్సహించినా, వివాహానికి హాజరైనా రెండేళ్ళు జైలు శిక్షతో పాటు జరిమానా విధించడం జరుగుతుందన్నారు. బాల్య వివాహము జరుగుతుంటే సమాచారము తెలిసిన వెంటనే గ్రామ స్థాయిలో గ్రామ కార్యదర్శి, గ్రామ రెవిన్యూ అధికారి మండల స్థాయిలో సి.డి.పి.ఓ, తహసీల్దారు, ఐ.సి.డి.ఎస్. సూపర్వైజర్ డివిజినల్ స్థాయిలో ఆర్.డి.ఓ. లేదా సబ్ కలెక్టర్ జిల్లా మొత్తానికి జిల్లా కలెక్టర్ కి సమాచారం అందించాలని సూచించారు. బాల్య వివాహాలను అరికట్టాలని చెప్పారు. పల్నాడు జిల్లాని బాల్య వివాహ రహిత జిల్లాగా చేయాలని ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం కొవ్వొత్తుల ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎడ్యుకేషన్ ఆఫీసర్, రొంపిచెర్ల యం.ఈ.వొ, యం.ఆర్.వో, యం.పి.డి.వొ, నరసరావుపేట మెడికల్ ఆఫీసర్, మిషన్ శక్తి కోఆర్డినేటర్, బాలల పరిరక్షణ విభాగము, వన్ స్టాప్ సెంటర్, ఐ.సి.డి.యస్ నరసరావుపేట సి.డి.పి.వొ. ఎ.సి.డి.పి.వొ, సూపర్వైజర్స్, నీడ్స్ యమ్.జి.వొ, అంగన్వాడి కార్యకర్తలు పాల్గొన్నారు.



## వైభవంగా సీతారామచంద్ర స్వామి శిఖర కలశ ప్రతిష్ఠ

నరసరావుపేట, నవంబర్ 27 ప్రభాతవార్త : మండలంలోని యక్కలవారిపాలెం గ్రామంలో గురువారం శ్రీ సీతా రామచంద్ర స్వామి ఆలయంలో శిఖర కలశ మరియు నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పాల్గొని, ప్రత్యేక పూజ కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమం గ్రామంలో కులమతాలకు అతీతంగా ఐక్యత మరియు భక్తి భావనలను మరింత పెంచి, సామాజిక రక్షణకు దోహదపడిందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్ బాబు అన్నారు. గ్రామస్తులకు శుభాకాంక్షలు ఎమ్మెల్యే తెలిపారు. తొలుత వారికి గ్రామ పార్టీ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలను అందజేశారు.ఆయన వెంట మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయ గుప్తా,ఆలయ కమిటీ సభ్యులు,గ్రామ పెద్దలు ఉన్నారు.ఉత్తమ ప్రతిభ పురస్కారం అందుకున్న కాత్యాయనికిఎమ్మెల్యే అభినందభారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా సచివాలయంలో ఏర్పాటు చేసిన పాఠశాల విద్యార్థుల శాసనసభ నమూనా సమావేశం ఘనంగా జరిగింది. మండలంలో ని కాకాని గ్రామానికి చెందిన జెడ్పీ హైస్కూల్ 10వ తరగతి విద్యార్థిని వక్కలగడ్డ కాత్యాయని మంచి ప్రతిభ చూపా రు.ఉత్తమ ప్రతిభ పురస్కారాన్ని స్వీకరించింది. ఈ నమూనా శాసనసభ సమావేశంలో కాత్యాయని హౌసింగ్ అండ్ ఇండస్ట్రీస్ పబ్లిక్ రిలేషన్స్ మంత్రిగా ఆమె చేసిన అసాధారణమైన ప్రదర్శనకు పురస్కారం లభించింది. ఈ సందర్భంగా గురువారం డాక్టర్ చదలవాడ అరవింద బాబు వక్కలగడ్డ కాత్యాయనిని అభినందించారు. ఈ నమూనా శాసనసభ సమావేశంలో ఆమె ప్రదర్శించిన నాయకత్వ లక్షణాలు,ఎమ్మెల్యే వాదనా సామర్థం దేశ రాజకీయాల్లో భవిష్యత్తులో మంచి నాయకురాలిగా ఎదగడానికి మార్గం సుగమం చేస్తాయని ఎమ్మెల్యే అన్నారు.



## భావన డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు వర్క్‌షాప్

రొంపిచర్ల,నవంబర్ 27 ప్రభాతవార్త : స్థానిక భావన డిగ్రీ కళాశాలలో గురువారం ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీ ఐబిఎం, మ్యాజిక్ బస్సు ఇండియా ఫౌండేషన్ విద్యార్థులకు వర్క్ షాప్ నిర్వహించారు. విద్యార్థులకు ఈ సందర్భంగా ఆ సంస్థ ప్రతినిధులు సైబర్ సెక్యూరిటీ,టూల్స్ గురించి వివరించారు. ఐబీఎం ప్రతినిధులు మాట్లాడుతూ ఏడు రోజులు పాటు శిక్షణ నిర్వహించి విద్యార్థులకు తమ సంస్థ తరఫున ఇంటర్న్ షిప్ సర్టిఫికెట్ సైతం ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణలో తెలుసుకున్న విషయాలు ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగ అవకాశాలు ఎంతో మెరుగుగా ఉంటాయని వివరించారు. విద్యార్థులను ఉద్దేశించి కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ వద్దుల సుబ్బారెడ్డి,డైరెక్టర్ మైనీడి శ్రీనివాసరావు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ఉపాధి కల్పనా అధికారి శివ గణేష్ అధ్యాపకులు,సిబ్బంది, ట్రైనర్ శివ పాల్గొన్నారు.

## రైతుల మేలు కోసం కొనుగోలు నిబంధనలు సరళీకృతం చేయాల్సిందే : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 27, ప్రభాతవార్త: రైతులకు మేలు చేకూర్చే అంశాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధానాల్లో తప్పక మార్పు రావాలని, సీసీఐ కొనుగోళ్లలో నిబంధనల సరళీకృతంపై ముఖ్యమంత్రి కార్యాలయంతో మాట్లాడానని, పత్తి రైతులకు న్యాయం జరిగేలా చూస్తామని మంత్రి అచ్చెన్నాయుడు కూడా భరోసా ఇచ్చినందున రైతులు అధైర్య పడాల్సిన పనిలేదని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు భరోసా ఇచ్చారు. బుధవారం మాజీమంత్రి ప్రత్తిపాటి, ఎంపీ లావు కావూరు, లింగంగుంట్ల, కోమటినేనివారిపాలెం గ్రామాల్లో నిర్వహించిన రైతన్నా... మీకోసం కార్యక్రమంలో పాల్గొని రైతులకు భూసార పరీక్షా కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లింగంగుంట్లలో నిర్వహించిన రైతుసభలో శాసన సభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు, ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడారు. రైతన్నా మీకోసం కార్యక్రమానంతరం కావూరులో రూ.7 లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్లు, డ్రైన్ల పనులకు, కోమటినేనివారిపాలెంలో రూ.32 లక్షలతో నిర్మించ తలపెట్టిన పంచాయతీ భవనం నిర్మాణానికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి శంకుస్థాపన చేశారు.నిబంధనల పేరిట రైతుల్ని ఇబ్బంది పెడితే, పాలకులు, ప్రభుత్వంపై అసంతృప్తి అధికమవుతుంది.. రైతుల ఉత్పత్తుల కొనుగోలులో సీసీఐ, మార్క్ ఫెడ్ అధికారులు ఉదారంగా వ్యవహరించాలని, నిబంధనల పేరిట రైతుల్ని ఇబ్బందిపెడితే వారిలో పాలకులు, ప్రభుత్వంపై అసంతృప్తి అధికమవుతుంద దన్నారు. ఎక్కడికక్కడ రైతుల ఇబ్బందులు, ప్రాంతాల్లోని పరిస్థితులకు అనుగుణంగా కొనుగోలు నిబందనలు మార్చినప్పుడే రైతులకు న్యాయం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలోని అన్ని లిఫ్టుల ఆధునికీకరణకు ప్రభుత్వం త్వరలోనే టెండర్లు పిలవనుందని, ఆ పనులు పూర్తై, వాగుల్లో పూడికతీత చేపడితే సాగు, తాగునీటికి ఇబ్బంది లేకుండా పోతుందని ప్రత్తిపాటి చెప్పారు. మన నాయకుడి ఆలోచనలు ఆచరిస్తేనే ఉత్తమ ఫలితాలు.. మన నాయకుడు చంద్రబాబు ఆలోచనలు గొప్పగా ఉంటాయని, అవి ఆచరణలో పెడితేనే ప్రజలకు ఉత్తమ ఫలితాలు కలుగుతాయని ప్రత్తిపాటి చెప్పారు. తక్కువ నీటితో ఎక్కువ పంటలు పండించాలన్న ప్రభుత్వ సూచనల్ని రైతులు ఆచరణలో పెట్టాలన్నారు. గతంలో చంద్రబాబు నాయకత్వంలో డ్రిప్, స్ప్రింక్లర్ విధానంతో రాయలసీమ రైతులు ఉత్తమ ఫలితాలు సాధించారని ప్రత్తిపాటి గుర్తుచేశారు. జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, సొసైటీ చైర్మన్ కోడె హనుమంతరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు గట్టినేని విజయ్ సాయి, కేతినేని సతీష్, తుబాటి కిషోర్, రెడ్డయ్య, బొప్పూడి చంద్రశేఖర్, వెంకట స్వామి, ప్రసాద్, మాలెంపాటి ఉమా, శివయ్య, రఘు, సాంబశివరావు, వెంకటేశ్వర్లు, అగ్రికల్చర్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## దుర్మార్గపు పాలనతో అసమర్థ రాజకీయ నాయకుడిగా పేరుపొందిన జగన్: ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 27, ప్రభాతవార్త: పేదలకు సహాయం చేయడం భగవంతుడు మనకు అందించిన సదవకాశంగా భావించాలని, మనకున్న దానిలో కొంతైనా నిరుపేదలు, నిరాశ్రయులకు అందిస్తే కలిగే అనుభూతి, మానసిక సంతృప్తి మాటల్లో వర్ణించలేమని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలుతో కలిసి ప్రత్తిపాటి ఆసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సహకారంతో 400 మంది పేదలకు బియ్యం, వంటనూనెలు, పప్పు దినుసులతో కూడిన నిత్యావసరాలు అందించారు. అంబేద్కర్ రాజ్యాంగానికి అతీతంగా దుర్మార్గపు పాలనతో అసమర్థ నాయకుడిగా జగన్ పేరు పొందారు ఈ సందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ దినోత్సవ వేళ పేదలకు సరుకుల వితరణ చేపట్టడం సంతోషించాల్సిన అంశమన్నారు. ఉన్నతమైన భారత రాజ్యాంగం ప్రపంచానికే ప్రామాణికంగా మారి, ఎన్నో దేశాల రాజ్యాంగ రచనలకు ప్రేరణగా నిలిచిందని ప్రత్తిపాటి తెలిపారు. కులమతాలు, వర్గవైషమ్యాలు లేకుండా దేశ ప్రజలు ఐకమత్యంతో జీవించేలా, ప్రజాస్వామ్య విలువలతో కూడిన రాజ్యాంగాన్ని రూపొందించిన అంబేద్కర్ మహనీయుడిని నిత్యం స్మరించుకోవాలన్నారు. పనిచేసే నాయకత్వాన్ని, ప్రభుత్వాలను ప్రజలు గుర్తించి ఆదరించినప్పుడే ప్రజాస్వామ్యం చిరకాలం మనుగడ సాగిస్తుందన్నారు. అంబేద్కర్ రాజ్యాంగానికి అతీతంగా దుర్మార్గపు పాలన సాగించిన నాయకుడిగా జగన్ నిలిచాడని, దుర్మార్గపు, విధ్వంస పాలనతో ప్రజలు ఎప్పటికీ మర్చిపోలేని అసమర్థ పాలకుడిగా పేరు పొందాడన్నారు. అరాచక పాలన ముగిసి, అభివృద్ధి, సంక్షేమంతో కూడిన పాలన అందిస్తున్న కూటమిప్రభుత్వ పనితీరుపై ప్రజలు సంతోషంగా ఉన్నారని ప్రత్తిపాటి చెప్పారు. ఆసిస్ట్ ప్రజోపయోగ కార్యక్రమాలకు నా సహాయసహకారాలుంటాయి.. పేదల్ని ఆదుకోవడం, వారి ఆర్థిక అభ్యున్నతికి సహాయపడటంలో ఆసిస్ట్ స్వచ్ఛందసంస్థ నిరంతరం పని చేస్తోందన్నారు. సీ.ఎస్.ఆర్ నిధుల సేకరణతో పాటు, విదేశీ నిధులు రాబడుతూ.. ఆసిస్ట్ సంస్థ పేదల జీవితాల్లో వెలుగులు నింపుతోందన్నారు. ఆసిస్ట్ నిర్వాహకులు రంగారావు, కిన్నుల సేవానిరతిని ప్రతి ఒక్కరూ అభినందించాలని, వారు చేపట్టే ప్రజోపయోగ కార్యక్రమాలకు తన సహాయసహకారాలు ఎప్పుడూ ఉంటాయని ప్రత్తిపాటి ఈ సందర్భంగా భరోసా ఇచ్చారు. పేద కుటుంబాలను ఆదుకోవాలన్న ఎమ్మెల్యే ప్రత్తిపాటి సూచన అభినందనీయం.. : ఎంపీ లావు సమాజంలో వెనుకబడిన వర్గాల్లోని పేదలకు సహాయ సహకారాలందిస్తున్న ఆసిస్ట్ స్వచ్ఛంద సంస్థ సేవలు పల్నాడు జిల్లాలో చిలకలూరిపేటలో తక్కువగా ఉన్నాయని, అందుకు కారణం ప్రజలకు అందుబాటులో ఉంటే ప్రత్తిపాటి నాయకత్వమేనని ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు తెలిపారు. మొంథా తుపాను బాధిత కుటుంబాలకు అండగా నిలవాలన్న ప్రత్తిపాటి సూచనను గౌరవిస్తూ, సరుకులు అందించడానికి ముందుకొచ్చిన ఆసిస్ట్ సంస్థకు, ఎమ్మెల్యేకు మనస్ఫూర్తిగా అభినందనలు తెలుపుతున్నట్టు ఎంపీ చెప్పారు.కార్యక్రమంలో అసిస్ట్ సేవ సంస్థ నిర్వాహకులు జాస్తి రంగారావు, జాస్తి కిన్ను, జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, గట్టినేని విజయ్ సాయి, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.




## అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ మాతృమూర్తికి ఘన నివాళులర్పించిన ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 27, ప్రభాతవార్త: అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ గారి మాతృమూర్తి చింతకుంట రత్నమ్మ గారు బుధవారం కడప జిల్లా పొద్దుటూరు పొట్లదుర్తి గ్రామంలో పరమపదించారు. మాజీమంత్రి , శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు గారి వారి స్వస్థలానికి వెళ్లి రత్నమ్మ గారి పార్థివదేహానికి ఘన నివాళ్లు అర్పించి ఎంపీ సీఎం రమేష్ గారికి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి లేని లోటు పూడ్చలేరని రత్నమ్మ గారి ఆత్మకు శాంతి చేకూరాలని ప్రత్తిపాటి తెలిపారు.



## అధికారం కోసం అడ్డగోలు హామీలిచ్చి...పదవి దక్కాక రైతుల్ని.. సాగును నిండా ముంచిన ఘనుడు జగన్ : ప్రత్తిపాటి

చిలకలూరిపేట, నవంబర్ 27, ప్రభాతవార్త: వ్యవసాయాధారిత దేశంలో ఏ రాజకీయ నాయకుడు చేయనంత అన్యాయం, ద్రోహం, మోసం జగన్ రాష్ట్ర రైతాంగానికి, వ్యవసాయానికి చేశాడని, 2019 ఎన్నికలకు ముందు అధికార కాంక్షతో అన్నదాతలకు అడ్డగోలుగా హామీలిచ్చి, ముఖ్యమంత్రి అయ్యాక వారిని నిండా ముంచిన రైతుద్రోహి జగన్ అని మాజీ మంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. బుధవారం రాత్రి నాదెండ్ల మండలం గణపవరంలో నిర్వహించిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. గ్రామలోని రైతుల ఇళ్లకు వెళ్లి మాట్లాడారు. ప్రభుత్వం ఆచరణలో పెట్టాలనుకుంటున్న పంచసూత్రాల ప్రాముఖ్యతను వివరించి, ఏం పంటలు వేశారు..ఎలా ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామంలోని జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రహరీ చుట్టూ రూ.10లక్షలతో నిర్మించే డ్రైనేజ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి, గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు. ధరల స్థిరీకరణ, విపత్తుల నిధితో రైతుల్ని ఆదుకుంటానన్న జగన్ .. చివరకు తన నిధిని మాత్రం బాగా పెంచుకున్నాడు. ఐదేళ్లపాటు రైతుల్ని, వ్యవసాయాన్ని పూర్తిగా విస్మరించి, న్యాయం చేయమని అడిగిన రైతుల్ని ఇష్టానుసారం దూషించి, కేసులు పెట్టించిన వైసీపీనేతలు.. జగన్, నేడు రైతులకు అన్యాయం జరుగుతుందని మొసలికన్నీరు కారుస్తున్నాడని ప్రత్తిపాటి ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారం కోసం రైతుల్ని పావులుగా వాడుకొని, చివరకు ముఖ్యమంత్రి అయ్యాక వారిని మోసగించిన ఏకైక నాయకుడిగా జగన్ చరిత్రలో నిలిచిపోతాడన్నారు. రైతుభరోసా కింద ఏటా ప్రతిరైతుకు రూ.13,500 ఆర్థిక సాయం అందిస్తానన్న జగన్ చివరకు అరకొరగా, కొందరు రైతులకే రూ.7,500లు ఇచ్చింది జగన్ కాదా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. చెప్పుకుంటూ పోతే.. జగన్ రైతులకు చేసిన మోసాల జాబితా కొండవీటి చాంతాడునే మించిపోతుందని ప్రత్తిపాటి తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, రాష్ట్ర డైరెక్టర్ కందుల రమణ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ గంగా శ్రీనివాసరావు, సొసైటీ చైర్మన్ పెంట్యాల శేషయ్య, టీడీపీ నాయకులు కెల్లంపల్లి ఆచయ్య, వలేటి హిమవంతరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# బాపట్ల జిల్లా వార్త



## ధాన్యం సేకరణ ప్రక్రియ వేగంగా చేపట్టాలి

బాపట్ల,నవంబర్27,ప్రభాతవార్త: ధాన్యం సేకరణ ప్రక్రియ వేగంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ తెలిపారు. ధాన్యం సేకరణపై సంబంధిత శాఖల అధికారులతో గురువారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో ధాన్యం సేకరణ ప్రక్రియను అధికారులు మరింత వేగం పెంచాలని ఆదేశించారు. నియమించిన నియోజకవర్గ ప్రత్యేక అధికారులు, మండల ప్రత్యేక అధికారులు ఆయా మండలాలకు వెళ్లి అక్కడే ఉండాలన్నారు. ధాన్యం సేకరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలన చేయాలని, క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలను గుర్తించి తక్షణమే కలెక్టరేట్ కు సమాచారం పంపాలన్నారు. అధికారులకు కేటాయించిన ఆయా ప్రాంతాలలో విస్తృతంగా పర్యటించాలన్నారు. ఈనెల 30వ తేది, డిసెంబర్ ఒకటో తేదీన బాపట్ల జిల్లాలో వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిందన్నారు. వాతావరణ శాఖ హెచ్చరికలను దృష్టిలో ఉంచుకుని రైతులకు అవసరమైనన్ని టార్పాలిన్ పట్టలు కొనుగోలు చేశామన్నారు. వర్షం రాకముందే ధాన్యం ఆరబెట్టుకునేలా అవగాహన కల్పించాలన్నారు. తేమ 17 శాతానికి రాగానే ఆర్ఎస్ కె లలో ధాన్యాన్ని అమ్ముకోవాలన్నారు. రైతు సేవా కేంద్రాలకు గోనె సంచులు సమృద్ధిగా కేటాయించామన్నారు. రైతులు ఎవరు కాల్ చేసినా అధికారులు తక్షణమే స్పందించాలని ఆదేశించారు. జిపిఎస్ నమోదు చేసుకున్న వాహనాలను మాత్రమే అందుబాటులో ఉంచాలన్నారు. ఇప్పటివరకు జిల్లాలో 505 వాహనాలను ఆర్ ఎస్ కె ల అనుసంధానించామన్నారు. అధికారులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి జమీర్ బాషా, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శ్రీలక్ష్మి, ఆర్డీవోలు, తదితరులు పాల్గొన్నారు.




## విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలి

కర్లపాలెం, నవంబర్27, ప్రభాతవార్త: దాతలు ప్రభుత్వ పాఠశాలకు సహకరించటం ఎంతో సంతోషదాయకమని పెద్ద గొల్ల పాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుభాషిణి తెలిపారు. మండల పరిదిలోని పెద్ద గొల్ల పాలెం జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో గురువారం ఏపిఎస్ఆర్టిసీ విశ్రాంత ఉద్యోగులు విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లు,మధ్యాహ్నభోజనానికి అవసరమైన ప్లేట్లును గురువారం పంపిణీ చేసారు ఈ సందర్భంగా పాఠశాల పాఠశాల ప్రధానోపాధ్యాయుని సుభాషిని గారు మాట్లాడుతూ . విద్యార్థులు ఇలాంటి కార్యక్రమాలను స్ఫూర్తిగా తీసుకొని భవిష్యత్తులో మంచి పౌరులుగా ఎదగాలని సూచించారు. బాపట్ల ఆర్టిసి విశ్రాంత ఉద్యోగులు పాఠశాలలోని విద్యార్థులకు ఎస్ఎస్సి పరీక్షలు వ్రాయుటకు అవసరమైన పరీక్ష ప్యాడ్ లు పెన్నులను పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజన కొరకు ప్లేట్లను ప్రధానోపాధ్యాయురాలికి అందించారు. ఈ కార్యక్రమంలో సభ్యులు పులిగడ్డ రామారావు గారు వెంకటేశ్వరరావు,వైఎస్ రావు, అసోసియేషన్ సభ్యులు పాల్గొని విద్యార్థులతో మాట్లాడారు.చక్కగా చదివి ప్రభుత్వ పాఠశాలలకు మంచిపేరు తేవాలని, మంచి పౌరులు గా ఉన్నతంగా ఎదగాలని సూ సూచించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు మల్లికార్జున్ రెడ్డి ఆదంబి బాపూజీ రెడ్డి, హేమలత ,నాగరాజు ,విద్యార్థినీ విద్యార్థులు,తదితరులు పాల్గొన్నారు.



## సినీ పరిశ్రమ లోకి అడుగుపెట్టిన పెద గొల్లపాలెం సర్పంచ్ నాని



కర్లపాలెం,నవంబర్27,ప్రభాతవార్త: కర్లపాలెం మండలం పెద గొల్లపాలెం సర్పంచ్ యల్లావుల నాని అలియాస్ సురేష్ రాధవ్ సినీ పరిశ్రమలోకి అడుగుపెట్టారు. పెద్దరికం సినిమా ద్వారా ఆయన సహ నిర్మాతగా మారి ఆ సినిమాకు నటుడు జయభారత్ రెడ్డి నిర్మాతగా, నాని సహ నిర్మాతగా మారారు. ఈ సందర్భంగా పలువురు నానికి శుభాకాంక్షలు తెలిపారు.

## నడింపల్లి లో సీసీ రోడ్డు నిర్మాణాలకు శంకుస్థాపన

చెరుకుపల్లి, నవంబర్ 27 (ప్రభాతవార్త) :గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం దృఢ సంకల్పంతో పనిచేస్తుందని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్య ప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన చెరుకుపల్లి , మండలంలోని నడింపల్లి గ్రామాల్లో నిర్వహించిన రోడ్డు నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయా కార్యక్రమాలకు పంచాయతీ కార్యదర్శులు మల్లికార్జునరావు, నాగమల్లేశ్వరి అధ్యక్షత వహించారు. ముందుగా చెరుకుపల్లి గ్రామంలోని నేషనల్ హైవే వద్ద నుండి శివాలయం వరకు దీలీనీ నిధులు ద్వారా కోటి రూపాయల వ్యయంతో నిర్మించనున్న సిసి రోడ్డు మరియు మురుగు కాలువల నిర్మాణం కు ఆయన శంకుస్థాపన చేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో చెత్తను తరలించే రిక్షాలు సైకిళ్ల ను ఆయన జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నడింపల్లి గ్రామంలో గ్రామం నుండి గోవాడ గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ కోటి 80 లక్షల రూపాయల నిధులతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో చిత్తశుద్ధితో పనిచేస్తున్నామని, ప్రతి గ్రామంలో పూర్తిస్థాయిలో రోడ్డు నిర్మాణాలను చేపట్టి త్వరితగతిన సదుపాయాలను అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఎన్నో ప్రజా సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టి ప్రజలకు త్వరితగతిన ఫలాలను అందిస్తుందని ప్రజలందరూ కూడా కూటమి ప్రభుత్వానికి అండగా నిలబడాలని ఆయన కోరారు. సూపర్ సిక్స్ హామీలే కాకుండా మరిన్ని పథకాలను ప్రవేశపెట్టిన ఘనత కూటమి ప్రభుత్వానికి చెల్లిందన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు తాత ఏడుకొండలు, నియోజకవర్గం ఎం. భాస్కరరావు, డీసీ చైర్మన్ ఎం ఆర్ కె మూర్తి, జడ్పిటిసి మర్రివాడ పావని, తాసిల్దార్ సిహెచ్ పద్మావతి, ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, పి ఆర్ ఏ ఈ నాయక్ , మల్లాది రామకృష్ణ, దివి రాంబాబు, పూషదువు కుమారస్వామి, గోగినేని వసుధ, కావూరి శీను, కందుల వెంకటేశ్వరరావు, దివి శ్రీను, సొంటి సుబ్బయ్య, అధికారులు, ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.



## జడ్.పి.హెచ్.ఎస్ లో ఆర్వో వాటర్ ప్లాంట్

చెరుకుపల్లి, నవంబర్ 27 (ప్రభాతవార్త) : పాఠశాలలోని విద్యార్థినీ ,విద్యార్థులు ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలు, అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని చదువులో రాణించి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ అన్నారు. గురువారం మండల కేంద్రమైన చెరుకుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కార్యక్ర మానికి పాఠశాల హెచ్ఎం కాటూరి లక్ష్మీ నా రాయణ అధ్యక్షత వహించగా జడ్పిటిసి మర్రివాడ పావని ప్రసాద్ సహకారంతో నిర్మించిన ఆర్ వో వాటర్ ప్లాంట్ ను అనగాని శివప్రసాద్ ప్రారంభించారు. కార్యక్రమంలో పాఠశాల పూర్వ ప్రధానోపాధ్యాయులు ,డిసి చైర్మన్ ఎం ఆర్ కె మూర్తి మాట్లాడుతూ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులకు శుద్ధమైనటువంటి త్రాగునీటిని అందించాలనే లక్ష్యంతో మంత్రివర్యులు అనగాని సత్యప్రసాద్ ఆదేశాలతో జడ్పిటిసి సహాయ సహకారాలతో పాఠశాలలు వాటర్ ప్లాంట్ ను ఏర్పాటు చేయడం జరిగిందని విద్యార్థిని, విద్యార్థులు అధ్యాపక సిబ్బందిని వాటర్ ప్లాంట్ మన్నికగా సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తాసిల్దార్ సిహెచ్ పద్మావతి ,ఎంపీడీవో షేక్ మహబూబ్ సుభాని, ఎంఈఓ నవీన్ కుమార్, జనసేన కన్వీనర్ ఎం భాస్కరరావు, మండల పార్టీ అధ్యక్షుడు తాత ఏడుకొండలు, మల్లాది రామకృష్ణ, దివి రాంబాబు, సొంటి సుబ్బయ్య, కందుల వెంకటేశ్వరరావు, విద్యార్థినీ విద్యార్థులు, అధ్యాపక సిబ్బంది పలువురు పాల్గొన్నారు.



## వరుసగా ద్విచక్ర వాహనాల దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

బాపట్ల,నవంబర్27,ప్రభాతవార్త: బాపట్ల జిల్లాలో వరుసగా చోటుచేసుకున్న ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను బాపట్ల జిల్లా సిసిఎస్ పోలీసులు, అమృతలూరు పోలీసులు సంయుక్తంగా చేదించి దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర దొంగల ముఠాను చకచక్యంగా అరెస్ట్ చేశారని జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ బాపట్ల జిల్లాలో వరుసగా చోటు చేసుకుంటున్న ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను సవాలుగా తీసుకొని బాపట్ల సిసిఎస్ డిఎస్పి పి.జగదీష్ నాయక్ ఆధ్వర్యంలో సిసిఎస్ సిఐ ప్రేమయ్య, అమృతలూరు ఎస్పై రవితేజ లు వారి సిబ్బందితో రెండు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని, సీసీ కెమెరాల సమాచారం ఆధారంగా వరుసగా జరుగుతున్న బైక్ దొంగతనం కేసులను చాకచక్యంగా చేదించి దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహనాల దొంగల ముఠాను అరెస్టు చేసి వారి నుండి దొంగిలించబడిన 16.5 లక్షల విలువ గల 22 ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని వాటిని సీజ్ చెయ్యడం జరిగిందన్నారు. కేసులు సంబంధించిన వివరాలను వివరించారు. యద్దనపూడి మండలం, చిమట వారి పాలెం గ్రామంకు చెందిన థంకసాల సుబ్బారావు తన ఎపి 27 బివై9047 గల హీచ్ గలడీలక్స్ బైక్‌ను అమర్తలూరు మండలం ఇంటూరు గ్రామంలో జూన్ 27తేది రాత్రి 20.00 గంటల సమయంలో పార్క్ చెయ్యగా గుర్తు తెలియని వ్యక్తులు దానిని దొంగిలించారని ఇచ్చిన రిపోర్ట్ మేరకు అమర్తలూరు పోలీస్ స్టేషన్ లో ఇచ్చినఫిర్యాదు మేరకు కేసునమోదు చేయడం జరిగిందన్నారు. ముద్దాయిలు సుమారు రెండు సంవత్సరాల నుండి చెడు వ్యసనాలకు అలవాటు పడి వారి విలాసాలకు డబ్బుల కోసం బైకులు దొంగతనం చేస్తున్నారన్నారు. ఇంటి ముందర పార్కింగ్ చేసి ఉన్న బైక్ లను, రైతులు పొలం పనులులకు వెళ్తూ పొలం గట్లు మీద పెట్టిన బైక్ లను దొంగ తాళాలతో లాక్ ఓపెన్ చేసి దొంగతనం చేస్తూ ఉంటారు. దొంగతనం చేసిన బైక్ లను వేరే జిల్లాలకు, తీసుకువెళ్లి అక్కడ బైక్ మెకానిక్ షాపులలో అమ్ముతూ ఉంటారు. ముద్దాయిల మీద అంతకుముందు అనేక జిల్లాలలో కూడా కేసులు ఉన్నాయన్నారు. ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులను సమర్థవంతంగా చేదించి 6 గురు ముద్దాయిలను అరెస్ట్ చేసి 23 ద్విచక్ర వాహనాలను సీజ్ చెయ్యడంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిసిఎస్ డిఎస్పి పి జగదీష్ నాయక్ . సిసిఎస్ ఇన్స్పెక్టర్ ప్రేమయ్య .సిసిఎస్ ఎస్ఐ రవి ప్రకాష్ , సిసిఎస్ ఎస్ఐ రాంబాబు.సిసిఎస్ కానిస్టేబుల్ కోటేశ్వర రెడ్డి,సిసిఎస్ కానిస్టేబుల్ క్రిష్ణ .సిసిఎస్ కానిస్టేబుల్ సురేష్ .సిసిఎస్ కానిస్టేబుల్ దాసు ,సిసిఎస్ కానిస్టేబుల్ చిరంజీవి . సిసిఎస్ హోంగార్డ్ రవూఫ్,అమర్తలూరు ఎస్పై కె రవితేజ ,అమర్తలూరు ఏఎస్ఐ పి సత్యనారాయణమూర్తి, అమర్తలూరు కానిస్టేబుల్ పి అనిల్ కుమార్. ,అమర్తలూరు హోంగార్డు టి.రాజేష్‌లను జిల్లా ఎస్పీ బి. ఉమా మహేశ్వర్ ప్రత్యేకంగా అభినందించి కాష్ రివార్డులను అందజేశారు. సిసిఎస్ డిఎస్పి జగదీష్ నాయక్, రేపల్లె డి.ఎస్.పి శ్రీనివాసరావు, సిసిఎస్ సిఐ ప్రేమయ్య, చుండూరు సిఐ మరియు సిబ్బంది పాల్గొన్నారు.






## యువత డ్రగ్స్,మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలి

పిట్టలవానిపాలెం,నవంబర్27,ప్రభాతవార్త: మండలం అల్లూరు గ్రామంలో సైబర్ నేరాలపై గ్రామస్థులకు చందోలు ఎస్ఐ మర్రి వెంకట శివకుమార్ అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శివకుమార్ మాట్లాడుతూ యువత డ్రగ్స్, మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు.వాటివలన శారీరక మానసిక ఆరోగ్యంలో తీవ్ర నష్టం కలుగుతుందని ఆయన హెచ్చరించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న దృష్ట్యా ప్రతి ఒక్కరు ఇంటర్నెట్ వినియోగంలో జాగ్రత్తగా ఉండి, అనుమానాస్పద లింకులు క్లిక్ చేయకూడదన్నారు.దొంగతనాలు, చోరీలు జరగకుండా ప్రతి ఇంటి ముందు, వ్యాపార కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలన్నారు.. చిన్నపిల్లల చేత వాహనాలు నడపనివ్వకూడదని స్పష్టం చేశారు. వాహనాన్ని నడిపే ప్రతి వ్యక్తి డ్రైవింగ్ లైసెన్స్, వాహన పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలన్నారు.రెండు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, తమ భద్రతను నిర్లక్ష్యం చేయకూడదన్నారు. ప్రజలు చట్టాలను పాటించి, సమాజ అభివృద్ధికి భాగస్వాములు కావాలని ఆయన కోరారు.


## పిట్టలవాని పాలెం డిప్యూటీ ఎంపీడీవో గా బండ్లమూడి సుజాత



పిట్టలవానిపాలెం,నవంబర్27,ప్రభాతవార్త: పిట్టలవాని పాలెం మండలం చందోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న బండ్ల మూడి సుజాత డిప్యూటీ ఎంపీడీవో గా పదోన్నతి పొంది పిట్టలవాని పాలెం మండల పరిషత్ కార్యాలయంలో గురువారం బాధ్యతలు చేపట్టారు.మండలపరిధిలోని సమస్యలను గుర్తించి వాటిని త్వరిత గతిన పరిష్కరించడానికి కృషి చేస్తానని ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

## రైతులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు

బాపట్ల,నవంబర్27,ప్రభాతవార్త: రైతులకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు ప్రణాళికతో అన్ని చర్యలు తీసుకున్నామని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్, ఏపీ చీఫ్ సెక్రటరీ విజయానంద్ దృష్టికి తీసుకువెళ్లారు. వివిధ అంశాలపై రాష్ట్ర రాజధాని అమరావతి నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లతో చీఫ్ సెక్రటరీ గురువారం వీక్షణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం తడవకుండా టార్పాలిన్ పట్టలు విరివిగా కొనుగోలు చేసి, రైతులకు అందుబాటులో ఉంచామన్నారు. 3.15 లక్షల గోనె సంచులు ఆర్ఎస్ కె లలో సిద్ధంగా ఉంచడం జరిగిందన్నారు.మిల్లర్ల వద్ద లక్షల కొద్ది పట్టలు ఉన్నాయని సి ఎస్ కు చెప్పారు. ధాన్యం సేకరణలో పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నామన్నారు. తుపాను హెచ్చరిక నేపథ్యంలో వర్షానికి ధాన్యం తడవకముందే రైతుల నుంచి సేకరించాలని సిఎస్ సూచించారు. అధికారులంతా ప్రణాళికతో ముందుకు వెళ్లాలన్నారు. అన్నా క్యాంటీన్లు సమర్థంగా నడపాలని,పారిశుద్ధ్య కార్యక్రమాలు విరివిగా చేపట్టాలన్నారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాలలో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యతనివ్వాలని సూచించారు.. చలికాలంలో ప్రభుత్వ సంక్షేమ వసతి గృహాలలో విద్యార్థులు ఇబ్బందులు పడకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వంటగది, భోజనం తయారీ పరిశుభ్రంగా ఉండాలన్నారు. తాగునీరు పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, లేకుంటే ఆర్ ఓ ప్లాంట్లు ఏర్పాటు చేయాలన్నారు. మరుగుదొడ్లు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ప్రభుత్వ వసతి గ్రహాలను అధికారులు తరచుగా తనిఖీలు చేయాలని , వసతి గ్రహాలలో వంట గదులు, మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అధికారుకులకు కలెక్టర్ సూచించారు. విద్యార్థులకు తయారుచేసే భోజనం నాణ్యతతో ఆరోగ్యంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వసతి గృహాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత నాలుగో తరగతి ఉద్యోగులపై ఉందన్నారు. వంటశాలలో వస్తువులు, పరికరాలు అన్ని ఉన్నాయా, లేదా పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. ముఖ్యంగా వసతి గృహాలలో తాగునీరు పరీక్షలు చేయాలని, శుద్ధ జలం మాత్రమే విద్యార్థులకు అందించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన విశిష్ట, డి ఆర్ ఓ జి.గంగాధర్ గౌడ్, జిల్లా ఎస్సీ సాధికారత అధికారిని రాజదిబోరా, బీసీ సంక్షేమ శాఖ అధికారినీ శివలీల, మున్సిపల్ కమిషనర్ రఘునాథ్ రెడ్డి, అనుబంధ శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి --సబ్ కలెక్టర్ సంజనసింహ

కొల్లిపర,నవంబరు 27 ప్రభాతవార్త: ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగించుకోవాలని సబ్‌కలెక్టర్ సంజనసింహ అన్నారు.గురువారం మండల పరిధిలోని దావులూరు,చివలూరు గ్రామాల్లో రైతన్న సేవలో మన మంచి ప్రభుత్వం అనే కార్యక్రమాన్ని నిర్వహించారు.వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు సబ్‌కలెక్టర్ సంజనసింహ, తహశీల్దార్ గుమ్మడి సిద్దార్ధ,మండల వ్యవసాయాధికారి శ్రీనివాసరెడ్డి రైతులకు పంచసూత్రాలను తెలియజేసి కరపత్రాలను పంపిణీ చేసారు.అనంతరం సబ్‌కలెక్టర్ సంజనసింహ అధికారులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాలను తనిఖీ నిర్వహించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు,ఈ సందర్భంగా సబ్‌కలెక్టర్ సంజనసింహ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు గోతాలు అందుబాటులో ఉంచామన్నారు.ధాన్యం రవాణా చేసేందుకు లారీలను కూడా సిద్దంగా ఉంచామన్నారు.రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు దళారులకు అమ్ముకోవద్దన్నారు.ధాన్యానికి గిట్టుబాటు ధర కల్పించేందుకే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయటం జరిగిందన్నారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణాధికారులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

కొల్లిపర,నవంబరు 27 ప్రభాతవార్త: గ్రామీణ ప్రజలు మెడికల్ క్యాంపును సద్వినియోగించుకోవాలని మండల వైద్యాధికారి నేహ అన్నారు.మండల కేంద్రం కొల్లిపరలో వైద్యాధికారులు ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా నేహ మాట్లాడుతూ దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులు ప్రతి నెల తప్పనిసరిగా వైద్య పరీక్షలు చేయించుకోవాలన్నారు.బీపీ,షుగర్ వ్యాధిగ్రస్తులు వైద్యుల సలహాల మేరకు మందులు వాడుకోవాలన్నారు.వాతావరణంలో వస్తున్న మార్పుల వలన అంటువ్యాధులు వచ్చే అవకాశం ఉందని తగిన జాగ్రతలు పాటించాలన్నారు.కార్యక్రమంలో ఎఎన్ఎం లక్ష్మీ,డీఈవో బొమ్ము కోటిరెడ్డి,ఆషా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## రబీపంటల సాగుపై అవగాహన

తెనాలి టౌన్, నవంబర్27(ప్రభాతవార్త): రబీపంటల సాగు నిర్వహణపై వ్యవసాయశాఖ అధికారులు రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గురువారం రూరల్ గ్రామమైన కొలకలూరు లో నిర్వహించిన సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు మాట్లాడుతూ,రబీలో సాగు చేసే జొన్న మొక్కజొన్న మినుము పెసర వంటి పంటలకు సంబంధించి విత్తనాల కొనుగోళ్లలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి గుంటూరు లాం ఫామ్ శాస్త్రవేత్త రత్నం వివరించారు. ఈ సందర్భంగా తెగుళ్ల నివారణ చర్యలను రైతులకు తెలియజేసి, వ్యవసాయ శాఖ వారు సిఫారసు చేసిన మేరకే ఎరువుల వాడకం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఏ విజయబాబు,మండల వ్యవసాయ అధికారి సుధీర్ బాబు పలువురు రైతులు పాల్గొన్నారు.



## రౌడీషీటర్లను ఇంటికివెళ్లి హెచ్చరించిన సిఐ సాంబశివరావు

తెనాలి మున్సిపాలిటీ నవంబర్27(ప్రభాతవార్త): రౌడీ షీటర్లు తమ పద్ధతి మార్చుకొని అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని త్రి టౌన్ సీఐ ఎస్ సాంబశివరావు హెచ్చరించారు. గురువారం త్రీటౌన్ పరిధిలోని పలువురు రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి వారిని ఇకనుంచి సత్ప్రవర్తనతో నెలగాలని ఎటువంటి నేరాలకు పాల్పడకుండా అసాంఘిక కార్యక్రమాలకు దూరంగా ఉండాలని వారి ఇళ్లకు వెళ్లి హెచ్చరించిన త్రీటౌన్ సీఐ సాంబశివరావు. ఈ సందర్భంగా రౌడీషీటర్ల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులు కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి యొక్క రోజువారి కార్యకలాపాల గురించి ఆరా తీశారు ఇకనుంచి ఎటువంటి నేరాలకు పాల్పడిన ఉపేక్షి ంచేది లేదని హెచ్చరికలు చేశారు ఏ మాత్రం అనుమానం వచ్చినా అకస్మాత్తుగా ఇళ్లకు వస్తామని జాగ్రత్తగా మసులుకోవాలని హెచ్చరించారు.



## అన్నదాతా సుఖీభవ కార్యక్రమం నిర్వహణ: హాజరైన ఎమ్మెల్సీ ఆలపాటి

తెనాలి టౌన్, నవంబర్27(ప్రభాతవార్త): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతాంగానికి అండగా ఉంటూ వారికి భరోసా కల్పిస్తుందని శాసనమండలి సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని గుడివాడ కొలకలూరు గ్రామాల్లో ఆయన పర్యటించారు ఈ సందర్భంగా రైతుల ఇళ్లకు వెళ్లి రైతన్న నీకోసం కార్యక్రమం పై వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆలపాటి రైతులతో మాట్లాడుతూ వ్యవసాయంలో ఆధునిక టెక్నాలజీని ఉపయోగించుకొని సత్ఫలితాలు పొందాలని ఆయన సూచించారు. ప్రభుత్వ సబ్సిడీ పథకాలను రైతులు ఉపయోగించుకోవాలన్నారు. కూటమి ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని అన్నదాత సుఖీభవ పథకం ద్వారా రైతులకు పంట పెట్టుబడి సాయం అందించిందని రాష్ట్రంలో ప్రతి రైతు కళ్ళల్లో ఆనందం చూడటమే కూటమి ప్రభుత్వ దేయమని ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ పేర్కొన్నారు. అనంతరం రైతుల నుండి పంటల గిట్టుబాటు ధరలు గురించి తెలుసుకున్నారు. ఈ పలువురు ప్రభుత్వ అధికారులు,కూటమి నాయకులు పెద్ద ఎత్తున రైతులు పాల్గొన్నారు.



## ఆధారాలు లేకుండా సస్పెన్షన్ తగదు: సచివాలయ ఉద్యోగుల సంఘం



తెనాలి టౌన్, నవంబర్27(ప్రభాతవార్త): ఆధారాలు లేకుండా సచివాలయ ఉద్యోగి డైమండ్ బాబును సస్పెన్షన్ చేయడం ఎంతవరకు సమంజసమని ఆంధ్రప్రదేశ్ గ్రామ వార్డు సచివాలయ ఉద్యోగుల వెల్ఫేర్ సొసైటీ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.విల్సన్ పేర్కొన్నారు.ఈ మేరకు ఆయన గురువారం పత్రిక ప్రకటన విడుదల చేశారు.బిఎల్ఓ జాబితా కొరకు రాత్రి 10 గంటలకు సచివాలయానికి వెళ్లిన ఆయనపై అసాంఘిక కార్యాకలాపాల నెపంతో ఎటువంటి ఆధారాలు లేకుండా,కనీసం నోటీస్ ఇవ్వకుండా సస్పెన్షన్ విధించడం కరెక్ట్ కాదని తెలిపారు.ఆయన ఒక అసోసియేషన్ నడుపుతున్నారని,ఉద్యోగుల సమస్యల విషయాలలో అధికారులను ప్రశ్నించేవారని అది విమడలేని అధికారులు కక్ష పెట్టుకుని ఆధారాలు లేకుండా సస్పెన్షన్ చేశారని అన్నారు.ఈ సమస్యను పరిష్కరించకపోతే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలిపారు.

## రహదారిపైన ఆక్రమణలను తొలగిస్తాం: త్రీటౌన్ సిఐ




తెనాలి మున్సిపాలిటీ నవంబర్27 (ప్రభాతవార్త): ।వఐపట్టణంలో త్రీటౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఆక్రమణలను శుక్రవారం నుండి తొలగిస్తామని సిఐ సాంబశివరావు తెలిపారు. ఇప్పటికే చెంచుపేట ప్రాంతంలోని రహదారి మీద ఉన్న ఆక్రమణలను గుర్తించి వ్యాపారులకు సూచనలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. గురువారం మారీసు పేట ప్రాంతంలో పర్యటించిన ఆయన రోడ్డు ప్రక్కన ఉన్న షాపులను గుర్తించి వాటిని తొలగించాలని వ్యాపారస్తులకు తెలిపారు. ప్రమాదాలకు కారణమవుతున్న రహదారి ఆక్రమణలను తొలగించుటకు వ్యాపారులు సహకరించాలని ఈ సందర్భంగా సిఐ సాంబశివరావు సూచించారు.

## ఏపీ ఎన్జీఓ తెనాలి యూనిట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి:

తెనాలి మున్సిపాలిటీ, నవంబర్27(ప్రభాతవార్త): ఆంధ్రప్రదేశ్ నాన్ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ తెనాలి తాలూకా యూనిట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసోసియేషన్ ప్రతినిధులు తెలిపారు. నవంబర్ 29వ తేదీన జరగనున్న ఎన్నికలు పట్టణంలోని కొత్తపేటలో ఉన్న ఎన్జీవో హోం లో సాయంత్రం మూడు గంటల నుండి నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఓటింగ్ ప్రక్రియ శాంతియుతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు,అన్ని ఏర్పాట్లు చేసినట్లు ఎన్నికల అధికారి కె ఎన్.సుకుమార్ తెలిపారు. ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రతి ఉద్యోగి తమ ఉద్యోగ గుర్తింపు కార్డుతో రావాలని ప్రశాంత ఎన్నికలకు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. సంబంధిత శాఖ ద్వారా గుర్తింపు కలిగిన ఉద్యోగి యొక్క ఐడి కార్డు, డ్రైవింగ్ లైసెన్స్ పాన్ కార్డు సంబంధిత డిపార్ట్మెంట్ డిడిఓ సంతకం కలిగిన మరియు రౌండ్ సీల్ వేసిన ఐడి కార్డ్ లలో ఏదో ఒకటి తీసుకొని రావాలని ఆయన కోరారు. గుర్తింపు కార్డు తీసుకొని రానివారు ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవకాశం లేదన్నారు. ఎన్నికల నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించి ఎన్నికల కేంద్రానికి సమయానికి హాజరై క్రమశిక్షణతో ఓటు వేసి ఎన్నికల ప్రక్రియను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## విద్యార్థులకు క్రీడా పోటీలు

రేపల్లె, నవంబరు 27,ప్రభాతవార్త:ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్షా జిల్లా కో ఆర్డినేటర్ ఆదేశాల మేరకు మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం భట్టిప్రోలులోని చిన్నారుల శిక్షణా కేంద్రంలో ఆటల పోటీలు నిర్వహించారు. జూనియర్,సీనియర్ విభాగాలుగా ఏర్పాటు చేసి డ్రాయింగ్,రన్నింగ్,మ్యూజికల్ ఛైర్ పోటీలు నిర్వహించారు.విజేతలకు ప్రథమ,ద్వితీయ,తృతీయ బహుమతులను అందజేశారు.ఈ కార్యక్రమంలో ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.రంగయ్య,ఎస్కె వలీ,కె.రత్నాకర్,డి.మేరీ ఇవాంజలియన్,సిబ్బంది,ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారులు పాల్గొన్నారు.



## సత్తెనపల్లి ఆర్డీవోకు సమస్యలు వివరించిన రైతుసంఘం నాయకులు

అచ్చంపేట, నవంబర్ 27 (ప్రభాత వార్త):అచ్చంపేట మండలం చెరుకుంపాలెం గ్రామం తాళ్ళచెరువు రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను సత్తనపల్లి ఆర్డీవో రమాకాంత్ గురువారం రెవెన్యూ, అటవీ శాఖ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా బాధిత రైతుల తరఫున రైతు సంఘం నాయకులు ఆర్డీవోతో సమావేశమై తమ సమస్యలను వివరించారు. రైతు సంఘం నాయకులు మాట్లాడుతూ చెరుకుంపాలెం గ్రామం తాళ్ళచెరువు రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 321లో ఉన్న భూములకు సంబంధించిన వివాదం గత రెండు సంవత్సరాలుగా పరిష్కారం కాకపోవడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరిగి ఇబ్బందులు పడుతున్నారని, అన్ని ఆధారాలు చూపించినా ఫారెస్ట్



అధికారులు సమస్యను లాగుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.సమస్య త్వరగా పరిష్కరించకపోతే న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్తామని రైతు సంఘం నాయకులు ఆర్డీవోకు తెలిపారు.ఈ నేపథ్యంలో ఆర్డీవో రమాకాంత్, డిఆర్ఓ కుసుమకుమారి, అటవీ మరియు రెవెన్యూ శాఖ రికార్డులన్నింటినీ పరిశీలించాలని సూచించారు. అలాగే మంగళగిరి నుండి ఫీల్డ్ మ్యాప్ రికార్డు తీసుకురావాలని సర్వేయర్‌కు ఆదేశాలు జారీ చేశారు.కార్యక్రమంలో పాల్గొన్న వారురైతు సంఘం నాయకులు ఆర్. వెంకటేశ్వర్‌రావువ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి కేకే రెడ్డిరైతులు సుంకర భానురావు, కొంపెర్ల స్వామి, కత్తులు నాగరాజు, కొంపెర్ల స్వామి రెవెన్యూ, అటవీ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయునికి మంత్రి లోకేష్ అభినందన

రేపల్లె, నవంబరు 27,ప్రభాతవార్త:భట్టి ప్రోలు మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గుర్రం మురళీ మోహన్ ప్రతిభకు మెచ్చిన రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అభినందించారు.రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా అమరావతిలో మాక్ అసెంబ్లీ నిర్వహణకు సంబంధించి వివిధ నియోజకవర్గాల నుంచి ఎంపిక చేసిన 175 మంది విద్యార్థులకు మురళీ మోహన్ ఉత్తమ శిక్షణనిచ్చారు. మాక్ అసెంబ్లీ నిర్వహణకు సంబంధించి ఎస్‌సిఇఆర్‌టి ప్రకారం క్వశ్చన్ అవర్,స్క్రిప్ట్ రైటింగ్,శాసనసభ బిల్లు తయారీలో ఉపాధ్యాయుడు మురళీ మోహన్ ప్రతిభ చూపించారు.మాక్ అసెంబ్లీలో ప్రొటెం స్పీకర్,స్పీకర్,మంత్రి మండలి,ప్రతిపక్షం,మార ్షల్స్,శాసనసభా కార్యక్రమాల నిర్వహణ,బిల్లులు ప్రవేశపెట్టడం,చర్చ,ఆమోదం తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణనిచ్చారు.మంత్రి లోకేష్ అభినందనలతో పాటు వెల్లటూరు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి,ఉపాధ్యాయులు కుటుంబరావు,శ్రీనివాసరావు, శైలజ,ఆశాలత,విజయలక్ష్మి,కిషోర్,బేబీ తదితరులు మురళీ మోహన్‌ను గురువారం అభినందించారు.



## 80 క్వింటాళ్ల ధాన్యం విక్రయం

రేపల్లె, నవంబరు 27, ప్రభాతవార్త:మండలంలోని పేటేరులో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురువారం మండల వ్యవసాయ శాఖ అధికారి మహేష్ తనిఖీ చేశారు.రైతుల ధాన్యం కొనుగోలు కోసం మండలంలో 8 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు.తేమ 17 శాతం ఉంటే గ్రేడ్ ఎ ధాన్యానికి రూ.2389,ఫైన్ క్వాలిటీ ధాన్యానికి రూ.2369 మద్దతు ధరగా ప్రభుత్వం నిర్ణయించిందని ఆయన తెలిపారు.వ్యవసాయ శాఖ ద్వారా ధాన్యం విక్రయించుకుంటే లాభం ఉంటుందన్నారు.ఒక రైతుకు చెందిన 80 క్వింటాళ్ళ ధాన్యాన్ని రైసు మిల్లుకు తరలించామని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకుడు రాయల్‌బాబు,టిఎ,డిఇఒలు పాల్గొన్నారు.



## టైపు పరీక్షల్లో మార్పు



రేపల్లె, నవంబరు 27,ప్రభాతవార్త:రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ మండలి నిర్వహించనున్న టైపు పరీక్షలలో మార్పులు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయని ఆంధ్రప్రదేశ్ టైపు రైటింగ్ షార్ట్ హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు చావలి విజయ మోహనరావు గురువారం తెలిపారు.ఒక రోజు మాత్రమే టైపు పరీక్షలు నిర్వహిస్తే ఏర్పడే ఇబ్బందులను బోర్డు అధికారుల వద్ద రాష్ట్ర టైపు రైటింగ్,షార్ట్ హ్యాండ్ ఇన్‌స్టిట్యూట్స్ అసోసియేషన్ ప్రతినిధులు ప్రస్తావించగా స్పందించి రెండు రోజుల పాటు పరీక్షల నిర్వహణకు అంగీకరించారని ఆయన చెప్పారు. విద్యార్థుల హాజరు,బ్యాచ్ నుంచి బ్యాచ్‌కు టైప్ మిషన్స్ మార్చుకో ఉండటం ప్రిన్సిపాల్స్ కష్టతరంగా ఉంటుందని ప్రస్తావించగా బోర్డు అధికారుల దృష్టికి తీసుకువెళ్ళగా అధికారులు సానుకూల చర్యలు తీసుకోవటం అభినందనీయమన్నారు.బోర్డు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నట్లు చావలి విజయ మోహనరావు తెలిపారు.

## కాంగ్రెస్ పతనానికి కారణమైన కిరణ్‌కుమార్ రెడ్డి

రేపల్లె,నవంబరు 27,ప్రభాతవార్త:రాష్ట్ర ముఖ్యమంత్రిగా పనిచేసిన కిరణ్‌కుమార్ రెడ్డి అధికారాన్ని వినియోగించుకుని కాంగ్రెస్ పార్టీలో వచ్చిన డబ్బుతోనే కాంగ్రెస్ పార్టీ పతనం కోసం ఉద్యమాలు చేయించిన ఘనతను చాటుకుని భారతీయ జనతాపార్టీలో కొనసాగు తున్న ఘనుడని రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి,ప్రముఖ వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు విమర్శించారు.గురువారం జరిగిన రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి తుదిశ్వాస విడిచే వరకు కాంగ్రెస్ పార్టీలోనే ఉంటూ రాహుల్‌గాంధీని భారతదేశ ప్రధానమంత్రిగా చేయాలని భావించారని తెలిపారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబం మాత్రం కాంగ్రెస్ పార్టీకి దూరం కావటం విచారకరమన్నారు.కొందరు విలువలను విస్మరించి కాంగ్రెస్ పార్టీ నుంచి వైసీపీ,టిడిపి పార్టీలలోకి వెళ్ళి వేల కోట్లాది రూపాయలు సంపాదించుకుని కాంగ్రెస్ పార్టీపై నిందలు మోపటం బాధాకరమన్నారు.ఇటువంటి విధానం సరికాదన్నారు.అధికారంలోకి వచ్చి ఏ విధంగా సంపాదించుకోవాలనే తాపత్రయం గౌరవనీయం కాదన్నారు.ఇటువంటి వారిని విమర్శిస్తే కేసులు బనాయించటం, వేధింపు చర్యలకు పాల్పడటం వంటి సంఘటనలు కొనసాగుతుండడంపట్ల కరమని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు.తాను కాంగ్రెస్ పార్టీలో కొనసాగుతూ గర్వంగా భావిస్తున్నట్లు ఆయన చెప్పారు.కాంగ్రెస్ పార్టీలో తన స్థాయి పెరిగిందని రేపల్లె నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీకి విలువలున్నాయని శ్రీనివాసరావు వెల్లడించారు.ఇటువంటి కాంగ్రెస్ పార్టీకి న్యాయం చేయటంలేదని భావిస్తున్న తరుణంలో షర్మిలా రెడ్డి,జె.డి.శీలం ప్రోద్బలంతోనే రేపల్లె నియోజకవర్గం ఇన్‌ఛార్జిగా పోటీ చేయటం జరిగిందన్నారు.వ్యాపారాల రీత్యా తాను అందుబాటులోలేని పరిస్థితి ఏర్పడినందున రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పదవి నుంచి తప్పుకుంటున్నానని మోపిదేవి చెప్పారు. 2024 ఎన్నికల్లో రేపల్లె నియోజకవర్గం నుంచి కేసన రామకోటేశ్వరరావు పోటీ చేయాలని భావించినప్పటికీ కుదరలేదన్నారు. అనాడు పిసిసి అధ్యక్షురాలు షర్మిల రెడ్డి తనను ప్రోత్సహించినందున అది సాధ్యపడలేదన్నారు.ప్రస్తుత పరిస్థితులలో కేసన రామకోటేశ్వరరావు రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి పదవిని కేటాయిస్తే బావుంటుందని శ్రీనివాసరావు సూచించారు.ఎలాగూ కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగబాబు,నారాయణ,వాసు తదితరులు రామకోటేశ్వరరావుకు అందుబాటులో ఉంటున్నందున పార్టీ అధిష్టానం దృష్టి కేంద్రీకరించాలని ఆయన కోరారు.ఇన్‌ఛార్జి నియామకం జరగకపోతే ఎవరికి వారు ఇన్‌ఛార్జిగా చెప్పుకునే పరిస్థితి కాంగ్రెస్ పార్టీలోకి రానీయరాదని ఆయన సూచించారు.రేపల్లె నియోజకవర్గ ఇన్‌ఛార్జి నియమిస్తే వారికి తాను సహకరిస్తానని శ్రీనివాసరావు స్పష్టం చేశారు.మోపిదేవి శ్రీనివాసరావు సలహాలు, సూచనలను కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పరిశీలకుడు శరత్ అహేర్,రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి.అంజిబాబులు ఆసక్తిగా గమనించారు.



## రైతులను మోసం చేస్తే చర్యలు

రేపల్లె, నవంబరు 27,ప్రభాతవార్త:ధాన్యం కొనుగోళ్లలో మోసాలు చేస్తే ఉపేక్షించేది లేదని మండల రెవెన్యూ అధికారి ఎం.శ్రీనివాసరావు చెప్పారు.గురువారం భట్టి ప్రోలు మండలంలోని పల్లెకోన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు గిట్టుబాటు ధరకే ధాన్యాన్ని విక్రయించుకోవాలన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రంలోని మాయిశ్చర్ మీటరు పనితీరును గమనించారు.ఈ కార్యక్రమంలో సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.లక్ష్మి,భట్టి ప్రోలు మండల వ్యవసాయ శాఖ అధికారి బి.బ్రహ్మారెడ్డి,డిప్యూటీ తహశీల్దార్ శాంతలక్ష్మి,వ్యవసాయ,ధాన్యం కొనుగోలు కేంద్రం సిబ్బంది,మాజీ సర్పంచ్‌లు మండవ రామకోటేశ్వరరావు,రాయన ప్రసాదరావు,ఎంపిటిసి డి.తిరుపతిబాబు,టిడిపి నాయకులు,రైతులు పాల్గొన్నారు.



**సమన్వయంతో వ్యవహరించాలి..** ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతుల పట్ల సిబ్బంది సమన్వయంతో వ్యవహరించాలని బాపట్ల జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి,భట్టి ప్రోలు మండల ప్రత్యేక అధికారి డాక్టర్ వేణుగోపాల్ అన్నారు.గురువారం భట్టి ప్రోలు,పలవరంలలోని ధాన్యం కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఎమ్మార్వో మేకా శ్రీనివాసరావు,డిప్యూటీ తహశీల్దార్ శాంతలక్ష్మి,మండల వ్యవసాయ శాఖ అధికారి బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ఆశ్రమానికి బీరువా వితరణ

వినుకొండ,నవంబర్27,ప్రభాతవార్త: స్థానిక కొండమెట్ల వద్ద గల అతి పురాతనమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి విశ్వమాత గోసంరక్షణ ఆశ్రమ స్వామివారి కైంకర్యాల నిమిత్తం రూ.20వేలు విలువ చేసే బీరువాను విశ్రాంత ఉపాధ్యాయులు గాండ్ల నాగేం ద్రుడు సామ్రాజ్యం దంపతులు అలాగే దొడ్డ ప్రతాపరెడ్డి శివలీల,ఏటుకూరి కృష్ణవేణి,సాయిపవన్ కళ్యాణ్ రూ.20వేలు విలువ చేసే



బీరువాను ఆలయ ప్రధాన సేవకులు మాల్యాద్రికి అందజేశారు. కార్యక్రమంలో ఆలయ సేవకులు హనుమంత సూరి,కాకుమాను రామారావు,బద్దిక నరసింహారావు,పిచ్చయ్య ,రమ,సుజాత, సరోజనమ్మ,నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## ఏపీ విద్యాశాఖ ఆధ్వర్యంలో స్కూల్ టీచర్స్ గేమ్స్

నూజెండ్ల,నవంబర్27,ప్రభాతవార్త: ఏపీ విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 29వ తేది నుంచి జనవరి 4వ తేది వరకు స్కూల్ టీచర్స్ గేమ్స్ ఏర్పాటు చేయడం జరిగిందని మండల విద్యాశాఖాధికారులు నలబోలు రవిచంద్ర,కాకర్ల సత్యనారాయణలు తెలిపారు. అందులో భాగంగా 29న మండలకేం ద్రమైన నూజెండ్ల జెడ్పి స్కూల్ నందు పురుష ఉపాధ్యాయులకు క్రికెట్,మహిళా ఉపాధ్యాయులకు త్రోబాల్ నిర్వహించి మండలస్థాయి టీమ్స్‌ను ఎంపిక చేయడం జరుగుతుందని పేర్కొన్నారు.

## దేశాభివృద్ధి,ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యం....ఏఐసిసి అబ్జర్వర్,రాజస్థాన్ ఎమ్మెల్యే షిఖామీల్‌బలాల





వినుకొండ,నవంబర్27,ప్రభాతవార్త: దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని ఏఐసిసి అబ్జర్వర్,రాజస్థాన్ ఎమ్మెల్యే షిఖామీల్‌బలాల అన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వినుకొండలో ప్రత్యేక సమావేశం గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏఐసిసి అబ్జర్వర్,రాజస్థాన్ ఎమ్మెల్యే షిఖామీల్‌బలాల పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ దేశ అభివృద్ధి,ప్రజాస్వామ్య పరిరక్షణ కాంగ్రెస్ ద్వారానే సాధ్యపడుతుందని చెప్పారు. అనంతరం జిల్లా అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్,వినుకొండ నియోజకవర్గ ఇంచార్జి బోయపాటి రామాంజనేయులు ప్రసంగించారు. 2029 సార్వత్రిక ఎన్నికల్లో వినుకొండలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించేలా పార్టీ బలోపేతానికి అన్ని విధాలుగా కృషి చేస్తున్నామని పేర్కొన్నారు.

## విద్యార్థినులకు కోలాటం కాస్మోటిక్స్ అందజేత





ఈపూరు,నవంబర్27,ప్రభాతవార్త: ఈ నెల 29,30 తేదిల్లో జిల్లాస్థాయిలో నిర్వహించనున్న పల్నాడు బాలోత్సవంలో కోలాటంలో పాల్గొంటున్న 20 మంది విద్యార్థినులకు 15వేల రూపాయలతో కోలాటానికి సంబంధించిన చీరలు,గజ్జెలు,కర్రలు,కాస్మోటిక్ స్‌ను ఈపూరు ఏపి మోడల్ స్కూల్ నందు పీజిటి ఇంగ్లీష్ ఉపాధ్యాయులు వల్లెపు శ్రీను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఈపూరు ఎంఈవో 2 ఏ. రామతులసి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతోపాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొని రాణించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ పుల్లా పద్మజ,ఉపాధ్యాయుని,ఉపాధ్యాయులు పాల్గొని శ్రీను మాస్టారును అభినందించారు.

## చాట్రగడ్డపాడులో రైతన్నా మీ కోసం...

వినుకొండ,నవంబర్27,ప్రభాతవార్త: మండలంలోని చాట్రగడ్డపాడు గ్రామంలో రైతన్నా మీ కోసం కార్యక్రమం గురువారం జరిగింది. కార్యక్రమంలో మండల వ్యవసా యాధికారి జి.వరలక్ష్మి పాల్గొని వ్యవసాయ అనుబంధ రంగాల అభివృద్ధికి,రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలను రైతులకు వివరించారు. ప్రభుత్వ అందిస్తున్న పథకాలు,సబ్సిడీలను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సర్వే కార్యక్రమంలో ప్రతి రైతు పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో నంబూరి కృష్ణారెడ్డి,రైతులు,వీఏఏ మౌనిక,ఏఈవో ఆరిఫ్ తదితరులు పాల్గొన్నారు.



## అభివృద్ధి సాధిస్తున్న అంగన్‌వాడీ వ్యవస్థ

రేపల్లె, నవంబరు 27,ప్రభాతవార్త:గ్రామీణ స్థాయి పిల్లలకు మెరుగైన పోషణ,ఉచిత విద్య,గర్భిణీ,బాలింత తల్లులకు ఉత్తమ సేవలు అందించటంలో అంగన్‌వాడీ వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తున్నదని రేపల్లె నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకుడు అనగాని శివప్రసాద్ అన్నారు.గురువారం రేపల్లె ప్రాజెక్టులో 7 మినీ అంగన్‌వాడీలు,పల్లపట్ల ప్రాజెక్టులో 2 మినీ కేంద్రాలను మెయిన్ అంగన్‌వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేసిన సందర్భంగా అంగన్ వాడీ కార్యకర్తలకు పోస్టింగ్ ఆర్డర్లను శివప్రసాద్ అందజేశారు.ఇరువు అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రీస్కూల్ కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం,అభివృద్ధికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల ప్రగతి అభినందనీయమని శివప్రసాద్ కొనియాడారు.ప్రీస్కూల్ కిట్స్ ద్వారా పాఠశాల సామగ్రి,లెర్నింగ్ కార్నర్స్ మెరుగుపడటంతో పాటు విద్యార్థుల అభ్యాసం ఆకర్షణీయంగా మారుతుందని ఆయన చెప్పారు.ఈ కార్యక్రమంలో అంగన్ వాడీ ఉద్యోగులు పాల్గొన్నారు.



## వ్యసనాల జోలికి పోవద్దు

రేపల్లె,నవంబరు 27,ప్రభాతవార్త:ప్రజలు వ్యసనాల దుష్ప్రభావాన్ని గమనించి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయం ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ డాక్టర్ దివ్య తేజోమూర్తి అన్నారు.గురువారం మండలంలోని బేతపూడిలో రేపల్లె ఎబిఆర్ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ నిర్వహిస్తున్న ప్రత్యేక శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వలన జరిగే నష్టాన్ని ప్రజలు గమనించాలన్నారు. ప్రజలకు అవగాహన కల్పించి వ్యసనాలకు దూరమయ్యేలా వాలంటీర్లు సూచనలిచ్చారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ ఎం.దాసు తదితరులు పాల్గొన్నారు.౭౭

## 29న భట్టిప్రోలు టిడిపి సమావేశం



రేపల్లె, నవంబరు 27, ప్రభాతవార్త:భట్టి ప్రోలులోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలో శనివారం సాయంత్రం 6 గంటలకు భట్టి ప్రోలు తెలుగుదేశం పార్టీ కార్యకర్తల సమావేశం జరుగుతుందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తూనుగుంట్ల సాయిబాబా తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ భట్టి ప్రోలు తెలుగుదేశం పార్టీ,కూటమి నాయకులు,కార్యకర్తలు,అభిమానులు విధిగా సమావేశంలో పాల్గొనాలని కోరారు.ఇప్పటివరకు ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి,సంక్షేమ కార్యక్రమాలపై సమీక్షిస్తామని ఆయన చెప్పారు.కార్యకర్తల సమస్యలు తెలుసుకుంటామని పరిష్కరించేందుకు శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు సాయిబాబా పేర్కొన్నారు.భవిష్యత్ కార్యక్రమాలపై చర్చిస్తామన్నారు. కార్యకర్తలు,నాయకుల సూచనలు,సలహాలను పరిగణలోకి తీసుకుని తెలుగుదేశం పార్టీ అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తామని ఆయన స్పష్టం చేశారు.

## ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వం:మధ్యప్రదేశ్ పిసిసి అధ్యక్షుడు శరత్ అహేర్

రేపల్లె, నవంబరు 27,ప్రభాతవార్త:కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంభిస్తున్నదని ఎఐసిసి పరిశీలకుడు, మధ్యప్రదేశ్ పిసిసి అధ్యక్షుడు,బాపట్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ పరిశీలకుడు శరత్ అహేర్ విమర్శించారు.గురువారం రేపల్లెలో జరిగిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయాల్సిన బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. రేపల్లె నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి మోపిదేవి శ్రీనివాసరావు,రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి.అంజిబాబు,కె.నాగబాబు,పార్టీ కార్యకర్తలు,నాయకులు పాల్గొన్నారు.



## రైతును రాజుని చేసేందుకే చంద్రబాబు పంచసూత్రాలు ప్రవేశపెట్టారు : ప్రత్తిపాటి

యడ్లపాడు, నవంబర్ 27, ప్రభాతవార్త : రైతును రాజుగా మార్చాలన్న సత్సంకల్పంతోనే ముఖ్యమంత్రి చంద్రబాబు వ్యవసాయరంగంలో నూతన విధానాల అమలు చేసేలా రైతుల్ని ప్రోత్సహిస్తున్నారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మండల పరిధిలోని దింతెనపాడు గ్రామంలో జరిగిన రైతన్నా మీకోసం కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి వ్యవసాయాధికారులు, సిబ్బందితో కలిసి రైతుల ఇళ్లకు వెళ్లి వారితో మాట్లాడారు. ప్రభుత్వం కొత్తగా ప్రకటించిన పంచసూత్రాలపై రైతులకు అవగాహన కల్పించిన అనంతరం గ్రామంలో 32లక్షలతో నిర్మిస్తున్న పంచాయితీ భవనం పనులకు శంకుస్థాపన గావించి అనంతరం సమావేశంలో



ప్రసంగించారు. తిమ్మాపురం గ్రామానికి నాలుగు లిఫ్టులు ఉన్నాయని, దింతెనపాడు లిఫ్టులకు సంబంధించిన మోటార్లు మార్చాల్సి ఉందని రైతులు నూతన సాగువిధానాలతో లాభాలు పొందాలన్న సదుద్ధేశంతోనే చంద్రబాబు పంచసూత్రాలను ప్రవేశపెట్టారని ప్రత్తిపాటి చెప్పారు. తెలిసి..తెలిసీ నష్టం వచ్చే పంటలనే సాగుచేయడం రైతులు మానుకోవాలని, ఎప్పుడో ఒక ఏడాది వచ్చే లాభాలను దృష్టిలో పెట్టుకోవడం మంచి విధానం కాదన్నారు. ఏ పంటలు పండిస్తే రైతులకు మంచి ధర లభిస్తుందో అలాంటి వాటి సాగుపై రైతుల్ని మళ్లించాలన్నదే ముఖ్యమంత్రి ఆలోచనని ప్రత్తిపాటి చెప్పారు. తక్కువ నీటితో ఎక్కువ దిగుబడి, పండించిన ఉత్పత్తుల్ని మార్కెట్ చేసుకోవడానికి వీలైన ఫుడ్ ప్రాసెసింగ్ వంటి సరికొత్త విధానాలపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. కూరగాయలు పండించి మనకు అందుబాటులో ఉండే కళాశాలలు, ఇతర సంస్థలకు సరఫరా చేయడంపై రైతులు ఆలోచన చేయాలని ప్రత్తిపాటి సూచించారు.



**శాశ్వత అధికారంతోనే అందరికీ న్యాయం :** ప్రజలకు మేలుచేసే రాజకీయాలు చేసినప్పుడే సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉంటామనే వాస్తవాన్ని కూటమి శ్రేణులు గ్రహించాలని ప్రత్తిపాటి సూచించారు. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌ల కష్టాన్ని గమనించి గ్రామస్థాయిలో పార్టీ శ్రేణులు ఐకమత్యంతో అభివృద్ధి, సంక్షేమంపై దృష్టిపెట్టాలన్నారు. ఐదేళ్లు ఎన్నో ఇబ్బందులు పడ్డాక దక్కిన అధికారంతో అందరికీ ఒకేసారిమేలు జరగాలంటే సాధ్యం కాదనే వాస్తవాన్ని గ్రహించాలన్నారు. శాశ్వత అధికారంతోనే అట్టడుగు వారికి కూడా న్యాయం జరుగుతుందన్నారు. ఏడాదిన్నరలో నాయకుల మధ్య అభిప్రాయబేధాలు రావడం సరైన పద్ధతి కాదన్న ప్రత్తిపాటి..ప్రతి ఒక్కరూ సానుకూల వైఖరితో ఉండాలని, తమకు పనులు అవడం లేదన్న వ్యక్తుల అసంతృప్తి వ్యవస్థలకు నష్టం చేకూర్చేలా ఉండకూడదని సూచించారు. దింతెనపాడు, తిమ్మాపురం గ్రామాలకు చెందిన ఎంతోమంది చంద్రబాబు, లోకేశ్, బాలకృష్ణల వద్ద పనిచేస్తున్నారని, వారందరి సహకారంతో ఇంకా ఉన్నతస్థానాల్లో ఉన్న పంచాయితీరాజ్ కమిషనర్ కృష్ణ తేజ వంటి వారి చేయూతతో గ్రామాల్ని బాగా అభివృద్ధి చేసుకుంటున్నామన్నారు. తెలుగు దేశానికి మెజారిటీ వచ్చే గ్రామం.. తన సొంత గ్రామమైన దింతెనపాడు అభివృద్ధికి కుప్పం మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న శ్రీనివాసరావు చొరవచూపాలని, ముఖ్యమంత్రితో మాట్లాడి గ్రామపురోగతికి మరింత సహకారం అందించాలని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, జిల్లా రైతు అధ్యక్షులు మద్దూరి వీరారెడ్డి, నాయకులు ముద్దన నాగేశ్వరరావు, మద్దూరి శ్రీనివాసరెడ్డి, పోపూరి వెంకయ్య, మాణిక్యారావు, అత్తోట శ్రీను చౌదరి, చంద్రకళ, పంచాయితీ రాజ్ డిఒ బాలకుమార్, ఎంపీడీవో హేమలత, ఏవో హరిప్రసాద్, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## 57వ వసంతంలోకి ఏరిస్ అగ్రిలిమిటెడ్

మేడికొండూరు, నవంబర్ 27 , ప్రభాతవార్త: రైతు సేవలో 57 సంవత్సరాలు పూర్తి చేసుకుని 57వ వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా ఏరిస్ అగ్రిలిమిటెడ్, ముంబాయి సంస్థ గుంటూరు జిల్లా, తాడికొండ మండలం, బండారుపల్లి గ్రామంలో రైతు సదస్సును ఘనంగా నిర్వహించింది.



**రైతు సంక్షేమానికి ఏరిస్ కృషి:** ఏరిస్ అగ్రిలిమిటెడ్ ముంబాయి, అమెరికాలోని ఫ్లోరిడా యూనివర్సిటీ సహకారంతో పాటు వీర్లైడ్ టెక్నాలజీతో భారతదేశంలో ఏరియన్ చిలపమిని వంటి పేటెంట్ సొల్యూషన్స్ను తయారు చేస్తోంది. గత 57 సంవత్సరాలుగా రైతులకు సేవలందిస్తూ, ప్లాంటోమైసిన్తో పాటు 179 రకాల పోషక పదార్థాల ఉత్పత్తులను దేశవ్యాప్తంగా అందిస్తోంది. తద్వారా రైతులు అధిక దిగుబడులు మరియు అధిక లాభాలు పొందేందుకు కృషి చేస్తూ, దేశ ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోంది . రైతు సదస్సులో ప్రముఖుల సందేశంబండారుపల్లిలో నిర్వహించిన ఈ రైతు సదస్సులో, జయ ప్రదీప్ సుబ్రమణియన్, ఏరిస్ సాటి ఇండియా అడిషనల్ డైరెక్టర్ జనరల్ మార్కెటింగ్ ముఖ్య అతిథిగా పాల్గొని రైతులకు పలు సూచనలు అందించారు.
ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులుగా నల్లమోతు వెంకట రత్తయ్య జోనల్ సేల్స్ మేనేజర్, నల్లమోతు వెను మాధవ్ రీజినల్ మేనేజర్, పి.వెంకటేశ్వర రావు సీనియర్ మేనేజర్ సేల్స్ డెవలప్మెంట్, బి.సుందర్రాజు సీనియర్ మేనేజర్ ఎక్స్టెన్షన్ డెవలప్మెంట్, బి.ప్రతాప్, మరియు జె.ప్రవీణ్ పాల్గొన్నారు. వీరు రైతులతో కలిసి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఏరిస్ విజయ రహస్యంఅనంతరం సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ, ఏరిస్ కంపెనీ విజయానికి మూల సూత్రాలుగా నమ్మకం, సమ్యత, విలువలు, విశ్వాసం, మరియు దృఢ సంకల్పం నిలిచాయని పేర్కొన్నారు. కాలానికి అనుగుణంగా రైతులకు సేవలు అందిస్తూ సంస్థను విజయ తీరాల వైపు ఎదగడానికి ఈ ఐదు అంశాలు మూల స్తంభాలుగా నిలిచాయని తెలిపారు.ప్రస్తుత పంట పరిస్థితుల గురించి రైతులను అడిగి తెలుసుకుని, వారికి అవసరమైన సూచనలను సంస్థ ప్రతినిధులు అందించారు. ఈ కార్యక్రమంలో ఏరిస్ అగ్రి లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులు మరియు పెద్ద సంఖ్యలో రైతులు పాల్గొన్నారు.


## 75త్యాళ్ళూరు హైస్కూల్ విద్యార్థులచే ఇండస్ట్రియల్ విజిట్

పెదకూరపాడు, నవంబర్ 27, ప్రభాతవార్త: మండలంలోని 75త్యాళ్ళూరు జడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఇండస్ట్రియల్ విజిట్‌లో భాగంగా పెదకూరపాడులోని యూనియన్ బ్యాంకును సందర్శించారు. బ్యాంకింగ్ రంగానికి సంబంధించిన అనేక అంశాలను,వాటి పని తీరును పరిశీలించారు.వివిధ లావాదేవీలకు సంబందించిన పలు విషయాలపై విద్యార్థులకు అవగాహనా కల్పించారు.ఈ సందర్భంగా బ్యాంకు సిబ్బంది నగదు లావాదేవీలు ఎలా చేయాలి,బ్యాంకు రుణాలు ఎలా మంజూరు చేస్తారు,సైబర్ సెక్యూరిటీ గురించి తీసుకోవలసిన జాగ్రత్తలు వంటి అనేక విషయాలపై విద్యార్థులకు అవగాహనా కల్పించారు. వొకేషనల్ ఇన్స్పెక్టర్సు ఖానిదా,సునీత వ్యాయామ ఉపాధ్యాయుడు చెన్నకేశవ స్వామి, విద్యార్థులు పాల్గొన్నారు.



## ప్రజల మధ్యకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ - కస్తలలో అర్జీల స్వీకరణ

అచ్చంపేట, నవంబర్ 27 (ప్రభాత వార్త):100 రోజుల 100 గ్రామాల కార్యక్రమంలో భాగంగా అచ్చంపేట మండలం కస్తల గ్రామంలో ప్రజాదర్బార్ . 100 రోజుల 100 గ్రామాల కార్యక్రమం లో భాగంగా అచ్చంపేట మండలం కస్తల గ్రామం సచివాలయం వద్ద ప్రత్యేక ప్రజాదర్బార్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెదకూరపాడు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ గారు ప్రజలతో ప్రత్యక్షంగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, పించన్లు, కాలువలు, సర్వే సమస్యలు వంటి అంశాలపై వచ్చిన మొత్తం 45 అర్జీలను ఎమ్మెల్యే పరిశీలించి వెంటనే పరిష్కార చర్యలు తీసుకోవాలని సంబంధిత శాఖా అధికారులకు ఆదేశించారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇకపై ప్రతి గురువారం అచ్చంపేట పంచాయతీరాజ్ భవనంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని, అత్యవసర పరిస్థితుల్లో 8985570279 నెంబరుకు సంప్రదించవచ్చని తెలిపారు.ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే ప్రజా సమస్యలను తెలుసుకోవడం పట్ల గ్రామ ప్రజలు సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం గ్రామంలో జ రుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, ఖీది, తీది, మైనారిటీ కాలనీల్లో పర్యటించారు. గ్రామంలోని ప్రతి సమస్యను సమయానికి పరిష్కరించాలి. సచివాలయ సిబ్బంది గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజల సమస్యలను సేకరించాలి. చెత్త కుండీలు ఏర్పాటు చేసి పారిశుధ్యాన్ని మెరుగుపరచాలి.రైతులను ఇబ్బంది పెట్టకుండా వారి సమస్యలను నిజాయితీతో పరిష్కరించాలి.అర్హులైన అందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి.అధికారులు మరియు నేతల పాల్గొనంఈ ప్రజాదర్బార్ కార్యక్రమంలో మండలంలో వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు. ముఖ్యంగా: విభాగం డిప్యూటీ తహసీల్దార్మండల విద్యాశాఖ అధికారి, మండల అభివృద్ధి అధికారి ఎస్ ఐ మండల వ్యవసాయ అధికారి, మండల విద్యుత్ అధికారి , అలాగే గ్రామ సచివాలయం సిబ్బంది కూడా పాల్గొన్నారు. పార్టీ వైపు నుంచి మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షులు నందిగం ఆశీర్వాదం, గ్రామ అధ్యక్షులు శ్రీధర్, సొసైటీ డైరెక్టర్ షేక్ ఖాజావలి, గ్రామ నాయకులు సదాశివరావు, ఆర్. నాగేశ్వరరావు, వి. మధు, బి. నాగేశ్వరరావు, వి. మణిక్యరావు, సర్పంచ్ సుభానీ, మరియు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు. తరువాత ఎమ్మెల్యే పార్టీ నాయకుల ఇళ్లను సందర్శించి వారితో సమావేశమయ్యారు.



28-11Pg5exR_28-11Pg5exR.qxd 11/28/2025 1:30 AM Page 1



# శుద్ధమైన గాలికోసం ఏమని ఆదేశించాలి?

## ఢిల్లీ కాలుష్యంపై సిజెఐ సూర్యకాంత్ కీలక వ్యాఖ్యలు

**న్యూఢిల్లీ, నవంబరు 27:** దేశ రాజధాని ఢిల్లీని కాలుష్యం తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. కాలుష్యం కారణంగా నగరవాసులు బెంబేలెత్తి పోతున్నారు. రోజురోజుకు గాలి నాణ్యత కోల్పోతున్నది. ఈ నేపథ్యంలో బయటకు రావాలంటేనే హడలెత్తిపోతున్నారు. ప్రస్తుతం ఢిల్లీలో ప్రమాదఘంటికలు మోగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఢిల్లీ కాలుష్యంపై అత్యవసరంగా కేసు విచారణ జరపాలని పిటిషనర్ తరఫు న్యాయవాది కోరడంతో సిజెఐ జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. ఈ సందర్భంగా ఆయన కీలక వ్యాఖ్యలు చేస్తూ.. ఢిల్లీ-ఎన్‌సిఆర్‌లో అత్యంత ప్రమాదకర పరిస్థితులు ఉన్నాయని.. వెంటనే శుద్ధమైన గాలి వచ్చేలా మేం ఏమని ఆదేశించగలమని వ్యాఖ్యానించారు. అయితే ఈ సమస్యను పరిష్కరించేందుకు కోర్టులు ఎటువంటి అద్భుతాలు చేయలేవన్నారు. 'ఢిల్లీ కాలుష్య సమస్య ఏమిటి అన్నది అందరికీ తెలుసు. అన్ని కారణాలను గుర్తించాలి. ప్రతి ప్రాంతంలో ఏ పరిష్కారాలు సాధ్యమో అధ్యయనం చేయాల్సిన అవసరంఉంది. ఢిల్లీలోని వాయు కాలుష్యం నేపథ్యంలో బయటికి వెళ్లడం, వాకింగ్ చేయడం మానేశాను' అని జస్టిస్ సూర్యకాంత్ అన్నారు. వచ్చే సోమవారం మరోసారి విచారణ జరుతామని తెలిపారు.



# ఆన్‌లైన్ కంటెంట్‌పై ఎవరో ఒకరు బాధ్యత వహించాలి

## 'సుప్రీం' ఘాటు వ్యాఖ్యలు..కేంద్రానికి నాలుగు వారాల గడువు

**న్యూఢిల్లీ, నవంబరు 27:** సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసిన కంటెంట్‌పై ఎవరో ఒకరు బాధ్యత వహించాల్సి ఉంటుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. వ్యక్తులు సొంతంగా ఛానెళ్లు ప్రారంభించి.. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించడం వింతగా ఉందని సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ వ్యాఖ్యానించారు. గురువారం యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా కేసులో విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు. ఒక హాస్య కార్యక్రమంలో పాల్గొన్న వ్యక్తిని తల్లిదండ్రులు, శృంగారంగురించి ప్రశ్నించడంద్వారా యూట్యూబర్ రణవీర్ వివాదంలో చిక్కుకున్న విషయం తెలిసిందే. ఈ కేసులో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దీనిపై సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పందించారు. తాను సొంతంగా ఛానెల్‌పెట్టాను. తాను ఎవరికీ జవాబుదారీగాఉండను అనే సంకేతాలువెళ్తున్నాయని.. ఇది సరికాదని ఆయన అభిప్రాయపడ్డారు. ఆన్‌లైన్ కంటెంట్ విషయంలో ఎవరో ఒకరు బాధ్యత వహించాల్సి ఉంటుందని స్పష్టంచేశారు. సోషల్‌మీడియా కంటెంట్‌నునియంత్రించేలా నిబంధనలు తీసుకురావాలని కేంద్రాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. అందుకోసం కేంద్రానికి సుప్రీంకోర్టు నాలుగు వారాల గడువు ఇచ్చింది.



# ఇండోనేసియాలో భారీ భూకంపం

## రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 6.3గా నమోదు

### 28 మంది మృత్యువాత

**జకార్తా, నవంబరు 27:** ఇండోనేసియాలోని సుమత్రా దీవుల్లో భారీ భూకంపం సంభవించింది. భూకంప తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 6.3గా నమోదైంది. భూకంప కేంద్రం ఆషే ప్రావిన్స్‌కు సమీపంలో భూ ఉపరితలానికి 10 కిలోమీటర్ల లోతున నమోదైనట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇపట్పికే కొండచరియలు, ఆకస్మిక వరదలతో ఉక్కిరిబిక్కిరి అవుతోన్న ఆ దేశాన్ని ప్రకృతి విపత్తు వణికించింది. సైక్లోన్ సెన్యార్ కారణంగా సుమిత్రా దీవుల్లో ఆకస్మిక వరదలు సంభవించాయి. దాంతో ఇప్పటివరకు 28 మంది ప్రాణాలు కోల్పోయారు. పదులు సంఖ్యలో ప్రజల ఆచూకీ లభ్యమైంది. ఈ వరదల వల్ల బ్రిడ్జ్ కూలిపోవడంతో పాటు రోడ్లు దెబ్బతిన్నాయి. దాంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు వెల్లడించారు. పసిఫిక్ రింగ్ ఆఫ్ ఫైర్‌కు సమీపంలో ఉండే ఇండోనేసియా తరచూ భూకంపాలు, సునామీ వంటి విపత్తులను ఎదుర్కొంటోంది.

ఈ రింగ్‌అనేది పసిఫిక్ మహాసముద్ర తీరం వెంట విస్తరించిఉన్న భారీ టెక్టోనిక్ బెల్ట్. ఇక్కడే 90 శాతం భూకంపాలు సంభవిస్తుంటాయి. జపాన్, ఇండోనేసియా, ఫిలిప్పీన్స్, న్యూజిలాండ్, అలస్కాలోని అల్యూటియన్ ద్వీపాలు దీని పరిధిలోకి వస్తాయి.



# చైనాలో రైల్వే కార్మికులపైకి దూసుకెళ్లిన రైలు

## 11 మంది దుర్మరణం.. మరో ఇద్దరికి గాయాలు

**బీజింగ్, నవంబరు 27:** రైలు పట్టాల వద్ద పనిచేస్తున్న రైల్వే కార్మికులపైకి రైలు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 11 మంది కార్మికులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. నైరుతి చైనాలోని యూనాన్ ప్రావిన్స్‌లో ఈ దుర్ఘటన జరిగింది. గురువారం తెల్లవారుజామున 'భూకంప పరికరాల పరీక్ష కోసం ఉపయోగించే' టెస్టింగ్ ట్రైన్ కున్మింగ్‌లోని లుయోయాంగ్ టౌన్ స్టేషన్‌లో ప్రయాణించింది. కాగా, వంపుగా ఉన్న రైలు పట్టాలవద్ద కొందరు కార్మికులు పని చేస్తున్నారు. అయితే ఆ పట్టాలపై ప్రయాణించిన ఆ రైలు వారి మీదకు దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో 11 మంది రైల్వే కార్మికులు మరణించారు. మరో ఇద్దరు గాయపడ్డారు. వారిని ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మరోవైపు చైనాలో దశాబ్దానికి పైగా జరిగిన అత్యంత ఘోర ప్రమాదంగా ఆ దేశ రైల్వే అధికారులు అభివర్ణించారు. ఈ ప్రమాదంపై దర్యాప్తు చేస్తున్నారు. గురువారం మధ్యాహ్నానికి రైళ్ల రాకపోకలను పునరుద్ధరించారు.

# కుమార్తెను వ్యభిచార కూపంలోకి దింపేందుకు తల్లి యత్నం

**ముంబై, నవంబరు 26:** ముంబై మహానగరంలోని ఘట్‌కోపర్ ప్రాంతంలో ఓ దిగ్భ్రాంతికరమైన ఘటన వెలుగులోకి వచ్చింది. పదో తరగతి చదువుతున్న కుమార్తెను కన్నతల్లే వ్యభిచార కూపంలోకి దించేందుకు ప్రయత్నించింది. పొరుగింటి వ్యక్తితో కలిసి డబ్బుల కోసం తనను వ్యభిచారం చేయాలని బలవంతం చేస్తున్నారంటూ బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వ్యభిచారం చేయాలని ఏప్రిల్ నుంచి తన తల్లి, పక్కింటి వ్యక్తి ఒత్తిడి తెస్తున్నారని బాధితురాలు తెలిపింది. డబ్బులు సంపాదించేందుకు ఇదే సరైన మార్గమని చెప్పేవారని బాధిత బాలిక పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. తల్లి నుంచి రోజురోజుకు ఒత్తిడి పెరుగుతుండటంతో తన బాధను స్నేహితురాలితో పంచుకుంది. ఆమె ఇచ్చిన ధైర్యం, ప్రోత్సాహంతో స్కూల్ టీచర్‌కు చెప్పింది. ఈ వేధింపుల తాళలేక ఒకసారి ఇంటి నుంచి పారిపోయి మూడు రోజుల పాటు స్నేహితురాలి ఇంట్లో దాచుకున్నట్లు వివరించింది. తిరిగి ఇంటికి వచ్చాక నిందితులు తనను కొట్టి, బలవంతంగా వ్యభిచార వృత్తిలోకి నెట్టారని ఆవేదన వ్యక్తం చేసింది. బాలిక చెప్పింది విన్న ఉపాధ్యాయురాలు వెంటనే ఈ విషయాన్ని పాఠశాల యాజమాన్యానికి తెలియజేసింది. పరిస్థితి తీవ్రతను గుర్తించిన యాజమాన్యం వెంటనే పోలీసులకు ఫిర్యాదుచేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# హాంకాంగ్ అగ్నిప్రమాదంలో 16వ అంతస్తు నుంచి వ్యక్తిని రక్షించిన సిబ్బంది

**లండన్, నవంబరు 27:** హాంగ్‌కాంగ్‌లో జరిగిన ఘోర అగ్నిప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. అయితే ఈ పెను విషాదం మధ్య ఓ అద్భుతం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన 24 గంటల తర్వాత ఒకవ్యక్తిని సహాయక సిబ్బంది ప్రాణాలతో కాపాడారు. గురువారం మధ్యాహ్నం 32 అంతస్తుల ఈ రెసిడెన్షియల్ కాంప్లెక్స్‌లో మంటలు చెలరేగాయి. సుమారు 1,200 మంది అగ్నిమాపక సిబ్బంది సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలోనే నిన్న సాయంత్రం 16వ అంతస్తులో చిక్కుకుపోయిన వ్యక్తిని 24 గంటల తర్వాత ప్రాణాలతో బయటకు తీశారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉంది.

# పూర్తి ఆరోగ్యంతో ఇమ్రాన్

## జైలు అధికారులు వెల్లడి



**ఇస్లామాబాద్, నవంబరు 27:** పాకిస్థాన్ మాజీ ప్రధాని, పిటిఐ పార్టీ వ్యవస్థాపకుడు ఇమ్రాన్ ఖాన్ జైల్లో మరణించారంటూ సోషల్ మీడియాలో వ్యాపించిన వదంతులపై రావల్పిండిలోని అడియాలా జైలు అధికారులు స్పందించారు. ఆవార్తల్లో ఎలాంటి నిజంలేదని, ఇమ్రాన్ ఖాన్ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని గురువారం స్పష్టంచేశారు. ఆయన్ను ఎక్కడికీ తరలించలేదని, ప్రస్తుతం తమ వద్దే ఉన్నారని తెలిపారు. జైలు అధికారులు విడుదల చేసిన ప్రకటనలో, ఇమ్రాన్ ఖాన్‌ను అడియాలా జైలు నుంచి తరలించారనే కథనాల్లో వాస్తవం లేదు. ఆయన సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నారు, అవసర మైన పూర్తి వైద్య సంరక్షణ అందిస్తున్నాం అని పేర్కొన్నారు. ఆయన ఆరోగ్యంపై వస్తున్న పుకార్లను నిరాధారమైనవని కొట్టిపారేశారు. ఈ వదంతులపై ఇమ్రాన్ ఖాన్ పార్టీ పాకిస్థాన్ తెహ్రీక్ ఎ ఇన్సాఫ్ తీవ్రఆందోళన వ్యక్తంచేసింది. ప్రభుత్వం వెంటనే ఈ విషయంపై స్పష్టత ఇవ్వాలని, ఇమ్రాన్‌తో ఆయన కుటుంబ సభ్యుల భేటీని తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేసింది. గత కొన్ని వారాలుగా ఇమ్రాన్ సోదరీమణులను ఆయన్ను కలిసేందుకు అనుమతించకపోవడంతో అనుమానాలు మరింత బలపడుతున్నాయి. తమ సోదరుడిని కలిసేం దుకు అనుమతించకపోవడంతో ఇమ్రాన్ సోదరీ మణులు అలీమా ఖాన్, నూరీన్‌ఖాన్, ఉజ్మాఖాన్ అడియాలా జైలు బయట గంటలతరబడి నిరసన చేపట్టారు. లోపల ఏంజరుగుతోందో ఎవరికితెలుసు? బహుశా ఇమ్రాన్‌ను వేరేచోటుకు తరలించి ఉండవచ్చు. అందుకే మమ్మల్ని కలవనివ్వడం లేదు అని అలీమా ఖాన్ అనుమానం వ్యక్తం చేశారు. దేశంలో అరాచకపాలననడుస్తోందని ఆమె విమర్శించారు. 2022లో అవిశ్వాస తీర్మానంతో అధికారం కోల్పోయిన ఇమ్రాన్‌ఖాన్, అవినీతి, ఉగ్రవాదంవంటి పలు కేసుల్లో 2023 ఆగస్టు నుంచి జైలుశిక్ష అనుభవిస్తున్న విషయం తెలిసిందే.

# అమెరికా ఆంక్షల వేళ రష్యా చమురు భారీగా దిగుమతి

## రోజుకు 1.9 మి.బ్యారెల్స్



**అహ్మదాబాద్, నవంబరు 27:** రష్యా- ఉక్రెయిన్ యుద్ధం ఆపేయాలనే లక్ష్యంతో రష్యా చమురు సంస్థలపై అమెరికా ఆంక్షలు విధించింది. అలాగే రష్యా సంస్థల నుంచి చమురు కొనుగోలు చేస్తున్న భారత్, చైనా తదితర దేశాలపైనా అగ్రరాజ్యం ఆర్థిక ఆంక్షలు పెట్టింది. రష్యా నుంచి చమురు కొనుగోలు ఆపకపోతే, భారత్‌పై 500శాతం సుంకాలు కూడా విధించే అవకాశముందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన విషయం తెలిసిందే. ఇదిలా ఉండగా, నవంబర్ నెలలో భారత్ భారీగా రష్యా నుంచి ముడి చమురును దిగుమతి చేసుకుంది. రష్యా నుంచి భారత్‌కు ముడి చమురు దిగుమతులు రోజుకు సగటున 1.9 మిలియన్ బ్యారెల్స్‌తో రికార్డు స్థాయికి చేరుకున్నాయి.

గ్లోబల్ రియల్ టైమ్ డేటా అనలిటిక్స్ ప్రొవైడర్ కెప్లెర్ నివేదిక ప్రకారం... నవంబర్‌లో ఇప్పటివరకు రష్యా అతిపెద్ద ముడి చమురు కొనుగోలుదారుగా భారత్ నిలిచింది. ఈ నెలలో ఇప్పటిదాకా కార్గోలు సగటున రోజు 1.886 మిలియన్ బ్యారెల్స్ చమురు దిగుమతి చేసుకున్నాయి. అక్టోబరు నెలతో పోలిస్తే 17శాతం పెరిగాయి. 2024లో ఇదే నెలతో పోలిస్తే దాదాపు 6శాతం అధికమయ్యాయి. కొనుగోళ్లు పెరగడంతో భారత్‌కు రష్యన్ చమురు దిగుమతి 5నెలల గరిష్టానికి చేరుకుంది.

నవంబరు 21 నుంచి రష్యా చమురు సంస్థలు రోస్‌నెఫ్ట్, లుకోయిల్‌పై అమెరికా అంక్షలు అమల్లోకి వచ్చాయి. ఈ నేపథ్యంలో అంతకుముందే భారీగా క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకున్నట్లు తెలుస్తోంది. అమెరికా ఆంక్షలు అమల్లోకి వచ్చినందున భారత్ చమురు దిగుమతులు తగ్గుముఖం పట్టే అవకాశముంది. అయితే, అది తాత్కాలికంగానే ఉంటుందని నిపుణులు చెబుతున్నారు. ఇది సరఫరా గొలుసులను పునర్ వ్యవస్థీకరించడానికి వీలు కల్పిస్తుందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

# వైట్‌హౌస్ సమీపాన కాల్పులు

## ఇద్దరు నేషనల్ గార్డ్ పరిస్థితి విషమం

## నిందితుడు అఫ్గాన్ జాతీయుడిగా గుర్తింపు

## ఉగ్రదాడిగా అభివర్ణించిన అధ్యక్షుడు

**వాషింగ్టన్, నవంబరు 27:** వాషింగ్టన్‌లో కాల్పుల కలకలం రేగింది. అమెరికా అధ్యక్ష భవనం వైట్‌హౌస్‌కు సమీపంలో బుధవారం జరిగిన కాల్పుల ఘటనలో ఇద్దరు వెస్ట్ వర్జీనియా నేషనల్ గార్డ్ సభ్యులు తీవ్రంగా గాయపడ్డారు. వారి పరిస్థితి విషమంగా ఉందని, ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నామని అధికారులుతెలిపారు. బుధవారంమధ్యాహ్నం వైట్‌హౌస్‌కు కొన్ని బ్లాకుల దూరంలోనే ఈ దాడి జరిగింది. వెస్ట్ వర్జీనియాకు చెందిన నేషనల్ గార్డ్ సైనికులు గస్తీ కాస్తుండగా, ఓ దుండగుడు అకస్మాత్తుగా వారిపై కాల్పులకు తెగబడ్డాడు. ఈ ఘటనతో భద్రతా దళాలు వెంటనే వైట్‌హౌస్ కాంప్లెక్స్‌ను లాక్‌డౌన్ చేశాయి. కాల్పుల సమయంలో ట్రంప్ ఫ్లోరిడాలోని తన మార్‌ఎలాగో క్లబ్‌లో ఉన్నారు. భద్రతా సిబ్బంది జరిపిన ఎదురుకాల్పుల్లో గాయపడిన నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని 29 ఏళ్ల రెహమానుల్లా లకన్‌వాల్‌గా గుర్తించారు. ఇతడు 2021లో తాలిబన్లు అధికారం చేపట్టాక ఆఫ్ఘనిస్థాన్ నుంచి అమెరికాకు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అమెరికా సైన్యానికి సహాయం చేసిన అఫ్ఘన్లకు ఇచ్చే ప్రత్యేక వీసాపై వచ్చిన ఇతడు, వీసా గడువు ముగిసినా అక్రమంగా దేశంలోనే ఉంటున్నట్లు తెలుస్తోంది.

ఈ ఘటనపై ట్రంప్ తీవ్రంగా స్పందించారు. 'హేయమైన చర్య', 'ఉగ్రవాద దాడి'గా అభివర్ణించారు. భద్రతను కట్టుదిట్టం చేసేందుకు తక్షణమే వాషింగ్టన్‌కు అదనంగా 500 మంది సైనికులను పంపాలని పెంటగాన్‌ను ఆదేశించారు. "సైనికులపై కాల్పులు జరిపిన నిందితుడికి తగిన మూల్యం తప్పదు. మన సైనికులకు, భద్రతా సిబ్బందికి దేవుడు అండగా ఉండాలి" అని ఆయన సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. గత బైడెన్ ప్రభుత్వమే నిందితుడిని దేశంలోకి అనుమతించిందని ఆరోపించారు. నరకంలాంటి అఫ్ఘనిస్థాన్ నుంచి అతడినితీసుకొచ్చారని విమర్శించారు. బైడెన్ హయాంలో ఆఫ్ఘన్ నుంచి వచ్చిన శరణార్థులందరి వివరాలను పునఃపరిశీలించాలని డిమాండ్ చేశారు. సైనికుల కోసం ప్రార్థించాలని ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ ప్రజలను కోరారు.

# డాక్టర్ షాహిన్ నా భార్య.. గర్ల్‌ఫ్రెండ్ కాదు..

## 'ఉగ్ర' డాక్టర్ ముజమ్మిల్ వెల్లడి



**న్యూఢిల్లీ, నవంబర్ 27:** ఢిల్లీ కారు బాంబు పేలుడు కేసులో విస్తుపోయే విషయాలు బయటపడుతున్నాయి. నిందితురాలు డాక్టర్ షాహిన్ షహిద్ గర్ల్‌ఫ్రెండ్ కాదని, తన భార్య అని సహ నిందితుడు ముజమ్మిల్ షకీల్ విచారణలో భాగంగా వెల్లడించాడు. 2023లో తమ నిఖా జరిగిందని చెప్పాడు. అల్ ఫలా యూనివర్సిటీ సమీపంలోని మతపరమైన ప్రదేశం అందుకు వేదికైందని తెలిపాడు. ఈ మేరకు దర్యాప్తు అధికారులను ఉటంకిస్తూ జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. 2023లో ఆయుధాలు కొనేందుకు ముజమ్మిల్‌కు షాహిన్ రూ.6.5 లక్షలు ఇచ్చిందని, 2024లో బాంబర్ ఉమర్ నబీకి ఫోర్డ్ ఎకోస్పోర్ట్ కారు కొనేందుకు రూ.3లక్షలు ఇచ్చినట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ క్రమంలో ముజమ్మిల్, షాహిన్ బంధం గురించి బయటకు వచ్చింది. దీని ద్వారా షాహిన్‌కు జైషే మహమ్మదు మాడ్యూల్‌తో ఉన్న సంబంధాలు వెల్లడవుతాయా? అనే దిశగా అధికారులు దర్యాప్తు చేస్తున్నట్లు సమాచారం. అలాగే ఆ మాడ్యూల్ ఆయుధాలు, పేలుడు పదార్థాలు సమీకరించుకునేందుకు ఆమె రూ.27 లక్షలు, 28 లక్షలు ఇచ్చినట్లు సమాచారం. అయితే అది మతపరమైన విరాళమని ఆమె దర్యాప్తులో వెల్లడించినట్లు తెలుస్తోంది. జైషే మహిళా విభాగంలో షాహిన్ కీలక పాత్ర పోషిస్తోందని ఇప్పటికే వెలుగులోకి వచ్చింది. భారత్ ఇటీవల నిర్వహించిన ఆపరేషన్ సిందూర్‌లో జైషే చీఫ్ మసూద్ అజార్ కుటుంబం చిన్నాభిన్నమైంది. ఆ ఉగ్ర సంస్థకు చెందిన ప్రధాన కేంద్రం కూడా ధ్వంసమైంది. ఈ క్రమంలో జైషే మహిళా బ్రిగేడ్‌ల ఏర్పాటుకు ఆన్‌లైన్ కోర్సులు ప్రారంభించినట్లు నిఘా వర్గాలు గుర్తించాయి. ఈ జమాత్ ఉల్ మొమినాత్ విభాగానికి మసూద్ సోదరి సాదియా అజార్ నేతృత్వం వహిస్తున్నారు. ఈ విభాగంలో షాహిన్‌కు కీలక బాధ్యతలు అప్పగించినట్లు తెలుస్తోంది. పాక్‌లోని ఉగ్రవాదుల నుంచి అందుతున్న ఆదేశాలతో భారత్‌లో మహిళా విభాగాలు స్థాపించి, వారి నియామకాలు చేపట్టడం వంటి కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు నిఘా వర్గాలు తెలిపాయి. కాగా నవంబర్ 10న ఎర్రకోట సమీపంలో జరిగిన కారు బాంబు పేలుడు వెనుక కుట్ర కోణాలను జాతీయ దర్యాప్తు సంస్థ విచారిస్తోంది. దానిలో భాగంగా ఇప్పటివరకు ఏడుగురిని అరెస్టు చేసింది.

# డెంగ్యూకి సింగిల్ డోస్ వ్యాక్సిన్

## ప్రపంచంలోనే తొలిసారి



**న్యూఢిల్లీ, నవంబరు 27:** డెంగినివారణలో ప్రపంచం ఒక చారిత్రక ముందడుగు వేసింది. ప్రపంచంలోనే తొలిసింగిల్‌డోస్‌డెంగీ వ్యాక్సిన్‌కు బ్రెజిల్ ప్రభుత్వం ఆమోదం తెలిపింది. వాతావరణ మార్పుల కారణంగా ప్రపంచవ్యాప్తంగా డెంగీ కేసులు రికార్డు స్థాయిలో పెరుగుతున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. సావో పాలోలోని ప్రఖ్యాత బుటాంటన్ ఇన్‌స్టిట్యూట్ అభివృద్ధి చేసిన 'బుటాంటన్ డివీ' అనే ఈ వ్యాక్సిన్‌ను 12 నుంచి 59 ఏళ్ల వయసు వారికి అందించనున్నారు. ప్రస్తుతం అందుబాటులో ఉన్న డెంగీ వ్యాక్సిన్‌ను మూడు నెలల వ్యవధిలో రెండు డోసులుగా తీసుకోవాల్సి ఉండగా, ఈ కొత్త వ్యాక్సిన్ ఒక్క డోసుతోనే సరిపోతుంది. బ్రెజిల్‌లో 16,000 మంది వలంటీర్లపై ఎనిమిదేళ్ల పాటు నిర్వహించిన క్లినికల్ ట్రయల్స్‌లో ఈ వ్యాక్సిన్ తీవ్రమైన డెంగీపై 91.6 శాతం సమర్థత చూపింది. మనిషిని కుదురు లేకుండా చేసే ఈ వ్యాధి లక్షణాల కారణంగా 'బ్రేక్‌బోన్ ఫీవర్' అని కూడా డెంగీని పిలుస్తారు. ఇది కొన్ని సందర్భాలలో అంతర్గత రక్తస్రావానికి కారణమై ప్రాణాం తకంగాకూడా మారుతుంది. 2024లో ప్రపంచవ్యాప్తంగా 1.46కోట్లకేసులు, 12,000 మరణాలు నమోదయ్యాయని, వీటిలో సగం మరణాలు బ్రెజిల్‌లోనే సంభవించాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ వెల్లడించింది. 2026 ద్వితీయార్థంలో సుమారు 30 మిలియన్ల డోసుల వ్యాక్సిన్‌ను అందించేందుకు చైనాకు చెందిన వుసీ బయోలాజికల్స్ సంస్థతో ఒప్పందం కుదుర్చుకున్నట్లు బ్రెజిల్ ఆరోగ్య మంత్రి తెలిపారు.

# సంక్షిప్తంగా..

## డ్రెస్, లిప్‌స్టిక్‌ను నిందించొద్దు: ఐశ్వర్యారాయ్

**ముంబై, నవంబరు 27:** ప్రముఖ బాలీవుడ్ నటి, మాజీ ప్రపంచ సుందరి ఐశ్వర్యరాయ్ సామాజిక సమస్యలపై తన గళాన్ని మరోసారి బలంగా వినిపించారు. బహిరంగ ప్రదేశాల్లో మహిళలకు వేధింపుల (స్ట్రీట్ హరాస్‌మెంట్) ఘటనల్లో బాధితులనే నిందించే ధోరణిపై ఆమె తీవ్రంగా స్పందించారు. "జరిగిన దానికి మీ డ్రెస్సునో, మీరు పెట్టుకున్న లిప్‌స్టిక్‌నో నిందించవద్దు. వేధింపులు ఎప్పుడూ మీ తప్పు కాదు" అని పేర్కొన్నారు. మహిళలు ఇలాంటి సమస్యలను ధైర్యంగా ఎదుర్కోవాలని, తమ ఆత్మగౌరవాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ తగ్గించుకోవద్దని ఆమె పిలుపునిచ్చారు. "మీ శరీరం, మీ గౌరవం మీ సొంతం. మీ విలువ విషయంలో ఎప్పుడూ రాజీ పడకండి. మీ ఆత్మ విశ్వాసాన్ని ఎప్పుడూ శంకించకండి. మీ గౌరవం కోసం పోరాడండి. వేధింపులు ఎప్పటికీ మీ తప్పు కానే కాదు" అని ఐశ్వర్య స్పష్టం చేశారు.

## ఢిల్లీలో హిమాన్షు భావు ముఠా సభ్యుడి అరెస్ట్

**న్యూఢిల్లీ, నవంబరు 27:** ఢిల్లీ నగరంలోని ద్వారకలో గురువారం యాంటీ నార్కోటిక్స్ సెల్‌కు, హిమాన్షు భావు గ్యాంగ్‌కు చెందిన అంకిత్‌కు మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయి. ఈ ఘటనలో అంకిత్ కుడి కాలుకు బులెట్ తగిలింది. ఈ ఎన్‌కౌంటర్ తర్వాత అంకిత్‌ను యాంటీనార్కోటిక్స్ సెల్ అధికారులు అరెస్టు చేశారు. గత నెల చివర్లో రోహిత్ లాంబాపై నలుగురు వ్యక్తులు కాల్పులు జరిపిన సంగతి తెలిసిందే. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. హిమాన్షు భావు గ్యాంగ్ ఈవిషయంలో ప్రమేయం ఉన్నట్లు తేలింది. ఇప్పటికే నలుగురు నిందితులను అరెస్టు చేయగా, ఇద్దరు ప్రధాన షూటర్లు పరారీలో ఉన్నారు. పరారీలో ఉన్న నిందితులను అంకిత్, దీపక్ లుగా అధికారులు గుర్తించారు.

గురువారం నజాఫ్‌గఢ్‌లోని సాయిబాబా మందిర్ సమీపంలోకి అంకిత్ వస్తున్నట్లు ద్వారకాలోని యాంటీ నార్కోటిక్స్ సెల్ బృందానికి సమాచారం అందింది. దీంతో ఈరోజు ఉదయం 8:00 గంటల సమయంలో అంకిత్ బైక్ పై వస్తుండగా పోలీసులు పట్టుకోవడానికి ప్రయత్నించారు. అతను తప్పించుకోవడానికి ప్రయత్నించి పోలీసులపై మూడు రౌండ్ల కాల్పులు జరిపాడు. ఒక బుల్లెట్ ఓ పోలీసు కానిస్టేబుల్ బుల్లెట్ ప్రూఫ్ జాకెట్‌ను తాకింది. ఆత్మరక్షణ కోసం పోలీసులు నిందితుడిపై మూడు రౌండ్ల కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో అతడి కాలికి గాయమైంది. ఆ తర్వాత నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు.

## ముస్లింలు బిజెపికి ఓటేస్తేనే కేంద్ర కేబినెట్‌లో స్థానం

### కేరళ బిజెపి చీఫ్ వివాదాస్పద వ్యాఖ్యలు

**తిరువనంతపురం, నవంబరు 27:** ముస్లింలు బిజెపికి ఓటేయకపోవడం వల్లే కేంద్ర కేబినెట్‌లో వారికి ప్రాతినిధ్యం లభించడం లేదని కేరళ బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు రాజీవ్ చంద్రశేఖర్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. కోజికోడ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ... 'ముస్లింలు బిజెపికి ఓటు వేస్తేనే ముస్లిం ఎంపిగా ఎన్నికవుతారు. ఎంపి లేనప్పుడు మంత్రి ఎలా ఉంటారు?" అని ఆయన ప్రశ్నించారు.

"బిజెపికి ఓటు వేయడానికి ఇష్టపడనప్పుడు, ప్రాతినిధ్యం ఎలా ఆశిస్తారు?" అని అన్నారు. ముస్లింలు బీజేపీకి ఓటేస్తే, ఆ ప్రాంతం నుంచి ఒక ముస్లిం ఎంపీ ఎన్నికయ్యే అవకాశం ఉంటుందని, తద్వారా మంత్రి పదవి కూడా దక్కవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుత కేంద్ర మంత్రివర్గంలో ముస్లిం వర్గానికి చెందిన మంత్రులు ఎవరూ లేకపోవడం గమనార్హం. స్వాతంత్రం వచ్చిన తర్వాత కేంద్ర కేబినెట్‌లో ముస్లిం ఎంపీకి స్థానం లభించకపోవడం ఇదే తొలిసారి. 18వ లోక్‌సభలో ఎన్డీయే కూటమి తరఫున ఏ ముస్లిం అభ్యర్థి కూడా గెలవలేదు. గత మోడీ ప్రభుత్వంలో ముక్తార్ అబ్బాస్ నఖ్వీ ఏకైక ముస్లిం మంత్రిగా ఉన్నారు.

## మహిళా ప్రయాణికురాలిపై ఉబెర్ డ్రైవర్ వేధింపులు

**న్యూఢిల్లీ, నవంబరు 27:** దేశ రాజధాని ఢిల్లీలో ఓ మహిళా ప్రయాణికురాలికి ఉబెర్ డ్రైవర్ నుంచి వేధింపులు ఎదురయ్యాయి. ఆసుపత్రికి బయలుదేరిన తనపై ఉబెర్ డ్రైవర్ దాడి చేశాడని, తన చేతిని మెలిపెట్టాడని బాధిత మహిళ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఆ సమయంలో పోలీస్ హెల్ప్ లైన్ కానీ ఉబెర్ హెల్ప్ లైన్ నుంచి కానీ తనకు ఎలాంటి సహాయం అందలేదని వాపోయారు. ఎలాగోలా తానే తప్పించుకుని బయటపడ్డానని, డ్రైవర్ దాడిలో తనకు స్వల్ప గాయాలయ్యాయని ఆమె వివరించారు. ఈ పోస్టు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారి చర్చకు దారితీసింది. మహిళలకు రక్షణ లేకుండా పోయిందని పలువురు నెటిజన్లు తీవ్రంగా మండిపడుతున్నారు.

# పూర్వీకులు మనకు అందించిన వైద్య విధానం యోగా

## బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్

**ఉమ్మడి తూర్పుగోదావరి బ్యూరో, నవంబరు 27 (ప్రభాతవార్త) :** రాజమహేంద్రవరంలోని గౌతమి ఘాట్ వద్ద గోదావరి జోన్ మండల అధ్యక్షుల ప్రశిక్షణ వర్గ్ లో భాగంగా, గోదావరినది తీరాన నిర్వహించిన యోగా కార్యక్రమంలో కార్యకర్తలతో కలిసి ఎపి బిజెపి చీఫ్ పివిఎన్ మాధవ్, బిజెపి జాతీయ కార్యవర్గ సభ్యులు ఎమ్మెల్సీ సోము వీర్రాజు యోగా లో పాల్గొన్నారు. బుధవారం ఉదయం రివర్ బేలో జరిగిన యోగా కార్యక్రమంలో మండలంస్థాయి కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా బిజెపి ఎపి చీఫ్ పివిఎన్ మాధవ్ మాట్లాడుతూ యోగా మన జీవనవిధానంలో ఒక భాగమని, యోగాను ప్రపంచ దేశాలలో ఒక దినోత్సవం నిర్వహిస్తున్న విషయాన్ని వివరిస్తూ ఇది మన పూర్వీకులు మనకు అందించిన ఒక వైద్య విధానమని పేర్కొన్నారు. యోగాను ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ విశ్వవ్యాప్తం చేసారన్నారని మాధవ్ కొనియాడారు. గోదావరి జోన్ మండల అధ్యక్షుల ప్రశిక్షణవర్గలో భాగంగా తొలుత గోదావరి నది తీరాన ఇస్కాన్ టెంపుల్ వద్ద నూతన జెండా స్తూపాన్ని రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్.మాధవ్, కేంద్ర భారీ పరిశ్రమల ఉప శాఖ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి ఎమ్మెల్సీ సోము వీర్రాజు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పిక్కి నాగేంద్ర, రాష్ట్ర కార్యదర్శి బొమ్ముల దత్తు తదితరులు పాల్గొన్నారు.

# మద్యం కేసులో నర్రెడ్డి సునీల్ రెడ్డిని విచారిస్తున్న సిట్ అధికారులు

**విజయవాడ,నవంబరు27,ప్రభాతవార్తప్రతినిధి:** ఏపీ మద్యం కుంభకోణం కేసులో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఈ కేసులో నర్రెడ్డి సునీల్ రెడ్డిని సిట్ అధికారులు విచారిస్తున్నారు. గురువారం ఉదయం విజయవాడలోని సిట్ కార్యాలయానికి వచ్చిన సునీల్ రెడ్డికి మద్యం కుంభకోణంలోని పలు అంశాలపై సిట్ అధికారులు ప్రశ్నలు సంధించారు. మద్యం వ్యవహారంలో సునీల్ రెడ్డి నివాసంతోపాటు అతడి కంపెనీలపై సిట్ అధికారులు దాడులు చేసి.. కీలక డాక్యుమెంట్లను స్వాధీనం చేసుకున్నారు. నవంబర్ 27వ తేదీన అంటే.. ఈ రోజు విచారణకు హాజరు కావాలంటూ సునీల్ రెడ్డికి నోటీసులు జారీ చేశారు. వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌కు నర్రెడ్డి సునీల్ రెడ్డి సన్నిహితుడు.జగన్ ప్రభుత్వ హయాంలో జరిగిన మద్యం కుంభకోణంపై చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం సిట్ చేత దర్యాప్తు జరుపుతోంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న రాజ్ కసిరెడ్డిని అరెస్ట్ చేసి.. కీలక విషయాలను సిట్ రాబట్టింది. వాటి ఆధారంగా పలువురిని అరెస్ట్ చేశారు. ఈ కేసులో పలువురికి చెందిన రూ.కోట్లాది ఆస్తులను ప్రభుత్వానికి అటాచ్ చేసింది.

# రాష్ట్రంలో కేన్సర్ రిజిస్ట్రీ, ట్యూమర్ బోర్డు ఏర్పాటుకు కేంద్రం సూచన

**విజయవాడ,నవంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:**. క్యాన్సర్ నియంత్రణ చర్యలకు ఊతమిస్తామన్న కేంద్రం.. రాష్ట్రంలో క్యాన్సర్ నియంత్రణ మరియు నివారణ దిశగా జరుగుతున్న కృషికి గుర్తింపుగా కేంద్ర ప్రభుత్వం గురువారం పలు సహాయక చర్యలను ప్రకటించింది. ఢిల్లీలో నేడు జరిగిన ఎన్సీడీ(విదిదీ) మరియు క్యాన్సర్ కేర్ వర్క్‌షాప్ లో చర్చల సందర్భంగా ఈ నిర్ణయాలను కేంద్ర ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ ప్రకటించినట్లు రాష్ట్ర వైద్యారోగ్య శాఖ కార్యదర్శి సౌరభ్ గౌర్ నేడొక పత్రికా ప్రకటనలో తెలిపారు. క్యాన్సర్ మందుల కొనుగోలులో ఆర్థిక తోడ్పాటుతో పాటు క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరికరాల కొనుగోలులో కేంద్ర ప్రభుత్వం 80 శాతం మేరకు వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్) అందిస్తామని కేంద్రం ప్రకటించినట్లు సౌరభ్ గౌర్ వెల్లడించారు. క్యాన్సర్ వ్యాధి నియంత్రణ మరియు నివారణ దిశగా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ పథకాల ద్వారా సత్ఫలితాలు సాధించేందుకు రాష్ట్రంలో క్యాన్సర్ రిజిస్ట్రీ మరియు ట్యూమర్ బోర్డును ఏర్పాటు చేయాలని కేంద్రం సూచించిందని, ఈ విషయంలో కూడా కేంద్ర సహాయం అందే అవకాశాలున్నాయని ఆయన వివరించారు.




సిఎం చంద్రబాబు సమక్షంలో ప్రభుత్వానికి, రాపిడోకు మధ్య ఒప్పంద దృశ్యం

# రాపిడోతో రాష్ట్ర పర్యాటక శాఖ జోడీ

## దేశంలోనే తొలిసారిగా డ్రైవర్ కం గైడ్ సేవలు.. త్వరలోనే విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో ప్రారంభానికి సన్నాహాలు

**విజయవాడ,నవంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** పర్యాటకులకు ఆంధ్రప్రదేశ్ అందాలను మరింత చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాపిడో సంస్థ సహకారంతో దేశంలోనే తొలిసారిగా డ్రైవర్‌కం గైడ్ విధానాన్ని ఏపీ పర్యాటక శాఖ ఆవిష్కరించింది. సీఎం చంద్రబాబునాయుడు, పర్యాటక మంత్రి కందుల దుర్గేష్, ఏపీటీడీసీ ఛైర్మన్ నూకసాని బాలాజీ, పర్యాటక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్, టూరిజం ఎండీ, ఏపీటీఏ సీఈవో ఆమ్రపాలి మరియు రాపిడో సహవ్యవస్థాపకుడు పవన్ గుంటుపల్లి సమక్షంలో ఏపీ ప్రభుత్వానికి, రాపిడోకు మధ్య ఇటీవల విశాఖలో జరిగిన సిఐఐ సదస్సులో కుదిరిన ఒప్పందం మేరకు ఈ సేవలను అందుబాటులోకి తెస్తున్నట్లు ఏపీ పర్యాటక శాఖ గురువారం పర్యాటక శాఖా మంత్రి కందుల దుర్గేష్ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఎంఓయూ ద్వారా రాపిడోలో మంచి రేటింగ్ ఉన్న డ్రైవర్లను ఎంపిక చేసి, వారికి రాష్ట్ర చరిత్ర, సంస్కృతి, ఆతిథ్యం, భద్రతపై వచ్చే నెల నుంచి పర్యాటక శాఖ ప్రత్యేక శిక్షణ ఇవ్వనుంది. ఈ కార్యక్రమం భారతదేశంలోనే మొట్టమొదటి కార్యక్రమం కాగా, ప్రపంచవ్యాప్తంగా అరుదైన కార్యక్రమాల్లో ఒకటిగా నిలవనుందని ప్రకటనలో పేర్కొన్నారు. త్వరలోనే విజయవాడ, తిరుపతి, విశాఖపట్నంలో ఈ సేవలు ప్రారంభించనుంది. రాపిడో యాప్‌లోనే టూరిస్ట్ ఆటోలు/క్యాబ్‌లు, పర్యాటక సర్క్యూట్ల వివరాలు అందుబాటులో ఉంటాయి. విమానాశ్రయాలు, రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లలో పర్యాటకుల సౌకర్యార్థం ప్రత్యేక కోబ్రాండెడ్ హెల్ప్ డెస్క్‌లను ఏర్పాటు చేసి పర్యాటక సేవలను సులభతరం చేయనుంది. దీనివల్ల క్యాబ్, ఆటో డ్రైవర్లకు ఆదాయం కూడా పెరుగుతుంది. టెక్నాలజీ సాయంతో పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్‌షిప్ విధానంలో చేపడుతున్న ఈ ప్రాజెక్ట్, పర్యాటక రవాణాలో దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని పర్యాటక శాఖ అధికారులు పేర్కొన్నారు.

# అవమానకర ఉద్యోగ హోదాలకు స్వస్తి

## - గౌరవప్రదమైన హోదా పేర్లు సూచించాలంటూ ప్రభుత్వ ఉత్తర్వులు

**విజయవాడ,నవంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రస్తుత కాలానికి అనుగుణంగా లేని... అవమానకరంగా, విపక్ష చూపేలా ఉన్న ఉద్యోగుల హోదాల పేర్లు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించిన స్థానిక సంస్థలు,కార్పొరేషన్లు ఉన్న ఉద్యోగుల హోదాల పేర్లు మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది.స్థానిక సంస్థలు, కార్పొరేషన్లు, బోర్డులు,ప్రభుత్వ శాఖల్లో ఇప్పటికే ఫజట్టర్, చౌకీదార్, మసాల్చి, స్కావెంజర్, స్వీపర్ కంచౌకీదార్, హెల్పర్, అటెండర్, ప్లంబర్, ట్రైనర్, క్లీనర్, బట్లర్,దోభీ, మాలి,గేట్ కీపర్, ప్యాకర్, బోయ్,జూనియర్ వాచ్‌మెన్, హెడ్ యానిమల్ కీపర్,బ్లాక్స్మిగ్, బుకింగ్ క్లర్క్, లేబరర్ తదితర పేర్లు ఉన్నాయి. ఉద్యోగుల గౌరవాన్ని దృష్టిలో ఉంచుకొని ఆయా పేర్లు మార్చాలని ప్రభుత్వం నిర్ణయిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఆర్టికల్ 21 ప్రకారం,సుప్రీంకోరుట తీర్పులను అనుసరించి అందరికి గౌరవంగా జీవించే హక్కు ఉన్నందున,ప్రభుత్వ నియామకాల్లో ఇలాంటి పేర్లను కొనసాగించడం రాజ్యాంగ విలువలకు, ఆధునిక పరిపాలన సూత్రాలకు విరుద్ధమని ప్రభుత్వం ఆ ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇందుకను గుణంగా గౌరవప్రదమైన కొత్త హోదా పేర్లు సూచిస్తూ వారం రోజుల్లో సంబంధిత శాఖలు పంపాలని పేర్కొంది. అన్ని శాఖల ప్రతిపాదనలు క్రోడీకరించి రాష్ట్రప్రభుత్వ బిజినెస్ రూల్స్ 2018 ప్రకారం మొత్తం పేర్ల మారుప ప్రక్రియను,నాలుగు వారాల్లో పూర్తి చేయాలని సిఎస్ ఆ ఉత్తర్వులో పేర్కొన్నారు.

# రైతులకు రూపాయి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు : మంత్రి నాదెండ్ల మనోహర్



**విజయవాడ, నవంబర్ 27,ప్రభాతవార్తప్రతినిధి:** రైతులకు రూపాయి నష్టం లేకుండా ధాన్యం కొనుగోలు చేస్తున్నామని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. గురువారం మంత్రి నాదెండ్ల మీడియాతో మాట్లాడుతూ.. 24 గంటల్లో వారి ఖాతాల్లో డబ్బులు వేస్తున్నామని.. అయినా వైసీపీ నేతలు అన్యాయంగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. రూ.1674 కోట్లు బకాయిలు పెట్టి పారిపోయిన వైసీపీ నేతలా రైతుల పక్షాన మాట్లాడేది అంటూ ఫైర్ అయ్యారు. ఇప్పటి వరకు 8 లక్షల 22 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించామని వెల్లడించారు. కృష్ణా జిల్లాలో లక్షా 7 వేల టన్నుల ధాన్యం సేకరించడం రికార్డ్ అని తెలిపారు. గోదావరి జిల్లాల నుంచి లక్ష టన్నుల పైనే ధాన్యం సేకరించామని చెప్పారు. అధికారులు రేయింబవళ్లు కష్టపడి పని చేస్తున్నారని.. వారి మనోధైర్యం దెబ్బ తీసేలా వైసీపీ నేతలు నోటికొచ్చినట్లు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కృష్ణా జిల్లాలో 202223 ఖరీఫ్‌లో కేవలం 13వేల 560 మెట్రిక్ టన్నులు ధాన్యం మాత్రమే కొనుగోలు చేశారని.. 202324లో 16 వేల 978 మెట్రిక్ టన్నులు మాత్రమే కొన్నారని తెలిపారు. తాము మాత్రం లక్షా 7 వేల 960 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని చెప్పుకొచ్చారు. ఖరీఫ్, రబీలో కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లా, ఏలూరు జిల్లాల్లో ట్రాన్స్ పోర్టు వాహనాల బకాయిలు నేడు రూ.9 కోట్లు చెల్లించామని మంత్రి చెప్పారు. 7 కోట్ల 53 లక్షల గోనె సంచులను ఏర్పాటు చేశామన్నారు. సీఎం సూచనలతో లక్ష సంచులు అదనంగా సిద్ధంగా ఉంచామని తెలిపారు. మూడు నెలల్లో జరగాల్సిన ప్రక్రియ.. వాతవరణంలో వచ్చిన మార్పులతో ముందే ధాన్యం సేకరించామని చెప్పుకొచ్చారు. రైతుల ఆందోళనను గుర్తించి.. ప్రభుత్వం చాలా వేగంగా స్పందించిందన్నారు. రైతులు కూడా అర్థం చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నుంచి ఇంత పెద్ద కార్యక్రమం చేస్తున్నామంటే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఇచ్చే సూచనలు, ప్రోత్సాహం వల్లే అని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నిబంధనల మేరకు 51 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి తాము సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. కొంతమంది మాఫియాగా ఏర్పడి రైతులను ఇబ్బందులు పెట్టడానికి వారి స్వలాభం కోసం డ్రామాలు ఆడుతున్నారని మండిపడ్డారు. తాము పూర్తి పారదర్శకత కోసం వాహనాలకు జీపీయస్ ఏర్పాటు చేస్తే.. దళారులు రైతులను మాయ మాటలతో మోసం చేస్తున్నారన్నారు. 75 కిలోల బస్తాకు 1792 రూపాయల మద్దతు ధర తాము ఇస్తామని ప్రకటిచాంరు. 30 వ తేదీ వరకు ఏపీలో వర్షాలు లేవని.. ఆ తర్వాత ఐదు జిల్లాల్లో వర్ష సూచనలు ఉన్నాయన్నారు. కృష్ణా, పశ్చిమ గోదావరి, ఏలూరు, బాపట్ల, గుంటూరు జిల్లాల్లో ఒకటో తేదీ నుంచి ఐసోలేషన్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. దళారులు చేసే మోసాలు నమ్మవద్దని.. వారిని తరిమికొట్టాలని రైతులను కోరారు. 24 వేల ట్రక్స్.. ధాన్యం తరలింపుకు జీపీయస్‌తో సిద్ధంగా ఉన్నాయన్నారు.

# పలాసలో రోడ్డు ప్రమాదం ఇద్దరు యువకుల మృతి

**పలాస (శ్రీకాకుళం జిల్లా), నవంబర్ 27 ప్రభాతవార్త** పలాస మండలం గరుడఖండి గ్రామ సమీప పాత జాతీయ రహదారిపై గురువారం సాయంత్రం రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఎదురెదురుగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొనడంతో ఈ ఘటన చోటు చేసుకుందని స్థానికులు తెలిపారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు ఘటన స్థలంలో మృతి చెందగా మరో యువకుడు తీవ్ర గాయాలు పాలయ్యారు. కాశీబుగ్గ ఎస్సై నరసింహమూర్తి ఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం పలాస ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేశారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చేసిన ప్రాథమిక ధర్యాప్తు ప్రకారం మృతులు పాతపట్నం మండలం సరళి గ్రామానికి చెందిన తలగాపు భీమారావు, తలగాపు వేణుగా గుర్తించారు. తీవ్రంగా గాయపడిన యువకుడు సుశాంత్ (23) ఒడిస్సా రాష్ట్రం గజపతి జిల్లా ఆర్ ద్రమగిరి బ్లాక్ దేరబా గ్రామానికి చెందిన యువకునిగా గుర్తించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# మూడవ ప్రపంచ తెలుగు మహా సభలకు హాజరుకానున్న సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ

## - ఆంధ్ర సారస్వత పరిషత్తు అధ్యక్షుడు డా.గజల్ శ్రీనివాస్



**విజయవాడ,నవంబరు 27,ప్రభాత వార్తప్రతినిధి:** ఆంధ్ర సారస్వత పరిషత్తు ఆధ్వర్యంలో 3,4,5 జనవరి 2026 లో గుంటూరు శ్రీ సత్య సాయి స్పిరిచువల్ సిటీ ప్రాంగణంలో జరుగనున్న మూడవ వ ప్రపంచ తెలుగు మహా సభలకు భారత సుప్రీం కోర్టు సీనియర్ న్యాయమూర్తి జస్టిస్ పమిడిఘంటం శ్రీ నరసింహ హాజరు కానున్నారని, వారిని ఢిల్లీ లో వారి గృహంలో కలసి ఆహ్వానించామని, వారు 3 జనవరి 2026 తెలుగు మహా సభల ప్రారంభోత్సవానికి వారు సతీ సమేతంగా హాజరు కానున్నట్లు వారు తెలిపారని పరిషత్తు అధ్యక్షులు డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు. తెలుగు భాషను అజరామరం చేయడానికి అన్ని సంస్థలు కలసిపని చేయాలని, సంస్థాగతమైన వ్యవస్థను ఏర్పరచుకొని మాతృభాష తెలుగును ఉద్యమ స్ఫూర్తిగా రాబోయే తరాల వారికి అందించేటట్లు అందరూ పని చేయాలని జస్టిస్ శ్రీ నరసింహ అభిప్రాయ పడ్డారని డా.గజల్ శ్రీనివాస్ తెలిపారు.

# తిరుమల సమాచారం

## స్వామివారి ఆశీస్సులందుకున్నాం

### - తెలంగాణ జడ్జి నగేశ్‌బీమపాక



**తిరుమల,నవంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** కలియుగప్రత్యక్షదైవం శ్రీవేంకటేశ్వరస్వామిని దర్శించుకోవడం ఆనందంగా ఉందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టీస్ నగేశ్ బీమపాక తెలిపారు. గురువారం ఉదయం విఐపి బ్రేక్‌లో ఆయన కుటుంబసభ్యులతో కలసి ఆలయంలోనికి చేరుకుని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు తీర్థప్రసాదాలు అందజేశారు.

## యాంకర్ శివజ్యోతిపై చర్యలు లేవు

**తిరుమల,నవంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** ఇటీవల తిరుమలకు వచ్చి శ్రీవారి దర్శనార్థం క్యూలైన్లో ఉన్న యాంకర్ శివజ్యోతి అన్నప్రసాదాలపై కాస్ట్లీ బిక్షగాళ్ళనే వ్యాఖ్యలు చేసిన విషయం విదితమే. దీనిపై టిటిడి తప్పుపడుతూ ఆమెపై చర్యలకు ఉపక్రమించేలా చూసింది. అయితే ఏకంగా ఆమె ఆధార్‌కార్డును తిరుమల దర్శనాలకు నిషేధం విధించిందనే పుకార్లు టిటిడి ఖండించింది. ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపింది.

## గొంతుకోసుకుని తిరుమలలో అన్యమతస్తుడు ఆత్మహత్యాయత్నం

**తిరుమల,నవంబర్ 27ప్రభాతవార్తప్రతినిధి:** చాకుతో గొంతు,కడుపుపై కోసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన గురువారం మధ్యాహ్నం తిరుమలలో భక్తులు,స్థానికుల సంచారం ఉండే ఆర్‌బి సెంటర్‌సమీపంలో జరిగింది. మానసికంగా బాధపడుతున్నట్లు తెలుస్తోంది. అతను ఒక్కసారిగా చాకుతో గొంతు కోసుకున్నాడు. ఆ తరువాత కడపులోకి గుచ్చుకున్నాడు. దీంతో పొట్టలోని మొత్తం బయటపడింది. పదునైనా చాకుతో ఈ దారుణానికి ఒడిగట్టాడు. అతని కుడిచేతిపై అన్యమతంకు సంబంధించి గుర్తు (శిలువ)ఉన్న పచ్చబొట్టు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. స్థానికుల సమాచారంతో తిరుమల 2టౌన్ పోలీసులుఅక్కడకు చేరుకుని అతనిని తొలుత అశ్వినీ ఆస్పత్రికి ఆ తరువాత తిరుపతి రుయాకు తరలించారు. అయితే అతని వద్ద ఎలాంటి వివరాలు, ఆధారాలు లేవని పోలీసులు తెలిపారు. కుటుంబసమస్యలుగానీ, మానసికంగా ఇలా చేసుకునిఉంటాడనేది పోలీసులు సమాచారం.

# ప్రభుత్వ కార్యక్రమాల కార్యాచరణపై కలెక్టర్లకు సిఎస్ కీలకాదేశాలు

**విజయవాడ,నవంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆర్టీజీఎస్,పాజిటివ్ పబ్లిక్ పెరస్పన్, డాక్యుమెంట్ అప్లోడ్ ఫర్ ఏజెంట్ స్పేసరాష్ట్రంలో ధాన్యం కొనుగోలు, అంశాలపై జిల్లా కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ గురువారం ఎపి సచివాలయం నుండి వీడియో సమావేశం నిర్వహిస్తున్నారు. ఈసమావేశంలో ముందుగా ధాన్యం సేకరణపై సిఎస్ విజయానంద్ మాట్లాడుతూ బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన నేపధ్యంలో రానున్న నాలుగు రోజుల్లో దక్షిణ ఆంధ్రప్రదేశ్ కు సంబంధించి నెల్లూరు, తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, సత్యసాయి,కడప జిల్లాలు సహా మిగతా కోస్తా జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని కావున కలెక్టర్లు ఎక్కడా ధాన్యం తడవకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.దీనిపై రైతులను అప్రమత్తం చేసి ఎక్కడా ధాన్యం తడవకుండా చూడాలని చెప్పారు.ధాన్యం తడిసి పోయి మాయిశ్చర్ శాతం పెరిగిందనే ఫిర్యాదు రాకూడదని స్పష్టం చేశారు.ఈకారణంతో రైతులు తక్కువ ధరకు ధాన్యాన్ని బయట విక్రయించినట్టు ఫిర్యాదులు వస్తే సంబంధిత జాయింట్ కలెక్టర్ బాధ్యత వహించాల్సి ఉంటుందని సిఎస్ స్పష్టం చేశారు. ధాన్యం కొనుగోలుకు ప్రణాళిక చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలన్ని వెంటనే ప్రారంభించాలన్నారు.గన్నీ బ్యాగులు,టార్పాలిన్లు కొరత లేకుండా చూసుకోవాలన్నారు. అనంతం మిగతా అజెండా అంశాలపై సమీక్షిస్తున్నారు. ఈసమావేశంలో సాంఘిక,గిరిజన సంక్షేమ శాఖల కార్యదర్శి యం.యం.నాయక్,ఐఅండ్పిఆర్ డైరెక్టర్ కెఎస్ విశ్వనాధన్, ప్రణాళికా శాఖ జెఎస్ అనంత శంకర్, సివిల్ సప్లైస్ డైరెక్టర్ గోవింద రావు తదితర అధికారులు పాల్గొన్నారు.అలాగే వర్చువల్ గా వ్యవసాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బి.రాజశేఖర్,సియం కార్యదర్శి ఎవి రాజమోళి,సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఎండి ఢిల్లీ రావు, వివిధ జిల్లాల కలెక్టర్లు ఇతర అధికారులు పాల్గొన్నారు.

# భార్యని చంపిన భర్తకు జీవిత కాల జైలుశిక్ష

## ఎస్పి కె.వి మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, నవంబర్ 27 ప్రభాతవార్త:** భార్యను హతమార్చిన కేసులో ముద్దాయి (జీరు వెంకట రమణ)కి శ్రీకాకుళం మొదటవ అదనపు న్యాయస్థానం జడ్జి పి.భాస్కరరావు జీవిత ఖైదు శిక్షను విధించారని శ్రీకాకుళం జిల్లా ఎస్పీ కేవీ మహేశ్వర్ రెడ్డి తెలిపారు. కర్ణపు నీలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు జీరు వెంకట రమణ తన భార్య జీరు రమణమ్మ (24) వేరొకరితో అక్రమ సంబంధం పెట్టుకుందనే అనుమానంతో ఒక సంవత్సరంగా ఆమె తన కన్న వారి ఇంటిలో నివసిస్తుంది. అనంతరం వెంకటరమణ తండ్రి మరణంతో, అంత్యక్రియల నిమిత్తం భార్య జీరు రమణమ్మ ఇంటికి వచ్చినది. అదే రోజున సాయంత్రం 17.30 గంటలకు బాణం గ్రామంలోని వెంకటరమణ ఇంటి వద్ద వెంకటరమణ మరియు రమణమ్మల మధ్య వాగ్వాదం జరిగి, ఆమె 'తనతో కలిసి ఉండను' అని స్పష్టం చేయడంతో, ఆగ్రహంతో ముద్దాయి పదునైన కత్తితో ఆమె మెడపై విచక్షణా రహితంగా దాడి చేయగా, ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్లు ఫిర్యాదులో పేర్కొనబడింది. ఈ మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు అధికారి అయిన అప్పటి సిఐ, జేఆర్‌పురం సర్కిల్ వై.రామకృష్ణ దర్యాప్తు పూర్తి చేసి కోర్టులో ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. తరువాత ముద్దాయి బెయిల్‌పై విడుదలై కొన్ని వాయిదాలకు హాజరై, అనంతరం గత ఐదేళ్లుగా కోర్టుకు హాజరు కాకపోవడంతో జిల్లా మొదటి అదనపు జడ్జి కోర్టు శ్రీకాకుళం వారు ముద్దాయిపై నాన్ బెయిల్‌బుల్ వారంట్ జారీ చేశారు. శ్రీకాకుళం ఎస్పీ కెవి మహేశ్వర రెడ్డి ఆదేశాల మేరకు, శ్రీకాకుళం పట్టణ డిఎస్పి సూచనలు మేరకు ఆందోళన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో ప్రత్యేక టీం ఏర్పాటు చేసి ముద్దాయి ఉన్నచోట విచారణ జరిపి, గుంటూరు పట్టణంలో అతడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. అనంతరం కోర్టులో హాజరుపరచగా కోర్టు జ్యుడిషియల్ రిమాండ్ విధించింది. తదుపరి కోర్టు కేసును త్వరితగతిన విచారణ కోసం ట్రయల్ షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నేపథ్యంలో ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్, ఆమదాలవలస సర్కిల్ మరియు ఎస్సై, పొందూరు పోలీస్ స్టేషన్ వారు సమన్వయంతో సాక్షులను పక్కాగా హాజరుపరిచారు. ఈ కేసులో పబ్లిక్ ప్రాసిక్యూటర్ కింజరాపు శ్రీనివాసరావు వాదనలు వినిపించగా, కోర్టు ట్రయల్‌ను వేగవంతంగా పూర్తి చేసింది. తీర్పు ప్రకారం ముద్దాయిపై నేరాలు పూర్తిగా రుజువు కావడంతో సెక్షన్ 302 ఐపీసీ, సెక్షన్ 498-ఎ ఐపీసీ క్రింద జీవిత ఖైదు శిక్షతో పాటు రూ.2,000/ జరిమానా విధిస్తూ, గురువారం మొదటి అదనపు జిల్లా జడ్జి పి.భాస్కరరావు తీర్పు వెలువరించారు. జిల్లాలో తీవ్రమైన నేరాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవడమే కాకుండా, ఇలాంటి కేసుల్లో చట్టపరమైన చర్యలను వేగవంతం చేసేందుకు పోలీసులు కృషి చేస్తున్నట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.

# భవిష్యత్ అవసరాలకు తగినట్లుగా రాష్ట్రంలో విద్యుత్ ప్రాజెక్టులు :మంత్రి గొట్టిపాటి రవికుమార్

**విజయవాడ,నవంబరు 27,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో పెద్దఎత్తున జరుగుతున్న పారిశ్రామిక అభివృద్ధికి బాసటగా విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రాజెక్టులు వేగవంతం చేయాలని ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. గురువారం నాడు తాడేపల్లి లోని క్యాంప్ కార్యాలయంలో ఏపీ ట్రాన్స్ కో, ఏపీఎస్పీడీసీఎల్ కు చెందిన ఉన్నతాధికారులతో మంత్రి గొట్టిపాటి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో జరుగుతున్న ట్రాన్స్ మిషన్, డిస్ట్రిబ్యూషన్ ప్రాజెక్టుల నిర్మాణాలు, పనితీరుపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కొత్త పరిశ్రమల స్థాపన, తయారీ యూనిట్ల విస్తరణ, పారిశ్రామిక కారిడార్ల అభివృద్ధి శరవేగంగా జరుగుతున్న నేపథ్యంలో...



పెరుగుతున్న విద్యుత్ డిమాండ్, భవిష్యత్ విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులకు మంత్రి గొట్టిపాటి ఆదేశించారు. రాష్ట్రంలో ఏర్పాటు కానున్న పరిశ్రమలకు మౌలిక వసతుల కల్పనలో భాగంగా ముఖ్యమైన విద్యుత్ ను అందించేలా చర్యలు చేపట్టాలని అన్నారు. భవిష్యత్తు విద్యుత్ లోడ్‌ను దృష్టిలో ఉంచుకుని, పరిశ్రమలతో పాటు గృహ వినియోగదారులు, వ్యవసాయ రంగానికి నాణ్యమైన, నిరంతర విద్యుత్ సరఫరా అందేలా విద్యుత్ సంస్థలు ముందుగానే సిద్ధం కావాలని ఆయన సూచించారు. భవిష్యత్‌లో పెరుగనున్న విద్యుత్ అవసరాలను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అవసరమైన అన్ని చర్యలను చేపట్టేందుకు సీఎం చంద్రబాబు నాయుడు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని మంత్రి గొట్టిపాటి స్పష్టం చేశారు. నాణ్యమైన విద్యుత్ సరఫరాలో ఏ విధమైన ఆటంకాలు లేకుండా ఉండేందుకు 132 కేవీ, 220 కేవీ, 400 కేవీ సామర్థ్యాలతో 29 కొత్త ఉప కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ ఉప కేంద్రాలు గ్రిడ్‌ను మరింత బలోపేతం చేయడంతో పాటు నిరంతర విద్యుత్ సరఫరాకు కీలకంగా నిలుస్తాయని ఆశాభావంవ్యక్తం చేశారు.

# విజయవాడ జిజిహెచ్‌లో కేన్సర్ లీనాక్ పరికరం ఏర్పాటు : మంత్రి సత్యకుమార్‌యాదవ్

**నవంబరు27,ప్రభాతవార్తప్రతినిధి:** విజయవాడ ప్రభుత్వ సర్వజనాస్పత్రి (జీజీహెచ్) లో క్యాన్సర్ చికిత్సకు సంబంధించిన లినాక్ పరికరం ఏర్పాటుకు అన్ని స్థాయిల్లో కృషి జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జి మంత్రి,హెల్త్ మినిస్టర్ సత్యకుమార్ యాదవ్ స్పష్టం చేసారు.ఆస్పత్రిలో సేవల వినియోగం బాగా పెరిగిందన్నారు. విజయవాడలోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేటు కార్యాలయంలో విజయవాడ లోక్ సభ సభ్యులు కేశినేని శివనాథ్, నగర ఎమ్మెల్యేలు బొండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహనరావులతో మంత్రి సత్యకుమార్ గురువారం ప్రత్యేకంగా సమావేశమై విజయవాడలోని జీజీహెచ్ అభివృద్ధి గురించి చర్చించారు.విజయవాడ ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి(జీజీహెచ్)లో క్యాన్సర్ వైద్య సేవలు మరింత మెరుగుపరిచే చర్యల్లో భాగంగా లీనాక్ (లీనియర్ యాక్సిలరేటర్) పరికరాన్ని అందుబాటులోనికి తెచ్చేందుకు అవసరమైన ప్రతిపాదనలు తయారు చేయాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రిసత్యకుమార్ యాదవ్ ఉన్నతాదికారులను ఆదేశించారు. ఎన్టీఆర్ జిల్లా ఇంచార్జి మంత్రిగా ఉన్న సత్యకుమార్‌తో ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ క్యాన్సర్ వెద్య సేవల్లో ముఖ్యమైన లినాక్ పరికరాన్ని విజయవాడ జీజీహెచ్ లో అందుబాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. దీనిపై మంత్రి సత్యకుమార్ స్పందిస్తూ క్యాన్సర్ కేసులను ప్రాథమిక దశలోనే గుర్తించి, ఉన్నత వైద్యం అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. విజయవాడ జీజీహెచ్లో లినాక్ ఏర్పాటుకు అవసరమైన స్థలం గుర్తింపు, ప్రభుత్వ రంగ సంస్థల నుంచి (సామాజిక బాధ్యత) ఆర్థిక సహకారం అందేందుకు ఉన్న మార్గాలను పరిశీలించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాలని చర్చల్లో పాల్గొన్న డైరెక్టరేటు ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ అధికారులను మంత్రి ఆదేశించారు.



విజయవాడ కలెక్టరేట్‌లో ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో సమావేశమైన మంత్రి సత్యకుమార్

## రైతుల కోసం కార్యక్రమం కూటమి చేపట్టిన డ్రామా: డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట, నవంబర్ 27 ప్రభాతవార్త : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం చేపట్టిన రైతుల కోసం కార్యక్రమం ఒక పెద్ద డ్రామా షో అని పల్నాడు జిల్లా వైసీపీ వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. స్థానిక గుంటూరు రోడ్డులోని వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన ఈ రెండు సంవత్సరాలలో రైతులకు ఏమి చేయలేదన్నారు. ఈ ప్రభుత్వం రైతన్న కోసం పేరుతో రైతుల ముందుకు వెళ్ళటానికి ప్రయత్నించడం హాస్యాస్పదమన్నారు. పండించిన ఏ పంటకు ఈ ప్రభుత్వ హయాంలో గిట్టుబాటు ధర లేదని అరటి, మామిడి పంటలను కొనేనాధుడు లేక రైతులు రోడ్ల మీద పడేసే పరిస్థితి నెలకొందన్నారు. గతంలో మొక్కజొన్న పంటకు 2,200 కొనుగోలు ధర లభిస్తే ప్రస్తుతం కేవలం 1600 తో సరిపెట్టుకునే పరిస్థితి ఉందన్నారు. ఎన్నికలకు ముందు అన్నదాత సుఖీభవ పథకం ద్వారా ప్రతి రైతుకు కేంద్రంతో పని లేకుండా 20,000 ఇస్తామన్న ఈ ప్రభుత్వం రెండు సంవత్సరాల కాలంలో కేవలం 10000 రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకుందని అన్నారు. తక్షణమే నరసరావుపేట మార్కెట్ యార్డ్ లో సీసీ కేంద్రాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేశారు. మొందా తుఫాను లో పల్నాడు జిల్లాలో వ్యవసాయ శాఖ అధికారులు పర్యటించి 55 ఎకరాల పత్తి పంట నష్టం జరిగిందని అంచనా పంపిస్తే, ఈ ప్రభుత్వం తిరిగి లాం వ్యవసాయ శాస్త్రవేత్తలతో పరిశీలన చేయించిఒక్క ఎకరా కూడా పంట నష్టం జరగలేదని, కేవలం 3000 హెక్టార్లు మాత్రమే నష్టం జరిగిందని ప్రకటించిన అన్నారు. పంట నష్టం జరిగిన ప్రాంతాల్లో కనీసం ఈ ప్రభుత్వం ఎన్యుమరేషన్ కూడా చేయలేదన్నారు. ఈ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పేరుతో ఒక డ్రామా, రాజధాని నిర్మాణం పేరుతో ఒక డ్రామా ఆడుతూ ఇప్పుడు రైతన్న కోసం పేరుతో రైతాంగాన్ని మోసం చేసే కార్యక్రమం చేస్తున్నారని విమర్శించారు. కేవలం నాలుగు వేల ఎకరాల పత్తి పంటకు తప్ప మిగతా ఏ పంటకు డ్యామేజ్ కాలేదని ఒక రూపాయి కూడా ఇవ్వలేదన్నారు. రైతన్న కోసం పేరుతో ఒక కంటి తుడుపు కార్యక్రమాన్ని ఈ ప్రభుత్వం నిర్వహిస్తూ రైతులను తిరిగి మోసం చేసే ప్రయత్నం చేస్తున్నారని పేర్కొన్నారు. వైసీపీ అధినేత వైయస్. జగన్మోహన్ రెడ్డి మొన్న పులివెందులలోని అరటి తోటలు పరిశీలించి మా ప్రభుత్వం వచ్చాక న్యాయం చేస్తామని తెలియజేశారన్నారు. రైతులను ఆదుకునేది కేవలం వైసీపీనే అని తెలిపారు.




## ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ 57వ వార్షికోత్సవం



గురజాల, నవంబరు 27 ప్రభాతవార్త : దేశంలో ప్రముఖ వ్యవసాయ ఉత్పత్తుల తయారీ సంస్థ ఏరీస్ ఆగ్రో లిమిటెడ్ కంపెనీ స్థాపించి 56 సంవత్సరాలు పూర్తి చేసుకొని 57వ వసంతంలో అడుగిడుతున్న సందర్భంగా గురువారం ఆ కంపెనీ ప్రతినిధులు వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని పాతపాటేశ్వరి అమ్మవారి ఆలయం, ఆనిగ్రేస్ వృద్ధాశ్రమంలో అన్నదానం చేశారు. ఏరీస్ కంపెనీ ఉత్పత్తులు వినియోగించే పొలాల్లో అధిక దిగుబడి వస్తుందని, రైతు సుభిక్షంగా ఉండడమే కంపెనీ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఈ కార్యక్రమంలో అమరయ్య, రాజేష్, శ్రీనివాసరావు, రామిరెడ్డి, వేణుగోపాలరెడ్డి పాల్గొన్నారు.

## బ్లాక్ స్పాట్లను పరిశీలించిన అధికారులు



గురజాల, నవంబరు 27 ప్రభాతవార్త : జిల్లా ఎస్పీ ఉత్తర్వుల మేరకు రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా గురువారం పట్టణ సీఐ భాస్కర్, మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ శేషురెడ్డిలు ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్ స్పాట్‌లను పరిశీలించారు. ప్రమాదాల నివారణకు రంబుల్ స్ట్రిప్స్, స్పీడు బ్రేకర్లు నిర్మించేందుకు నిర్ణయం తీసుకున్నారు.

## పాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్లపై సమీక్షా సమావేశం

గురజాల, నవంబరు 27 ప్రభాతవార్త : పట్టణంలో ఈనెల 30 నుంచి డిసెంబర్ 5వ తేదీ వరకు నిర్వహించనున్న శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలపై గురువారం ఆర్డీవో మురళీకృష్ణ తన కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. శానిటేషన్, శాంతి భద్రతలను కాపాడడం, అల్లర్లు చెలరేగకుండా చూడడం వంటి వాటిపై చర్చించారు. ఈ సమావేశంలో డీఎస్పీ జగదీష్, తహసీల్దార్ దుర్గేష్, సీఐ భాస్కర్, ఏవో పూర్ణచంద్రరావు తదితరులు పాల్గొన్నారు.



## వేంకటేశ్వరస్వామి దేవస్థాన కళ్యాణ మండపంకు శంకుస్థాపన



గురజాల, నవంబరు 27 ప్రభాతవార్త : గురజాల నగర పంచాయతీ పరిధిలోని జంగమహేశ్వరపురంలో పల్నాడు తిరుమలగా ప్రసిద్ధి చెందిన శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో కళ్యాణ మండపం ఏర్పాటుకు గురువారం శంకుస్థాపన జరిపారు. ఈ కార్యక్రమంలో పోలు పవన్మయి వీరారెడ్డి, ఇష్టకామారెడ్డి, పోలా సతీష్, తెట్టా ప్రసాద్ మాస్టార్ దంపతులచే వేద పండితులు పూజా కార్యక్రమాన్ని నిర్వహించి శంకుస్థాపన జరిపించారు.

## చేనేత హస్తకళ ప్రదర్శన



గురజాల, నవంబరు 27 ప్రభాతవార్త : పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా స్థానిక కారంపూడి రోడ్డులో గల శ్రీనివాస ఫంక్షన్ హాలులో చేనేత హస్తకళ ప్రదర్శన, అమ్మకాలను గురువారం సీఐ భాస్కర్‌రావు ప్రారంభించారు. ఈ ప్రదర్శన డిసెంబరు 11వ తేదీ వరకు ఉంటుందని నిర్వాహకుడు రంగస్వామి తెలిపారు.

## వెంకట నరసయ్య హత్య కేసులో నిందితులకు యావజ్జీవం

గురజాల, నవంబరు 27 ప్రభాతవార్త : పల్నాడు జిల్లా కారంపూడి మండలం పేటసన్నిగండ్లలో 2016 జూలై 19వ తేదీన జరిగిన చప్పిడి వెంకట నరసయ్య హత్య కేసులో నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ 5వ అదనపు జిల్లా జడ్జి ప్రియదర్శిని గురువారం తీర్పును వెలువరించారు. పేటసన్నిగండ్ల గ్రామానికి చెందిన చప్పిడి వెంకటేశ్వర్లు తన కుమారుడు వెంకటనరసయ్య, కుమార్తె ఆదిలక్ష్మి, కాలి యేసురత్నంతో కలిసి 2016 జూలై 19వ తేదీన తన పొలంలో వ్యవసాయ పనులు చేస్తున్నారు. అదే సమయంలో వెంకటేశ్వర్లు అన్న మల్లయ్య కుమారులు చప్పిడి అంజయ్య, శంకర్, నరసింహారావు, అయ్యప్పలు తమ ట్రాక్టర్‌లో ఆ పొలానికి వెళ్లి గొడ్డలి, వేట కొడవళ్లతో వెంకటనరసయ్యపై విచక్షణ రహితంగా దాడి చేసి హతమార్చారు. అడ్డుకోబోయిన వెంకటేశ్వర్లు మీదపై వేటకొడవలితో దాడి చేసి గాయపరిచారు. గాయాలపాలైన వెంకటేశ్వర్లు గురజాల పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందుతూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి కారంపూడి ఎస్ఐ నారాయణస్వామి కేసు నమోదు చేశారు. గురజాల సీఐ అలహరి శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేసి 2016 ఆగస్టు 8వ తేదీన నిందితులను అరెస్ట్ చేశారు. ఈనెల 17వ తేదీన పేటసన్నిగండ్ల గ్రామ శివారులోని ఎన్ఎస్పీ కాలువలో పడి నాలుగో నిందితుడైన అయ్యప్ప మృతిచెందారు. దీంతో మిగిలిన ముగ్గురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష, రూ. 1000 జరిమానాతోపాటు రెండో నిందితునికి పదేళ్ల జైలు శిక్ష రూ. 500 జరిమానా విధిస్తూ 5వ అదనపు జిల్లా జడ్జి జి ప్రియదర్శిని గురువారం తీర్పును వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరుపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుర్రా నాగరాజు వ్యవహరించారు.




## ఎస్ఆర్ఎంలో అధునాతన ఆసుపత్రి

మంగళగిరి, నవంబర్ 27, ప్రభాతవార్త : ఏపీ ఎస్ ఆర్ ఎమ్ యూనివర్సిటీలో అధునాతన సౌకర్యాలతో నూతనంగా ఏర్పాటు చేసిన మెడికల్ సెంటర్ ( ఆస్పత్రి )ను గురువారం వైస్ ఛాన్సలర్ ఆచార్య సిహెచ్ సతీష్ కుమార్ ప్రారంభించారు. విద్యార్థులు, ప్రొఫెసర్లు ఉద్యోగులకు 24 గంటలు అందుబాటులో ఉండేలా ఐదుగురు వైద్యులను ఏర్పాటు చేశారు. పీడియాట్రీషియన్ తో పాటు ఐదుగురు వైద్యులు నిత్యం అందుబాటులో వైద్య సేవలు అందించనున్నారని వైస్ ఛాన్సలర్ సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఏడుగురు శిక్షణ పొందిన నర్సింగ్ ఉద్యోగులు కూడా అత్యవసర వైద్య సేవలను అందించనున్నారని పేర్కొన్నారు. ఇప్పటివరకు రెండు పడకల ఆసుపత్రిగా ఉన్న మెడికల్ సెంటర్ ను ఎనిమిది పడకల ఆసుపత్రిగా విస్తరించినట్లు పేర్కొన్నారు. సాధ్యమైనంత మేరకు యూనివర్సిటీ ఆసుపత్రిలోనే అన్ని రకాల వైద్య సేవలు అందించాలన్న లక్ష్యంతో ఉన్నామని వైద్యులు పేర్కొన్నారు ఎక్స్ రే, స్కానింగ్, స్పెషలిస్టుల వైద్య పరీక్షల కోసం ఎయిమ్స్ ఎన్నారై ఆస్పత్రుల సహకారం తీసుకుంటామని వైద్యులు పేర్కొన్నారు. రిజిస్ట్రార్ ఆర్ ప్రేమ్ కుమార్, స్టూడెంట్ అఫైర్స్ డైరెక్టర్ గురుప్రీత్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



## వరగానిలో రైతన్న మీకోసం ...



పెదనందిపాడు నవంబర్ 27(ప్రభాతవార్త) రైతులకు మేలు చేయడానికే సాగునీటి పొదుపు,డిమాండ్ ఆధారిత పంటలు వేసుకోవడం, అగ్రిటెక్ టెక్నాలజీ ని వాడుకోవడం, ఫుడ్ ప్రాసెసింగ్ ఆదేవిధంగా పెట్టుబడి సాయం కింద అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ వంటివే కాకుండా ఇంకా రైతులకు మేలు చేయడానికి వారి అవసరమైనటువంటి టెక్నాలజీని అందించడానికి ఏమేమి అవసరం అవుతాయో తెలుసుకోవడానికి ఈ హౌస్ హోల్డ్ సర్వే ఎంతో ఉపయోగపడుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఎం పద్మావతి అన్నారు. గురువారం వరగాని లో మండల వ్యవసాయ అధికారి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన,రైతన్న మీకోసం కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి పాల్గొన్నారు. అనంతరం సబ్సిడీ శనగ విత్తనాలను రైతుల కు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోపూరి వెంకటప్పయ్య. పలు రైతులు పాల్గొన్నారు.

## మంగళగిరి ఆత్మకూరు సెంటర్ లో ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాలను ఆవిష్కరించిన మంత్రి లోకేష్

మంగళగిరి, నవంబర్ 27, ప్రభాతవార్త మంగళగిరి పరిధిలోని ఆత్మకూరు సెంటర్ లో ఏర్పాటుచేసిన స్వర్గీయ నందమూరి తారక రామారావు, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు విగ్రహాలను విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ ఆవిష్కరించారు. ముందుగా ఆత్మకూరు సెంటర్ కు చేరుకున్న మంత్రి లోకేష్ కు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఎన్టీఆర్, ఎంఎస్ఎస్ విగ్రహాలను మంత్రి లోకేష్ ఆవిష్కరించారు. ఈ వేడుకకు పెద్దఎత్తున ప్రజలు తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావు, గ్రామ అధ్యక్షులు తాటి వెంకట్రావు, మండల టీడీపీ ఉపాధ్యక్షులు కొమ్మా సుకుమార్, మాదాల సునీల, నన్నపనేని నాగేశ్వరరావు, కొమ్మా లవ్ కుమార్, టి.ఏసు రత్నం, టి.ఏసుదాస్, టి.యేసోబు, టి.పన్నయ్యతో పాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.



## మంగళగిరిలో నూర్ మస్జీద్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మంత్రి నారా లోకేష్

మంగళగిరి, నవంబర్ 27, ప్రభాతవార్త : మతం ఏదైనా మానవత్వం ముఖ్యమని, భవిష్యత్ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. మంగళగిరి ఆర్టీసీ డిపో వద్ద పావురాల కాలనీలో నూతనంగా నిర్మించిన నూర్ మస్జీద్ ను మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. మంగళగిరి ప్రజలకు సేవ చేసే అవకాశం నాకు దక్కింది. నాకున్న అవకాశాల మేరకు సేవ చేస్తున్నా. సీఎం చంద్రబాబునాయుడు గారికి రాష్ట్రానికి సేవ చేసే అవకాశం దక్కింది. మనతో ఉన్నవారిని పైకి తీసుకురావాల్సిన బాధ్యత అందరిపై ఉంది. మతం ఏదైనా మానవత్వం మర్చిపోకూడదు. కష్టాల్లో ఉన్నవారికి చేయూత అందించాలి. సమాజంలో ఇంకా పేదరికం ఉంది. పేదరికంలో ఉన్నవారిని అందులో నుంచి బయటకు తీసుకురావాలి. ఈ కార్యక్రమంలో పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, ఏపీఎంఎస్ఐడీసీ ఛైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకీదేవి, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు హాజీ షేక్ నాగుల్ మీరా, మసీదు వ్యవస్థాపక అధ్యక్షులు షేక్ మహమ్మద్ అలీ, మసీదు కమిటీ సభ్యులు షేక్ మహమ్మద్ జానీ, మహమ్మద్ ఫిరోజ్, షేక్ సౌఖత్ అలీ, షాహిద్ అలీ, జాఫర్, నజీర్, ఆసిఫ్, అబ్దుల్లా కుట్టి, పలువురు నాయకులు పాల్గొన్నారు.



## మంగళగిరిలో మోడల్ లైబ్రరీని ప్రారంభించిన మంత్రి నారా లోకేష్

మంగళగిరి, నవంబర్ 27, ప్రభాతవార్త : అన్ని రంగాల్లో మంగళగిరి నియోజకవర్గాన్ని అగ్రస్థానంలో నిలిపేందుకు విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ కృషిచేస్తున్నారు. మంగళగిరి పట్టణం శివాలయం వద్ద రూ.1.72 కోట్లతో ఆధునీకరించిన మోడల్ పబ్లిక్ లైబ్రరీని మంత్రి నారా లోకేష్ ప్రారంభించారు. 1986లో ముఖ్యమంత్రి హోదాలో స్వర్గీయ ఎన్టీఆర్, మాజీ మంత్రి స్వర్గీయ ఎంఎస్ఎస్ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో తెలుగు విజ్ఞాన సమాచార కేంద్రం పేరుతో మంగళగిరిలో లైబ్రరీకి శంకుస్థాపన చేశారు. నేడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారి సారథ్యంలో మంత్రి నారా లోకేష్ చొరవతో లైబ్రరీని ఆధునీకరించారు. ఈ సందర్భంగా శిలాఫలకాన్ని మంత్రి ఆవిష్కరించారు. లైబ్రరీ ఆధునీకరణకు సీఎస్ఆర్ ఫండ్స్ కింద గుంటూరు డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్స్ రూ.90 లక్షలు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్(తిశిగిలీ) రూ.42 లక్షలు, నోవో(వివీజువీ) ఇన్సూరెన్స్ బ్రేకింగ్ సర్వీస్ ప్రైవేట్ లిమిటెడ్ రూ.30 లక్షలు అందించారు. లైబ్రరీ గ్రౌండ్ ఫ్లోర్ లో పిల్లల కోసం రీడింగ్ రూమ్, ప్లే ఏరియా, వివిధ దిన పత్రికలు, వార, మాసపత్రికలు అందుబాటులో వుండేవిధంగా రూమ్, బుక్ రీడింగ్ రూమ్, సీనియర్ సిటిజన్స్ రీడింగ్ ఏరియా, పబ్లిక్ రీడింగ్ ఏరియా, ఫలహారశాలతో పాటు మొదటి అంతస్తులో రెండు టీచింగ్ హాల్స్, స్టడీ రూమ్, నైపుణ్యంతో పాటు పోటీపరీక్షలకు సన్నద్ధమయ్యే వారికోసం రీడింగ్ ఏరియా, డిజిటల్ లైబ్రరీ, డిజిటల్ రీసోర్స్ సెంటర్ ను ఏర్పాటుచేశారు.



**లైబ్రరీ కోసం ఎన్టీఆర్ వేసిన శిలాఫలకం వద్ద సెల్ఫీ దిగిన మంత్రి లోకేష్**

మోడల్ పబ్లిక్ లైబ్రరీ ప్రారంభోత్సవం సందర్భంగా 1986లో స్వర్గీయ ఎన్టీఆర్ వేసిన శిలాఫలకం వద్ద మంత్రి నారా లోకేష్ సెల్ఫీ దిగారు. లైబ్రరీ మొత్తం కలియతిరిగి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. వారితో ఫోటోలు దిగారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ పరిషత్ ఛైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహన్ కృష్ణ, విద్యా సంక్షేమ మౌలిక సదుపాయాల కార్పోరేషన్ ఛైర్మన్ ఎస్ రాజశేఖర్, పద్మశాలీ వెల్ఫేర్ అండ్ డెవలప్ మెంట్ కార్పోరేషన్ ఛైర్మన్ నందం అబద్దయ్య, గుంటూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి పోతినేని శ్రీనివాసరావుతో పాటు పలువురు స్థానిక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో జీవ ధ్వజ సంప్రోక్షణ



పొన్నూరు, నవంబరు 27,ప్రభాతవార్త: టెంపుల్ సిటీగా ప్రసిద్ధిగాంచిన స్వర్ణపురి పట్టణంలో వేంచేసియున్న శ్రీ సహస్రలింగేశ్వరస్వామి, శ్రీ వీరాంజనేయస్వామివారి దేవాలయం ప్రాంగణంలో కొలువై ఉన్న దశావతారాముల దేవాలయాలనికి సంబంధించిన జీవ ధ్వజస్తంభ సంప్రోక్షణ కార్యక్రమం గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది.పట్టణంలోని విద్యానగర్‌కు చెందిన దాతలు తాడేపల్లి సత్యమూర్తి-నందిని దంపతులచే అర్చకస్వాములు సంప్రోక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. అందుకు సంబంధించిన పూజాధికార్యక్రమాలను అర్చకులు శాస్రోక్తంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి గద్దె వెంకట అమర్నాధ్, సిబ్బంది, పాల్గొన్నారు.

## న్యాయవాద వృత్తి గౌరవప్రదమైనది-ఎమ్మెల్యే నరేంద్రకుమార్

పొన్నూరు, నవంబరు 27,ప్రభాతవార్త: న్యాయవాద వృత్తి చాలా గౌరవప్రదమైందని, పేదలకు న్యాయం అందేవిధంగా న్యాయవాదులు ప్రయత్నం చేయాలని ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ కోరారు. స్థానిక షరాఫ్ బజారులో న్యాయవాది జొన్నకూటి లక్ష్మీకాంత్ నూతనంగా ఏర్పాటు చేసిన లా హౌస్‌ను ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నరేంద్రకుమార్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలో ఉన్నటువంటి వారు పేద ప్రజలకు సరైన న్యాయం అందవిధంగా చూడాలన్నారు. కక్షిదారులకు నమ్మకం కలిగే విధంగా కేసులను వాదించి న్యాయాన్ని బ్రతికించే విధంగా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు వట్టికూటి లీలాప్రసాద్, మునిసిపల్ స్టాండింగ్ కౌన్సిల్ న్యాయవాది తూమాటి రమేష్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ బాజిసాహెబ్, మగ్బుల్‌బేగ్, జీఎస్ రాయెల్,టిడిపి నాయకులు ఫిరోజ్‌ఖాన్, షేక్ బాబ్జి, మహమ్మద్ గౌస్, లక్ష్మణమూర్తి, అలీషా, వైకాపా నాయకులు నన్నపనేని అంకినీడు చౌదరి, షేక్ షఫాయితుల్లా, బోయిన శివనాగరాజు, ఆకుల వెంకటేశ్వరరావు, షేక్ మహమ్మద్(మాము) తదితరులు పాల్గొన్నారు.



## లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో ప్రాజెక్టు పిబిఎస్ ప్రారంభం

పొన్నూరు, నవంబరు 27,ప్రభాతవార్త: నిరుద్యోగులకు శిక్షణ, ఉపాధి, ఉద్యోగ కల్పన కోసం ప్రాజెక్టు పిబిఎస్(పే బ్యాక్ టు సొసైటీ) ప్రాజెక్టును ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5గంటలకు ప్రారంభిస్తున్నట్లు లయన్స్‌క్లబ్ నాయకులు ఆకుల సాంబశివరావు, ఎస్.ఆంజనేయులునాయుడు తెలిపారు. లయన్స్‌క్లబ్ పొన్నూరు, లయన్స్‌క్లబ్ స్వర్ణపురి మహిళ, లయన్స్‌క్లబ్ ఫ్రెండ్లీ వాకర్స్, ఎన్నారై తెలుగు పేరెంట్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆకురాతి గ్లోబల్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ ప్రాజెక్టు ప్రారంభించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరంద్రకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు. నిరుద్యోగులు తమ పేర్లను నమోదు చేసుకోవాలని కోరారు. జిల్లా, మండల కేంద్రాలలో స్వచ్ఛందంగా ఆఫీసు నిర్వహించగల రిటైర్డ్ ఉద్యోగులు తమ పేర్లు నమోదు చేయించుకోవాలని కోరారు. లయన్స్‌క్లబ్ నాయకులు, సభ్యులు, నిరుద్యోగులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు కోరారు. ప్రాజెక్టుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. సమావేశంలో ఆకురాతి మురళీకృష్ణ, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు నన్నపనేని రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.



## గూడవల్లికి నేషనల్ ఎక్సలెన్స్ అవార్డు

పొన్నూరు, నవంబరు 27,ప్రభాతవార్త: భారత రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని భారతరత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారత భూషణ్ అవార్డుల్లో భాగంగా పట్టణానికి చెందిన పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు గూడవల్లి గంగాధర్‌కు అంబేద్కర్ గ్లోబల్ ఫౌండేషన్ నేషనల్ ఎక్సలెన్స అవార్డును అందజేసింది. ఈ నెల 26వ తేదీన ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో అవార్డును అతిథులు చేతుల మీదుగా అందుకున్నారు. సోషల్ సర్వీసెస్ కేంద్ర మంత్రి రాందాస్ అత్వాలే చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఈ విధంగా జాతీయస్థాయి అవార్డు అందుకోవడం తనకెంతో ఆనందంగా ఉందని గంగాధర్ అన్నారు. పీపుల్స్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించిన పలువురి మన్ననలు అందుకున్నారు. ఈ సందర్భంగా గూడవల్లి గంగాధర్‌ను పలువురు పుర ప్రముఖులు అభినందించారు.




# ఘనంగా సెమీ క్రిస్మస్ వేడుకలు

నరసరావుపేట, నవంబర్ 27 ప్రభాతవార్త : నరసరావుపేట పాలపాడు రోడ్డులో ఉన్న కృష్ణవేణి కళాశాల క్రీడా ప్రాంగణంలో బేతేలు ప్రార్థన మందిరం చేపట్టిన సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కృష్ణవేణి కళాశాల క్రీడా ప్రాంగణంలో నిర్వహించిన ఈ సెమీ క్రిస్మస్ వేడుకలు క్రైస్తవ సంఘ సభ్యులతో పాటు అనేక మంది భక్తుల పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు



చదలవాడ అరవింద బాబు ప్రధాన అతిథిగా వేడుకలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బేతేలు ప్రార్థన మందిరం నిర్వాహకులు, క్రైస్తవ సంఘ సభ్యులు ఈ కార్యక్రమానికి తమ సహకారానికి కారణమైన అందరినీ అభినందించారు. సెమీ క్రిస్మస్ వేడుకలు క్రైస్తవ సంఘంలో యేసు క్రీస్తు జన్మ దినోత్సవానికి ముందుగా ఆచరించే ప్రత్యేక కార్యక్రమం. క్రీస్తు బోధనలు అందరికీ ఆచరణీయమని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కొట్ట కిరణ్, కడియాల తాండవ కృష్ణ, నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆకాశమంత అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుంది: ఎంపీ

మాచర్ల, నవంబరు 27 ప్రభాతవార్త: ఆకాశమంత అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు ఉద్ఘాటించారు. గురువారం పట్టణంలోని స్థానిక మార్కెట్ యార్డు ప్రధాన ద్వారం ముందు భాగంలో మాచర్ల, రెంటచింతల, గురజాల పట్టణాలకు సంబంధించిన ఇన్నర్ బైపాస్ రోడ్డు నిర్మాణాలకు ఎంపీ లావు, స్థానిక ఎమ్మెల్యే





జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు భూమపూజ చేశారు. రూ.54.09 కోట్ల నిధులతో నిర్మించనున్న ఈ రోడ్లకు శంకుస్థాపన చేసి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం మార్కెట్‌యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభావేదికపై మాట్లాడారు. ఈ సందర్భంగా ఏడాది కాలంలో సీఎం చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం పల్నాడు జిల్లాలో అమలు చేస్తున్న అనేక అభివృద్ధి పనులు, ఇచ్చిన హామీల మేరకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి ఎంపీ లావు వివరించారు. పార్లమెంటు పరిధిలో శరవేగంగా జరుగుతున్న అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలు ఉన్నతంగా పుంజుకుంటేనే ప్రాంతాల అభివృద్ధి పరుగులు పెడుతుందన్నారు. పార్లమెంటు పరిధిలో ఇప్పటికే వేల కోట్లతో దాదాపు 231 కి.మీ. మేర నూతన హైవే రోడ్లను నిర్మించామన్నారు. వరికపూడిసెల ప్రాజెక్టు పూర్తిచేసే వరకు విశ్రమించేది లేదన్నారు. త్వరలో అన్ని అనుమతులతో శంకుస్థాపన కార్యక్రమాన్ని ముగించుకుని పనులను పరుగులు పెట్టిస్తామని ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గ పరిధిలో రూ.1200 కోట్లత జల్‌జీవన్ మిషన్, రూ.124 కోట్లతో అమృత్ పథకాల పనులకు త్వరలో శంకుస్థాపనలు జరుగుతాయని వెల్లడించారు.

**అరాచకం రాజ్యమేలితే అభివృద్ధి శూన్యం: ఎమ్మెల్యే జూలకంటి**

ప్రాంతీయంగా అరాచకం రాజ్యమేలితే అభివృద్ధి శూన్యమని సీఎం చంద్రబాబు నాయుడు నమ్మిన సిద్ధాంతానికి తాను కట్టుబడి ఉన్నానని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. నియోజకవర్గంలో ఒక ప్రశాంత వాతావరణంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని, ఆ ప్రశాంతతను పాడు చేసేందుకే వైసీపీ అలజడులు సృష్టిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గడచిన 15 ఏళ్లుగా మాచర్ల అభివృద్ధికి ఆమడ దూరంలో ఉందన్నారు. మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు ఇచ్చిన రూ.50 కోట్ల నిధుల హామీ కార్యరూపం దాల్చిందన్నారు. పట్టణ చరిత్రలో రూ.54.09 కోట్లతో రోడ్డు విస్తరణ జరగడం గర్వకారణంగా ఉందన్నారు. తెలంగాణ లిక్కర్‌ను మాచర్లకు తీసుకొచ్చి అమ్మకాలు జరిపి ఆదాయానికి గండికొడుతున్న ఏ ఒక్క వైసీపీ అక్రమార్కులను వదిలిపెట్టమని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ స్థాయి ఆర్‌అండ్‌బీ అధికారులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## సేవా ఆశ్రమాలకు సరుకుల పంపిణీ

మాచర్ల, నవంబరు 27 ప్రభాతవార్త: మాచర్ల వివేకానంద సేవాశ్రమం, శ్రీనివాస మహల్‌పక్కన గల ఆశ్రమం, ఆత్మకూరు గ్రామంలోని వృద్ధాశ్రమంలో నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి నారాయణ పాఠశాల ప్రిన్సిపల్ ఉల్లారెడ్డి స్వామి వివేకానంద సేవాశ్రమం అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి మాట్లాడుఉతూ చిన్నారులు చిన్నతనం నుంచే సేవాకార్యక్రమాలు నిర్వహించడం సంతోషించదగ్గ విషయమన్నారు. విద్యార్థులు తమ తల్లిదండ్రులు ఇచ్చిన పాకెట్ మనీని కూడబెట్టి సహాయ సహకారాలు అందించడం అభినందించదగ్గ విషయమన్నారు. ఇలాంటి వారే బాధ్యత కలిగిన పౌరుగులగా తయారవుతారన్నారు. ఈ కార్యక్రమంలో ఏజీఎం జానకి రామిరెడ్డి, కోఆర్డినేటర్స్ భద్రారెడ్డి, గౌసియ, రిహాని, ఇన్‌ఛార్జిలు ఆంజనేయులు, ఉదయలక్ష్మి, రాజేశ్వరి, విజయలత, పాఠశాల అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రవీంద్ర, వ్యాయా ఉపాధ్యాయులు చంద్రయ్య వివేకానంద సేవాశ్రమం అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.



## మోసిన్ సేవలు ప్రశంసనీయం

మాచర్ల, నవంబరు 27 ప్రభాతవార్త: సామాజిక సేవలో టీడీపీ సైతం అన్నట్లు తెలుగు యువత మాజీ అధ్యక్షులు షేక్ మోసిన్ చేస్తున్న సేవలను ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, స్థానిక ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డిలు ప్రశంసించారు. గురువారం స్థానిక పట్టణ బైపాస్ రోడ్డు వవిసనతరణ పనుల శంకుస్థాపనకు ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎంపీ, ఎమ్మెల్యేల చేతుల మీదుగా వీధి వ్యాపారం చేసుకుని జీవించే కుటుంబాలకు ఉచితంగా తోపుడు బండ్లను అందజేశారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్ఫూర్తితో ఉపాధికి ఊతాన్ని ఇచ్చే తోపుడు బండ్లను పేదలకు ఉచితంగా మోసిన్ అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## రీసర్వేతో శాశ్వత భూహక్కు: తహశీల్దారు

కారంపూడి, నవంబరు 27 ప్రభాతవార్త: రీసర్వేతో రైతులకు శాశ్వత భూహక్కు కలుగుతుందని తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్, మండల సర్వేయరు సలోమాన్‌ఖాన్ అన్నారు. గురువారం సర్వేయర్లతో తహశీల్దారు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. రీసర్వేతో రెండు తరాల వరకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా హక్కు పత్రాలను ప్రభుత్వం అందజేస్తుందన్నారు. పేటసన్నెగండ్ల గ్రామంలో 4159.7 ఎకరాల విస్తీర్ణం ఉందని ఇప్పటికి 2,600 ఎకరాల భూమి గ్రౌండ్ త్రూతింగ్ వర్కు పూర్తయిందన్నారు. నాలుగు బృందాలను ఏర్పాటు చేసి గ్రౌండ్ త్రూతింగ్ వేగవంతం చేస్తున్నట్లు తెలిపారు. రైతుల సహకారం కూడా ఉందని, గ్రామాల్లో అందుబాటులో లేని రైతులు పక్కపొలాల రైతులకు సమాచారం అందించాలని తహశీల్దారు వెంకటేశ్వర్లు నాయక్, మండల సర్వేయరు సులోమాన్ ఖాన్ తెలిపారు. ఇప్పటిక వీరలక్ష్మీపురం, చినకొదమగుండ్ల గ్రామాల్లో రీసర్వే పూర్తి చేసి హక్కు పత్రాలు అందజేశామన్నారు. మిగిలిన గ్రామాల్లో కూడా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు రీసర్వే పూర్తి చేస్తామని తెలిపారు.



## పెదనందిపాడు బ్యాంక్ ఆఫ్ బరోడా ఆధ్వర్యంలో రైతు పక్షోత్సవాలు

పెదనందిపాడు నవంబర్ 27 (ప్రభాతవార్త)బ్యాంక్ ఆఫ్ బరోడా పెదనందిపాడు వారి ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలో రైతు పక్షోత్సవాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న బ్యాంక్ ఆఫ్ బరోడా చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం నవంబర్ నెలలో బ్యాంకు ఆధ్వర్యంలో రైతు పక్షోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. రైతులకు, కౌలు రైతులకు రుణాల అందించడానికి రుణ మేళా, ఆక్వా, డైరీ, స్వయం సహాయక బృందాలకు రుణాలు తదితర వాటి గురించి అవగాహన కల్పించారు. వ్యవసాయ, వ్యవసాయ అనుబంధ రంగాలు ద్వారా అభివృద్ధి చెందడానికి రైతులు, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ ఆఫ్ బరోడా హైదరాబాద్ జోనల్ మేనేజర్ రితీష్ కుమార్, జిల్లా వ్యవసాయ అధికారి పద్మావతి, నాబార్డ్ డి డి ఎం శరత్, గుంటూరు లీడ్ బ్యాంక్ మేనేజర్ మహిపాల్ రెడ్డి, బ్యాంక్ ఆఫ్ బరోడా గుంటూరు రీజినల్ మేనేజర్ కిరణ్ రెడ్డి, పెదనందిపాడు బ్యాంక్ ఆఫ్ బరోడా మేనేజర్ వంగవీటి వెంకటేశ్వరరావు, జిల్లా వ్యాప్తంగా ఉన్న బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖల సిబ్బంది, ఫీల్డ్ ఆఫీసర్లు, పలు గ్రామాల నుండి విచ్చేసిన రైతు సోదరులు పాల్గొన్నారు.



28-11pg10_28-11pg10.qxd 11/28/2025 1:51 AM Page 1





# జనవరి 9 నుంచి డబ్ల్యూపిఎల్

## ముంబయి వేదికగా నెల రోజులు

**న్యూఢిల్లీ:** ప్రపంచంలోని అతిపెద్ద మహిళా క్రికెట్ లీగ్‌లలో ఒకటైన డబ్ల్యూపీఎల్ 2026 షెడ్యూల్ విడుదలైంది. సుమారు నెల రోజుల పాటు జరగనున్న ఈ టోర్నమెంట్ జనవరి 9, 2026న తొలి మ్యాచ్ నవీ ముంబైలోని డీవై పాటిల్ స్టేడియంలో ప్రారంభమై, ఫిబ్రవరి 5 న వడోదరలోని బిసిఎ స్టేడియంలో జరిగే ఫైనల్ మ్యాచ్‌తో (టైటిల్ పోరు)తో ముగుస్తుంది. ఈ టోర్నమెంట్ రెండు నగరాల్లో జరుగుతుందని బీసీసీఐ ప్రకటించింది. ఈ డబ్ల్యూపీఎల్‌లో జట్లు లీగ్ దశలో ఒకదానితో ఒకటి రెండు మ్యాచ్‌లు ఆడతాయి. లీగ్ దశలో మొదటి స్థానంలో నిలిచిన జట్టు నేరుగా ఫైనల్‌కు చేరుకుంటుంది. రెండో, మూడో స్థానాల్లో నిలిచిన జట్ల మధ్య ఎలిమినేటర్ మ్యాచ్ జరుగుతుంది. ఈ మ్యాచ్‌లో గెలిచిన జట్టు ఫైనల్‌కు చేరుకుంటుంది. సాధారణంగా డబ్ల్యూపీఎల్ సంప్రదాయం ప్రకారం, టోర్నమెంట్ ప్రారంభ మ్యాచ్ గత సీజన్ ఛాంపియన్, రన్నరప్ జట్ల మధ్య జరిగే అవకాశం ఉంది. ఈ లెక్కన గత సీజన్ విజేతలైన ముంబై ఇండియన్స్, రన్నరప్ అయిన ఢిల్లీ క్యాపిటల్స్ మధ్య జనవరి 9 న తొలి మ్యాచ్ జరిగే అవకాశం ఎక్కువగా ఉంది. ఇక గత మూడు సీజన్లలో ఈ టోర్నమెంట్ క్రమంగా ప్రజాదరణ పొందుతోంది. 2023లో ముంబై ఇండియన్స్ ఉమెన్స్ ప్రీమియర్ లీగ్ మొదటి సీజన్‌ను గెలుచుకుంది. 2024లో రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు, 2025లో ముంబై ఇండియన్స్ మళ్లీ ఛాంపియన్‌గా నిలిచింది.

ఆట



# భారత్ విజయం

## 3-2 తేడాతో న్యూజిలాండ్ చిత్తు

**న్యూఢిల్లీ:** సుల్తాన్ అజ్లాన్ షా కప్-2025, నాల్గవ పూల్ మ్యాచ్‌లో భారత్ న్యూజిలాండ్‌ను చిత్తు చేసింది. మలేషియాలోని ఇపోలో గురువారం జరిగిన ఈ మ్యాచ్‌లో భారత పురుషుల హాకీ జట్టు న్యూజిలాండ్‌తో తలపడింది. న్యూజిలాండ్ నుంచి తొలి ఒత్తిడి వచ్చిన తర్వాత, భారత్ దాన్ని అధిగమించి తమకు లభించిన ఏకైక అవకాశాన్ని గోల్‌గా మార్చుకుంది. ఫలితంగా మొదటి క్వార్టర్ ముగించే సమయానికి భారత్ జట్టు 1-0 అధిక్యం సంపాదించింది. బ్లాక్ స్టిక్స్ రెండవ క్వార్టర్‌ను అదే దూకుడుగా ప్రారంభించి పెనాల్టీ కార్నర్‌ను కూడా గెలుచుకుంది. అయితే దాన్ని గోల్‌గా మార్చడంలో న్యూజిలాండ్ విఫలమవ్వడంతో భారత్ తన ఆధిక్యాన్ని కొనసాగించింది. మూడవ క్వార్టర్‌లో పెనాల్టీ కార్నర్ లభించింది. కెప్టెన్ సంజయ్ డ్రాగ్‌ఫ్లిక్‌ను గోల్‌గా మార్చడంతో భారత్ స్కోరు 2-0కి చేరుకుంది. గోల్ కీపర్లు ఇద్దరూ భారత్ జట్టులోని పవన్, న్యూజిలాండ్ యొక్క హేవార్డ్ తమ ఆటను వేగవంతం చేస్తూ రెండు జట్లకు బహుళ పెనాల్టీ కార్నర్ అవకాశాలను అడ్డుకున్నారు. చివరకు 43వ నిముషంలో జార్జ్ బేకర్ ఫీల్డ్ గోల్‌తో న్యూజిలాండ్ స్కోర్‌కార్డ్‌ను తెరవడంతో స్కోర్ 2-1గా చేరింది. 48వ నిముషంలో అద్భుతంగా లభించిన పెనాల్టీ కార్నర్‌ను జార్జ్ బేకర్ ఐదు నిమిషాల్లోనే గోల్‌గా మలిచాడు. దీంతో న్యూజిలాండ్ స్కోరు 2-2తో సమం అయింది. 54వ నిముషంలో కార్తీ సెల్వం ఫీల్డ్ గోల్‌తో భారత్‌ను తిరిగి 3-2తో ఆధిక్యంలోకి తీసుకెళ్లాడు. చివరి క్వార్టర్ ప్రారంభంలోనే బేకర్ పెనాల్టీ కార్నర్ గోల్ చేయడం ద్వారా వారి 2 గోల్స్ తప్పాయి. చివరి 7 నిమిషాల్లో కార్తీ అద్భుత ప్రదర్శనతో భారత్ తిరిగి ఆధిక్యంలోకి వచ్చింది. చివరి విజిల్ వరకు ఆధిక్యంలో ఉండి మ్యాచ్‌ను కైవసం చేసుకుంది. అంతకు ముందు ఆతిథ్య మలేషియాపై 4-3 తేడాతో విజయం సాధించిన భారత్ ఇప్పటి వరకు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోని న్యూజిలాండ్‌పై తన విజయ జోరును కొనసాగించింది. ఈ విజయంతో భారత్ ఇప్పుడు 4 ఆటల్లో 9 పాయింట్లతో పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో ఉంది.

# డేంజర్‌లో టీమిండియా



## ఫైనల్ రేస్‌కు చేరేనా?

### పాయింట్ల పట్టికలో దిగజారిన ర్యాంక్

**న్యూఢిల్లీ:** వరల్డ్ టెస్టు ఛాంపియన్‌షిప్ (డబ్ల్యూటిసి) ఫైనల్ రేసుకు సంబంధించి టీమిండియా ప్రమాదంలో పడింది. దక్షిణాఫ్రికా చేతిలో దారుణంగా ఓటమి పాలైన టీమిండియా డబ్ల్యూటిసి పాయింట్ల పట్టికలో మెరుగైన స్థానం నుండి దిగజారిపోయింది. ఈ టెస్ట్ సిరీస్ ప్రారంభానికి ముందు టీమిండియా ప్రస్తుత పాయింట్ల పట్టికలో మూడవ స్థానంలో ఉంది. అయితే, ఈ సిరీస్‌తో భారత జట్టు స్థానం మరింత దిగజారింది. ఇప్పుడు పాకిస్తాన్ కంటే దిగువకు పడిపోయింది. ఒక సంవత్సరం వ్యవధిలో టీం ఇండియా స్వదేశంలో రెండవ టెస్ట్ సిరీస్ ఓటమిని చవిచూసింది. కేవలం ఇది ఓటమి కాదు, రెండవ వైట్‌వాష్. 2024లో న్యూజిలాండ్, ఇప్పుడు ప్రపంచ టెస్ట్ ఛాంపియన్ దక్షిణాఫ్రికా భారత జట్టు పరువు తీసేసింది. గౌహతిలో జరిగిన రెండవ టెస్ట్ మ్యాచ్‌లో, దక్షిణాఫ్రికా భారత్‌ను 408 పరుగుల భారీ తేడాతో ఓడించి, సిరీస్‌ను 2-0తో కైవసం చేసుకుంది. టీం ఇండియా అవమానకరమైన ఓటమిని చవిచూడడమే కాకుండా, ఐసీసీ ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ పాయింట్ల పట్టికలో ఐదవ స్థానానికి పడిపోయింది. మరోపక్క టీమిండియా పరిస్థితి దిగజారుతోంది. జూన్‌లో టీమిండియా ఇంగ్లాండ్‌లో పర్యటించినప్పుడు డబ్ల్యూటిసి 2025-27 సైకిల్ ప్రారంభమైంది. ఆ పర్యటన నుంచి టీం ఇండియా మొత్తం తొమ్మిది టెస్ట్ మ్యాచ్‌లు ఆడింది. వీటిలో నాలుగు మాత్రమే గెలిచి, నాలుగు ఓడిపోయింది, ఒకటి డ్రా అయింది. తత్ఫలితంగా ఈ తొమ్మిది టెస్ట్ మ్యాచ్‌లలో టీం ఇండియా 52 పాయింట్లను కలిగి ఉంది. అయితే ఈ పాయింట్ల శాతం 48.15కి తగ్గిపోయింది. ఫలితంగా, టీం ఇండియా నాల్గవ స్థానం నుంచి ఐదవ స్థానానికి పడిపోయింది. ఈ టెస్ట్ సిరీస్‌కు ముందు, టీమిండియా మూడవ స్థానంలో ఉంది. కానీ, కోల్‌కతా టెస్ట్ ఓడిపోయిన తర్వాత, పాయింట్ల శాతం 54.17గా ఉంది. దీంతో నాల్గవ స్థానానికి పడిపోయింది. అయితే, గౌహతిలో గెలవలేకపోవడం వల్ల పాకిస్తాన్ 50 పాయింట్ల శాతంతో నాల్గవ స్థానంలో నిలిచింది. దక్షిణాఫ్రికా విషయానికొస్తే, 25 సంవత్సరాల తర్వాత భారతదేశంలో సిరీస్ గెలిచి క్లీన్ స్వీప్ పూర్తి చేసింది. టెంబా బావుమా నేతృత్వంలోని ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ జట్టు ప్రస్తుతం నాలుగు టెస్టుల్లో మూడు విజయాలతో రెండవ స్థానంలో ఉంది. 36 పాయింట్లు, 75 పాయింట్ల శాతం సంపాదించింది. ఆస్ట్రేలియా 100 శాతం పాయింట్లతో మొదటి స్థానంలో ఉండగా, శ్రీలంక 66.17 శాతం



# బ్యాడ్మింటన్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు తన్వి

**న్యూఢిల్లీ:** సయ్యద్‌మోడీ బ్యాడ్మింటన్ టోర్నీలో భారత్‌ప్లేయర్లు విజయాలతో అదరగొట్టారు. గురువారం భారత బ్యాడ్మింటన్ సీజన్‌లో అత్యంత అద్భుతమైన ఫలితాల్లో ఒకటిగా నిలిచింది. 16 ఏళ్ల తన్వి శర్మ మాజీ ప్రపంచ ఛాంపియన్ నోజోమి ఒకుహారాను ఓడించి క్వార్టర్ ఫైనల్స్‌లో చోటు దక్కించుకుంది. మహిళల సర్క్యూట్‌లో అత్యంత అనుభవజ్ఞులైన క్రీడాకారిణితో తలపడిన తన్వి, తొలి గేమ్‌ను 13-21తో కోల్పోయింది. కానీ రెండవ గేమ్‌లో దూకుడుగా నెట్ ప్లేతో గేర్లు మార్చిన తన్వి చివరి రెండు పాయింట్లను సాధించి 13-21, 21-16, 21-19 తేడాతో విజయాన్ని నమోదు చేసింది. అలాగే టాప్ సీడ్ ఉన్నతి హుడా, రక్షిత శ్రీ, శ్రీకాంత్, కిరణ్ జార్జ్, గాయత్రి తదితరులు గెలుపు బాటలో దూసుకెళుతున్నారు. మహిళల సింగిల్స్‌లో ఉన్నతి ప్రత్యర్థి ఆకర్షి కశ్యప్‌ను 21-13, 21-18 తేడాతో ఓడించింది. పురుషుల సింగిల్స్‌లో టాప్ సీడ్ సింగపూర్‌కు చెందిన టెహ్ 21-19, 21-17 తేడాతో భారత్‌కు చెందిన రిత్విక్ సంజీవిని ఓడించి 16వ రౌండ్‌లో తన స్థానాన్ని పదిలం చేసుకున్నాడు. అలాగే శ్రీకాంత్ కవిన్ తంగంను 21-13, 21-10 తేడాతో ఓడించి అద్భుతమైన ప్రదర్శన ఇచ్చాడు. ఏడో సీడ్ రక్షిత శ్రీ సంతోష్ రామ్‌రాజ్ తన మహిళల సింగిల్స్ ఛాలెంజ్‌ను 21-12, 21-14 తేడాతో శ్రేయ లేలేపై గెలుపొందింది. పురుషుల సింగిల్స్ విభాగంలో కిరణ్ ఇజ్రాయెల్‌కు చెందిన డేనియల్ దుబోవెంకోను 21-17, 21-9 తేడాతో ఓడించాడు.

# కాసులు కురిపించిన వేలం

## అత్యధికంగా రూ.3.20 కోట్లకు అమ్ముడైన క్రికెటర్ దీప్తి

**న్యూఢిల్లీ:** డబ్ల్యూపీఎల్ 2026, నాలుగో సీజన్ వేలంలో స్టార్ ఆటగాళ్లపై కాసుల వర్షం కురుస్తోంది. ఆక్షనీర్ మల్లికా సాగర్ నిర్వహిస్తున్న ఈ వేలంలో ఈమధ్యే ముగిసిన వన్డే ప్రపంచకప్‌లో అదరగొట్టిన క్రికెటర్లు హాట్‌కేకుల్లా అమ్ముడవుతున్నారు. గురువారం మధ్యాహ్నం 3 గంటల తర్వాత ఢిల్లీలో మెగా వేలం మొదలైంది. ఇటీవలే వరల్డ్ కప్‌లో అదరగొట్టిన దీప్తి శర్మ రూ.3.20 కోట్లు పలికింది. మ్యాచ్ విన్నర్ అయిన దీప్తిని ఆర్టీఎం ద్వారా యూపీ వారియర్స్ సొంతం చేసుకుంది. ప్రపంచకప్‌లో రెండు శతకాలతో రెచ్చిపోయిన లారా వొల్వార్డ్‌ను రూ.1.20 కోట్లు ఢిల్లీ క్యాపిటల్స్ పట్టేసింది. అయితే ఆస్ట్రేలియా కెప్టెన్ అలీసా హీలీకి మాత్రం వేలంలో చుక్కెదురైంది. అలీసా, తంజిమ్ బ్రిట్స్ వంటి స్టార్ ప్లేయర్లను కొనేందుకు ఎవరూ ఆసక్తి చూపించలేదు. భారత పేసర్ రేణుకా సింగ్ రూ.60 లక్షలకు గుజరాత్ జెయింట్స్ గూటికి చేరింది. సెమీఫైనల్లో టీమిండియాపై సెంచరీ బాదిన ఆస్ట్రేలియా అమ్మాయి ఫొబె లిచ్‌ఫీల్డ్ రూ. 1.20 కోట్లు, గత సీజన్‌లో ఢిల్లీని నడిపించిన మేగ్ లానింగ్‌ను రూ.1.9కోట్లకు యూపీ వారియర్స్, ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ సోఫీ ఎకిల్‌స్టోన్‌ను రూ.80 లక్షలకు యూపీ,




న్యూజిలాండ్ ఆల్‌రౌండర్ అమేలియా కేర్‌ను ముంబై ఇండియన్స్ రూ.3 కోట్లకు సొంతం చేసుకున్నాయి. న్యూజిలాండ్ కెప్టెన్ సోఫీ డెవినె రూ.2కోట్లు పలికింది. ఆల్‌రౌండర్ అయిన డెవినె కోసం ఢిల్లీ, యూపి వారియర్స్ పోటీపడ్డాయి. చివరకు ఢిల్లీ భారీ ధరతో కివీస్ స్టార్‌ను కొన్నది. టీమిండియా విజయంలో కీలకపాత్ర పోషించిన స్పిన్నర్ శ్రీ చరణి కోటి కొల్లగొట్టింది.
గత సీజన్‌లో రూ.55 లక్షలకే తీసుకున్న ఢిల్లీ ఈసారి రూ.1.30 కోట్లకు సొంతం చేసుకుంది. వరల్డ్ కప్‌లో భారత జట్టు విజయాల్లో కీలకమైన పేసర్ క్రాంతి గౌడ్ రూ.1.50 కోట్లు పలికింది. ఆల్‌రౌండర్ రాధా యాదవ్‌ను రాయల్ ఛాలెంజర్స్ రూ.65 లక్షలకు, స్పిన్నర్ ఆశా శోభనను యూపీ రూ.1.10 కోట్లకు దక్కించుకున్నాయి. లైన్ అండ్ లెంగ్త్‌తో బ్యాటర్లను ఇరుకున పెట్టే పేస్ గన్ ఇంగ్లండ్ పేసర్ లారెన్ బెల్‌ను ఆర్సీబీ రూ.90 లక్షలకు దక్కించుకుంది.

# బిట్‌కాయిన్ 91,000 డాలర్లు

## వారం రోజుల్లో ఇదే తొలిసారి...

### పెద్ద ఇన్వెస్టర్లు మొగ్గు


### ఫెడ్ వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలతో మళ్లీ జోరుగా కొనుగోళ్లు

**న్యూయార్క్, నవంబరు 27:** బిట్‌కాయిన్ మళ్ళీ పుంజుకుంది. వారం రోజుల పతనం తర్వాత 91,000 డాలర్లు దాటింది. షార్ట్ సెల్లింగ్ క్లోజ్ అవ్వడం, పెద్ద ఇన్వెస్టర్ల కొనుగోళ్లు, వడ్డీ రేట్లు తగ్గుతాయనే అంచనాలు దీనికి కారణాలు. ఇథేరియం, ఇతర క్రిప్టోలు కూడా జోష్‌లో ఉన్నాయి. మార్కెట్ కాస్త స్థిరపడినా, భవిష్యత్తులో పెద్ద కదలికలు ఉండొచ్చు. అతి పెద్ద క్రిప్టోకరెన్సీ బిట్‌కాయిన్ (బిటిసి)



చాలా రోజుల తర్వాత లాభాల్లోకి మళ్లింది. గత వారం రోజుల్లో మొదటిసారి ధర 91,000 డాలర్లు దాటింది. దీంతో నెల రోజుల డౌన్ ట్రెండ్ వల్ల భారీగా నష్టపోయిన క్రిప్టో ఇన్వెస్టర్లకు ఇప్పుడు కాస్త ఉపశమనం లభించినట్లు అయింది. మార్కెట్ స్థిరంగా ఉన్నందున ఇన్వెస్టర్లు మళ్లీ కొనుగోళ్లు ప్రారంభించారు. ఫలితంగా బుధవారం బిట్ కాయిన్ ధర 4 శాతానికిపైగా పెరిగింది.
అమెరికా మార్కెట్లో, బుధవారం ఇంట్రాడేలో బిట్‌కాయిన్ ధర 4 శాతం జంప్ చేసి 91,280 డాలర్లకు చేరింది. ఇథేరియం కూడా 4 శాతానికిపైగా పెరిగి 3,034 డాలర్లకు చేరింది. ఇతర క్రిప్టోల్లో కూడా జోష్ కన్పించింది. ఎక్స్‌ఆర్‌పి, బిఎన్‌బి, సొలానా, ట్రాన్, డోజ్ కాయిన్, కార్డనో, హైపర్ లిక్విడ్ కూడా ఇవన్నీ 4 శాతానికిపైగా ర్యాలీ చేశాయి.
కాగా, అక్టోబర్ మొదట్లో బిట్ కాయిన్ రికార్డు స్థాయిలో 1,26,000 డాలర్లకు చేరింది. ఆ స్థాయితో పోలిస్తే ఇప్పుడు 28శాతం తక్కువ ధర వద్ద ట్రేడ్ అవుతోంది. ఇది భారీ పతనం కాదు. మళ్లీ నెమ్మదిగా రికవరీ అవుతోంది.
చాలా మంది క్రిప్టో ఇన్వెస్టర్లు బిట్ కాయిన్ ఇంకా పడిపోతుందని భావించి షార్ట్ సెల్ చేశారు. కానీ ధర పైకి వెళ్లడం చూసి కొంటున్నారు. గత పొజిషన్లు క్లోజ్ చేస్తున్నారు. దీంతో బిట్‌కాయిన్ మరింత పైకి దూసుకెళ్తోంది. ఇనిస్టిట్యూషన్ ఇన్వెస్టర్లు కూడా మళ్లీ బిట్‌కాయిన్ కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. గత 4 రోజుల్లో 2 రోజులు బిటిసి ఇటిఎఫ్‌కి ఇన్‌ఫ్లో వచ్చింది. పెద్ద పెట్టుబడిదారులు మళ్లీ కొంటున్నారు. ఎక్స్‌చేంజ్‌ల నుంచి 1.8 మిలియన్ బిట్‌కాయిన్ కొనుగోలు చేశారు. ఇది బైయింగ్ సిగ్నల్. అమెరికా ఫెడరల్ రిజర్వ్ వడ్డీ రేట్లు తగ్గించే అవకాశం ఉండటం కూడా బిట్‌కాయిన్‌కు బూస్ట్ ఇస్తోంది. డిసెంబర్‌లో రేట్ కట్ ఉండొచ్చని భావిస్తున్నారు.

వాణిజ్యం



## ట్రేడింగ్‌లో సరికొత్త శిఖరాలకు

# స్టాక్ మార్కెట్లు

### సెన్సెక్స్ 86026, నిఫ్టీ 26,306

### ఆపై స్వల్ప లాభాలతో ముగింపు

### మిడ్‌క్యాప్ లాభపడగా, స్మాల్‌క్యాప్ సూచీ నష్టపోయిన వైనం

### బ్యాంకింగ్, ఐటి షేర్లలో కొనుగోళ్లు.. ఆటో, మెటల్ షేర్లలో అమ్మకాలు

### జిడిపి గణాంకాలు, ఆర్‌బిఐ పాలసీపై మార్కెట్ దృష్టి

**ముంబై, నవంబరు 27:** దేశీయ స్టాక్ మార్కెట్లు గురువారం సరికొత్త రికార్డులు సృష్టించాయి. ట్రేడింగ్ సమయంలో చారిత్రాత్మక గరిష్ఠాలను తాకినప్పటికీ, చివరికి స్వల్ప లాభాలతో ఫ్లాట్‌గా ముగిశాయి. భారత స్టాక్ మార్కెట్ల సరికొత్త చరిత్ర తొలిసారిగా 86,000 మార్కును దాటిన సెన్సెక్స్ 26,306 వద్ద ఆల్ టైమ్ గరిష్ఠానికి చేరిన నిఫ్టీ వెల్లువెత్తిన విదేశీ పెట్టుబడులు వడ్డీ రేట్ల తగ్గింపుపై పెరిగిన అంచనాలు.. భారత స్టాక్ మార్కెట్లు సరికొత్త చరిత్ర సృష్టించాయి. గురువారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్, నిఫ్టీ సూచీలు ఆల్ టైమ్ గరిష్ఠ స్థాయులను నమోదు చేశాయి. సెన్సెక్స్ తొలిసారిగా 86,000 మార్కును దాటి 86,026.18 వద్ద కొత్త రికార్డు సృష్టించగా, నిఫ్టీ సైతం 26,306.95 వద్ద జీవనకాల గరిష్ఠాన్ని తాకింది.
మరోవైపు ప్రపంచ మార్కెట్ల నుంచి వస్తున్న సానుకూల సంకేతాలు కూడా సూచీల ర్యాలీకి దోహదపడ్డాయి. అమెరికా ఫెడరల్ రిజర్వ్ డిసెంబర్‌లో వడ్డీ రేట్లను తగ్గిస్తుందన్న అంచనాలు 85 శాతానికి చేరడంతో అంతర్జాతీయంగా ఇన్వెస్టర్లలో ఉత్సాహం నెలకొంది. దీనికి తోడు వచ్చే వారం ఆర్‌బీఐ ద్రవ్య పరపతి విధాన సమావేశం జరగనున్న నేపథ్యంలో మదుపరులు సానుకూలంగా వ్యవహరిస్తున్నారు.
నిఫ్టీ50లో బజాజ్ ఫైనాన్స్, శ్రీరామ్ ఫైనాన్స్, ఏషియన్ పెయింట్స్, బజాజ్ ఫిన్‌సర్వ్, లార్సెన్ అండ్ టూబ్రో వంటి షేర్లు 2 శాతం వరకు లాభపడి మార్కెట్లకు మద్దతుగా నిలిచాయి. ఆసియా, అమెరికా మార్కెట్లు కూడా లాభాల్లో ట్రేడ్ అవ్వడం దేశీయ సూచీల జోరుకు అదనపు బలాన్నిచ్చింది. బుధవారం ఒక్కరోజే రూ. 4,778.03 కోట్ల విలువైన భారత ఈక్విటీలను కొనుగోలు చేయడం మార్కెట్లకు భారీ ఊతమిచ్చింది.
అయితే ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 110.87 పాయింట్లు లాభపడి 85,720.38 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 10.25 పాయింట్ల స్వల్ప లాభంతో 26,215.55 వద్ద నిలిచింది.
బ్రాడర్ మార్కెట్లలో మిశ్రమ స్పందన కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.08 శాతం లాభపడగా, స్మాల్‌క్యాప్ 100 సూచీ 0.53 శాతం నష్టపోయింది. రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్, ఐటీ, ఎఫ్‌ఎంసీజీ రంగాల్లో కొనుగోళ్ల మద్దతు లభించింది. అయితే, ఆటో, మెటల్, ఎనర్జీ, రియల్టీ వంటి రంగాల్లో అమ్మకాల ఒత్తిడి కనిపించింది. సెన్సెక్స్ కంపెనీలలో బజాజ్ ఫైనాన్స్, ఐసీఐసీఐ బ్యాంక్, హిందుస్థాన్ యూనిలీవర్, బజాజ్ ఫిన్‌సర్వ్, హెచ్‌సీఎల్ టెక్ ప్రధానంగా లాభపడ్డాయి.
రేపు వెలువడనున్న జీడీపీ గణాంకాలు, అమెరికాభారత్ ఒప్పందం, రాబోయే ఆర్‌బీఐ పాలసీ సమావేశం వంటి కీలక అంశాలపై ఇన్వెస్టర్లు దృష్టి సారించారు. మార్కెట్ తదుపరి దిశను ఈ పరిణామాలు నిర్దేశిస్తాయని నిపుణులు భావిస్తున్నారు.

# రియల్ ఎస్టేట్‌లో హైదరాబాద్ నం.2

## బడ్జెట్ ఇళ్ల విభాగంలో 35 శాతం వృద్ధి నమోదు

## లగ్జరీలో 41శాతం, మిడ్ రేంజ్‌లో 49శాతం వృద్ధి

**న్యూఢిల్లీ, నవంబరు 27:** రియల్ ఎస్టేట్‌లో దేశంలోని ప్రధాన నగరాల్లో సరాసరి 50శాతం వృద్ధి నమోదైంది. ప్రధానంగా హౌసింగ్ మార్కెట్‌లో దేశ రాజధాని ఢిల్లీ టాప్‌లో నిలిచినా, బడ్జెట్ ఇళ్లు, మిడ్ రేంజ్ విభాగాల్లో హైదరాబాద్ గణనీయమైన వృద్ధి సాధిస్తోంది. గత మూడేళ్లుగా భారతదేశ హౌసింగ్ మార్కెట్‌లో పెద్ద మార్పు వచ్చింది. లగ్జరీ ఇళ్ల కొనుగోళ్లు బాగా పెరిగాయి. అంతేస్థాయిలో మిడ్ రేంజ్, బడ్జెట్ ఇళ్ల విభాగాల్లోనూ అనూహ్య మార్పులు చోటుచేసుకున్నాయి. ప్రగతికారక నగరాలుగా గుర్తింపు పొందిన హైదరాబాద్, బెంగళూరు సిటీలు ముంబై, ఢిల్లీని ఢీకొడుతున్నాయి. తాజాగా ఎఎన్ఎఆర్‌ఓసికె విడుదల చేసిన డేటా ప్రకారం.. ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, పుణె వంటి ప్రముఖ నగరాలలో అన్ని బడ్జెట్ విభాగాలలో అత్యధికంగా గృహాల ధరల పెరుగుదలను నమోదు చేసింది. అదేంటంటే.. 2022 నుండి 2025 మధ్యకాలంలో లగ్జరీ, మిడ్‌రేంజ్ ఇంకా బడ్జెట్ గృహాల విభాగాలలో దేశంలోని అన్ని ఇతర నగరాల



కంటే ఢిల్లీ ఎన్‌సీఆర్ అగ్రస్థానంలో ఉంది. ఈ అనూహ్య వృద్ధి భారతీయ రియల్ ఎస్టేట్ మార్కెట్‌లో ప్రధాన కేంద్రంగా ఎన్‌సీఆర్‌ను నిలబెట్టింది. ప్రస్తుతం మార్కెట్లో సుమారు రూ.1.5 కోట్ల కంటే ఎక్కువ ధర ఉన్న లగ్జరీ ఇళ్లే ఎక్కువగా అమ్ముడవుతున్నాయి. గత మూడేళ్లలో అగ్రగామి ఏడు నగరాల్లో లగ్జరీ ఇళ్ల ధరలు సగటున 40శాతం పెరిగాయని ఎఎన్ఎఆర్‌ఓసికె రిపోర్ట్‌లో తేలింది. ఢిల్లీ ఎన్‌సీఆర్‌లో అయితే లగ్జరీ ఇళ్ల ధరల పెరుగుదల ఏకంగా 72శాతం పెరిగింది. ఈ పెరుగుదల ముంబైలో 43శాతం, బెంగళూరులో 42 శాతం, హైదరాబాద్‌లో 41శాతంగా ఉంది. ఈ విపరీతమైన పెరుగుదల ఎన్‌సీఆర్‌ను ముంబై మెట్రోపాలిటన్ రీజియన్, బెంగళూరు వంటి ఖరీదైన మార్కెట్ల కంటే ముందు నిలబెట్టింది. ముంబై ఇప్పటికీ అత్యంత ఖరీదైన లగ్జరీ మార్కెట్‌గా ఉన్నప్పటికీ.. ధరల పెరుగుదల వేగంలో మాత్రం ఎన్‌సీఆర్ అగ్రస్థానం దక్కించుకుంది. మిడ్‌రేంజ్ విభాగంలోనూ ఢిల్లీనే అగ్రస్థానంలో నిలిచింది. రూ.40 లక్షల నుండి రూ.1.5 కోట్ల మధ్య ధర కలిగిన మిడ్‌రేంజ్ ఇళ్ల విభాగంలో కూడా ఢిల్లీ 54శాతం పెరుగుదలతో ముందంజలో ఉంది. ఈ విభాగంలో బెంగళూరు 62, హైదరాబాద్ 49శాతం పెరుగుదలను చూశాయి.

**బడ్జెట్ ఇళ్ల విభాగంలో..**

అంటే రూ.40 లక్షల కంటే తక్కువ ధర ఉన్న సరసమైన గృహాల విభాగం మాత్రం దేశవ్యాప్తంగా నెమ్మదిగా వృద్ధిని నమోదు చేసింది. కేవలం 26 శాతం మాత్రమే ఉంది. డిమాండ్ తక్కువగా ఉండటం, కొత్త ప్రాజెక్ట్‌లు తక్కువగా ప్రారంభించడం దీనికి కారణం. అయినా ఇక్కడ కూడా ఎన్‌సీఆర్ మినహాయింపుగా నిలిచింది. ఎన్‌సీఆర్‌లో సరసమైన గృహాల ధరలు 48శాతం పెరిగాయి. ఆ తర్వాత 35శాతం వృద్ధితో హైదరాబాద్ రెండవ స్థానంలో ఉంది. మొత్తం రియల్ ఎస్టేట్ మార్కెట్‌పై ఎన్‌సీఆర్ ఆధిపత్యాన్ని ఇది స్పష్టం చేస్తోంది.

**ఢిల్లీ ఇంత బలంగా ఎందుకు ఉంది?**

పొల్యూషన్ కు, జన సాంద్రతకు ఢిల్లీ పెట్టింది పేరు. ఇక్కడ నివసించడానికి పెద్దగా ఇష్టపడరు అని అందరూ అనుకుంటారు. కానీ, దీనికి భిన్నంగా రియల్ ఎస్టేట్ రంగంలో ఢిల్లీ దూసుకుపోవడం అందర్నీ ఆశ్చర్యపరుస్తుంది. అక్కడ ఏర్పాటుచేస్తున్న కొత్త మౌలిక సదుపాయాలు, అన్ని రకాల బడ్జెట్‌లకు అనుకూలంగా ప్రాజెక్ట్‌లు ఏర్పాటు చేయడం వంటివి దీనికి ప్రధానం కారణాలుగా ఉన్నాయి. డెవలపర్లు ఇప్పుడు సరసమైన గృహాలపై కాకుండా మిడ్ రేంజ్, ప్రీమియం హౌసింగ్‌పై ఎక్కువ దృష్టి సారిస్తున్నారు. ఈ అవకాశాలు ఢిల్లీలోనే ఎక్కువగా ఉన్నాయి. అందుకే అక్కడి మార్కెట్ వేగంగా దూసుకెళ్తుంది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. ... Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/09-10 Responsible for selection of News under the PRB Act. Regd.: No.H/SD/337/12-14